www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

రేపటికల్లా తుఫాన్!

బంగాళాఖాతంలో అల్పపీడనం.. నేడు మరింత బలోపేతం

దక్షిణ కోస్తా, సీమకు భారీ వర్ష సూచన.. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు రెడ్ అలెర్ట్

17న చెన్నై సమీపంలో తీరం దాటుతుందని అంచనా



14 సోమవారం నెల్లూరులో దట్టంగా కమ్మిన కారుమబ్బులు

మంగళవారం | 15-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 180 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 12.19 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 10.08 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.17, రా. 9.53-10.41; అమృతఘడియలు: మ. 2.59-4.25; రాహుకాలం: ఉ. 3.00-4.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కిక్కు.. లక్కు!

లిక్కర్ షాపులకు 'లాటరీ' పూర్తి.. రాష్ట్రవ్యాప్తంగా సాఫీగా ప్రక్రియ

ప్రభుత్వ మద్యం షాపులకు బైబై

రేపటి నుంచి ప్రైవేటు దుకాణాలు

వారంలోపు క్వార్టర్ రూ.99 మద్యం

బడా సిండికేట్లకు దక్కని లక్కు

వందల్లో దరఖాస్తులు వేసినా అరకొర షాపులే

ఎన్టీఆర్‌లో 520 దరఖాస్తులకు 11 షాపులు

కర్నూలులో 246 దరఖాస్తులు వేసినా నిరాశే

గుంటూరులో 192 వేస్తే ఒక్కటే షాపు

త్వరలో అన్ని బ్రాండ్లూ అందుబాటులోకి: మంత్రి

● జోరు వానలో.. కట్టు కదలక..



ఒంగోలులో మద్యం షాపుల లాటరీ కోసం తరలివచ్చిన దరఖాస్తుదారులు వర్షంలోనూ కదలకుండా గొడుగులు వేసుకొని వేచిచూస్తున్న దృశ్యం

జగన్ హయాంలో కేంద్రీకృతంగా మారిన మద్యం వ్యాపారానికి ఇక చెల్లు! కమీషన్లు ఇచ్చిన కంపెనీల సరుకు మాత్రమే విక్రయించిన కాలం పోయింది! 'దుకాణం మాదే... వ్యాపారం మాదే' అంటూ ఐదేళ్లు అమ్మిన 'జే-బ్రాండ్' మద్యం దందాకు మంగళవారమే ఆఖరి రోజు! ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఇక కాలం చెల్లింది! కొత్త మద్యం విధానంలో భాగంగా... బుధవారం నుంచి ప్రైవేటు దుకాణాలు తెరుచుకోనున్నాయి. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా లాటరీ ద్వారా లైసెన్సీల ఎంపిక పూర్తయింది. 'కిక్కు, లక్కు' దక్కించుకున్న వారు సంబరాలు చేసుకున్నారు. భారీగా దరఖాస్తులు సమర్పించినా షాపులు దక్కక కొన్ని సిండికేట్లు షాక్ తిన్నాయి. ఒకటి రెండు దరఖాస్తులే వేసినా కొందరిని అదృష్టం వరించింది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా 3,396 మద్యం షాపులకు నోటిఫికేషన్ జారీచేయగా 89,882 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం అన్ని జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపిక చేశారు. సాంకేతికంగా చిన్నపాటి పొరపాట్లు మినహా ఎక్కడా గొడవలు, వివాదాలు లేకుండా ప్రక్రియను సజావుగా నిర్వహించారు. మధ్యాహ్నం 3.30గంటల కల్లా మొత్తం షాపులకు లైసెన్సీల ఎంపిక పూర్తయింది. లాటరీలో దుకాణం దక్కిన వారికి అప్పటికప్పుడే లైసెన్సు పత్రాలు అందజేశారు. ఆ వెంటనే లైసెన్సు ఫీజు చెల్లించే

మిగతా 13వ పేజీలో...

ఆశ.. నిరాశ!

విజయనగరం జిల్లాలో మద్యం వ్యాపారుల సిండికేట్ 500కు పైగా దరఖాస్తులు వేసింది. కానీ... లాటరీలో 8 షాపులే వచ్చాయి. ఇదే జిల్లాలో టీడీపీ నేత ఒకరు 25 దరఖాస్తులు వేయగా ఒకే ఒక్క షాపు దక్కింది. వైసీపీ నేత 50 దరఖాస్తులు వేయగా మూడు షాపులు వచ్చాయి.

ప్రగతి పరుగు

నూతన పారిశ్రామిక పాలసీల లక్ష్యం ఇదే కావాలి

అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

ఉద్యోగ కల్పనకు పెద్దపీట వేస్తూ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా దూసుకెళ్లాలి

ముందు వచ్చిన కంపెనీలకు అదనపు ప్రోత్సాహకాలు

ఎక్కువ ఉద్యోగాలిస్తే 10% అదనపు ఇన్సెంటివ్‌లు

ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 5 శాతం అదనం

అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

స్టార్టప్స్, ఫెసిలిటేషన్ కేంద్రంగా అమరావతి



పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ కొత్త పాలసీపై అధికారులతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్

13



కంకిపాడులో 'పల్లె పండుగ' కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. చిత్రంలో మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, కృష్ణా కలెక్టర్ బాలాజీ

పనుల పండుగ

ప్రజలంతా పాలుపంచుకోవాలి: పవన్

30 వేల పనులు.. 4,500 కోట్ల వ్యయం

జనమే గ్రామ సభల్లో తీర్మానించుకున్నారు

వీటిలో ప్రజాప్రతినిధుల ప్రమేయం లేదు

సంక్రాంతికి పనులు పూర్తయ్యేలా ప్రణాళిక

అధికార యంత్రాంగం బాధ్యతగా మెలగాలి

గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ మంత్రి ఎవరో కూడా తెలియని దౌర్భాగ్యం

బ్రహ్మ పదార్థంలా నిధుల మళ్లింపు

12

చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి వరం

పాలనలో ఆయన చొరవ అద్భుతం

నిరంతరం ప్రజల గురించి ఆలోచిస్తారు

పల్లె పండుగ శ్రీకారంలో డిప్యూటీ సీఎం పవన్

దౌత్య యుద్ధం!

కెనడాపై భారత్ తీవ్ర ఆగ్రహం.. నిజ్జర్ హత్య కేసు ప్రకంపనలు

అనుమానితులుగా మన దౌత్యవేత్తలు

వారిని విచారించాల్సి ఉందన్న కెనడా

తీవ్రంగా స్పందించిన భారత్

కెనడాలోని దౌత్యవేత్తల ఉపసంహరణ

ఆరుగురు కెనడా దౌత్యవేత్తల బహిష్కరణ

19వ తేదీలోపు వెళ్లిపోవాలని ఆదేశం

ట్రూడో వైఖరిపై మండిపాటు

న్యూఢిల్లీ, అక్టోబరు 14: భారత వేర్పాటువాద శక్తులకు ఊతమిస్తూ, ఖలిస్థానీలకు అండగా నిలుస్తున్న కెనడా సర్కారు మరోసారి కయ్యానికి కాలు దువ్వింది. గత ఏడాది జరిగిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సహా పలువురు దౌత్యవేత్తలను అనుమానితులుగా (పర్సన్స్ ఆఫ్ ఇంట్రస్ట్) పేర్కొంది. వీరిని విచారించాల్సి ఉందంటూ భారత విదేశాంగ శాఖకు సమాచారం

మిగతా 2వ పేజీలో...



రాబిన్సన్ అసెమోగ్లు జాన్సన్

అసమానతలపై పరిశోధనకు

ఆర్థిక నోబెల్

2

అమెరికన్లు అసెమోగ్లు, జాన్సన్, రాబిన్సన్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం

దేశాల సంపద తేడాపై అధ్యయనం

టీడీపీ కార్యాలయంపై దాడి కేసు..

కోర్టులో చైతన్య లొంగుబాటు


14 రోజులు రిమాండ్ విధింపు

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి ముఖ్య అనుచరుడు

2

కూటమి ప్రభుత్వం రాగానే అజ్ఞాతంలోకి

ఆగు జర!



రపామైసిన్ ఔషధంతో వృద్ధాప్యానికి అడ్డుకట్ట?

పెరిగిన ఎలుకల జీవితకాలం

అమెరికా కుబేరుడు బ్రయాన్ జాన్సన్ వాడుతున్నదీ ఇదే!

దుష్ప్రభావాలూ ఉంటాయి.. ప్రయోగాలు జరగాలి: వైద్యులు

9



ఇక నాగాయలంకలో

క్షిపణి పరీక్షలు

2

బిష్ణోయ్.. నయా మాఫియా డాన్!

- 700 మంది షూటర్లు.. 5 రాష్ట్రాల్లో హల్‌చల్
- కెనడా సహా పలు దేశాల్లోనూ కార్యకలాపాలు!
- మూసేవాలా హత్యతో ఉత్తరాదిన సంచలనం
- సబర్మతి జైల్లో లారెన్స్.. అక్కడినుంచే హవా

న్యూఢిల్లీ, ముంబై, అక్టోబరు 14: వయసు 30 మాత్రమే.. కానీ, అంతే సంఖ్యలో కేసులు..! హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, ఆయుధాల రవాణా కిడ్నాప్‌లు.. ఒకటేమిటి అనేక నేరాలు..! ఎప్పుడంటే అప్పుడు స్పందించేలా 700 మంది షూటర్లతో గ్యాంగ్.. జైలు నుంచే కార్యకలాపాలు..! ఇప్పుడు అతడి పేరు చెబితే ఉత్తరాదిలోని ఐదు రాష్ట్రాల్లో వణుకు..! ఇదీ లారెన్స్ బిష్ణోయ్ నేర సామ్రాజ్యం. బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌పై గురిపెట్టి.. పంజాబీ గాయకుడు సిద్దూ మూసేవాలా.. మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్యతో మరింతగా చర్చనీయాంశమయ్యాడు. ఇంతకూ ఎవరీ లారెన్స్ బిష్ణోయ్ అంటే..?

కానిస్టేబుల్ కుమారుడు..

లారెన్స్ బిష్ణోయ్ 1993లో పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా ధత్తరన్‌వాలిలో పుట్టాడు. ఇతడి తండ్రి హరియాణా పోలీస్ కానిస్టేబుల్. కృష్ణ జింకలను అమితంగా ఆరాధించే బిష్ణోయ్ వర్గానికి చెందిన లారెన్స్ చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో చదివే సమయంలో విద్యార్థి నాయకుడు. ఇదే క్రమంలో గోల్డీ బ్రార్ పరిచయమై నేర సామ్రాజ్యంలోకి అడుగుపెట్టాడు. కాలేజీ గ్యాంగ్ వార్‌లో తన స్నేహితురాలిని సజీవ దహనం చేయడం.. లారెన్స్‌లో తీవ్ర కసిని పెంచింది. రాజస్థాన్‌లో కృష్ణ జింకలను చంపిన కేసులో నిందితుడైన సల్మాన్‌ఖాన్‌ను హత్య చేసేందుకు



ప్రణాళిక వేయడం ద్వారా లారెన్స్ వార్తల్లోకెక్కాడు. ఇతడి గ్యాంగ్ కార్యకలాపాలు పంజాబ్, ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లకు విస్తరించాయి. ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతి జైల్లో ఉన్న లారెన్స్.. ఇతర ఖైదీల ద్వారా సెల్‌ఫోన్లు సంపాదిస్తూ తమ గ్యాంగ్‌కు ఆదేశాలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సమాజంలో పేరున్న, డబ్బున్నవారిని, పంజాబీ గాయకులు, మద్యం వ్యాపారులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారు. లారెన్స్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్, గోల్డీ బ్రార్‌లు కెనడాలో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారు. లారెన్స్‌ను హత్య చేసేందుకు ఢిల్లీ మాఫియా తీవ్రంగా ప్రయత్నిస్తుండడంతో అతడిని కోర్టులకు గట్టి భద్రత మధ్య తరలించాల్సి వస్తోంది. కాగా, బాబా సిద్దిఖీనే కాక ఆయన కుమారుడు జీషన్ సిద్దిఖీ కూడా బిష్ణోయ్ గ్యాంగ్ హిట్ లిస్ట్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాబా హత్య కేసులో పట్టుబడిన నిందితులు ఈ విషయం వెల్లడించారన్నారు.

ఫోన్‌పే టపాసుల బీమా పాలసీ

రూ.9 ప్రీమియంతో రూ.25వేల వరకు కవరేజీ

న్యూఢిల్లీ, అక్టోబరు 14: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా సంబంధిత ప్రమాదాలు జరిగితే బీమా రక్షణ కల్పించేందుకు వీలుగా డిజిటల్ చెల్లింపుల దిగ్గజం ఫోన్‌పే సరికొత్త ఫైర్‌క్రాకర్ బీమా పాలసీని తెచ్చింది. ఈ ప్లాన్ కింద వినియోగదారులు రూ.9 ప్రీమియం చెల్లించి రూ.25వేల వరకు బీమా కవరేజీని పొందవచ్చని సోమవారం కంపెనీ పేర్కొంది. ఈ నెల 25వ తేదీ నుంచి 10 రోజుల పాటు కవరేజీని పొందవచ్చని తెలిపింది. టపాసుల సంబంధిత ప్రమాదాల నుంచి ఈ పాలసీ రక్షణ కల్పిస్తుందని పేర్కొంది. ఫోన్‌పే యాప్ ద్వారా ఈ పాలసీని కొనుగోలు చేయవచ్చు. వినియోగదారుతోపాటు భాగస్వామి, ఇద్దరు పిల్లలకు కూడా సమగ్ర కుటుంబ కవరేజీని అందిస్తోంది. అక్టోబరు 25 తర్వాత పాలసీని కొనుగోలు చేస్తే కొన్ని రోజు నుంచి పాలసీ కవరేజీ ప్రారంభమవుతుందని ఫోన్‌పే పేర్కొంది. బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్‌తో కలిసి ఈ బీమా పథకాన్ని ఫోన్‌పే తీసుకొచ్చింది.

లోకం తీరు



ఆర్థిక అసమానతలపై పరిశోధనకు నోబెల్

ముగ్గురు అమెరికన్లను వరించిన పురస్కారం

అసిమోగ్లు, జాన్సన్, రాబిన్సన్‌కు ఆర్థిక నోబెల్

స్టాక్‌హోం, అక్టోబరు 14: ఆర్థిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం ఈ ఏడాది ముగ్గురిని వరించింది. సంపద విషయంలో దేశాల మధ్య అసమానతలపై చేసిన పరిశోధనలకుగానూ అమెరికాకు చెందిన ఆర్థికవేత్తలు డారోన్ అసిమోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఏ రాబిన్సన్‌లను నోబెల్ బహుమతికి ఎంపిక చేసినట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ సోమవారం ప్రకటించింది. వారికి పురస్కారంతోపాటు రూ.8.90 కోట్లు ప్రైజ్‌మనీ దక్కనుంది. ఒక దేశం ఆర్థికంగా ఎదగాలంటే సంస్థల ఏర్పాటు ప్రాముఖ్యతను అసిమోగ్లు, జాన్సన్, రాబిన్సన్.. తమ పరిశోధనల్లో నొక్కిచెప్పారు. కొన్ని దేశాలు ఆర్థికంగా ఎందుకు విజయం సాధిస్తున్నాయి, కొన్ని దేశాలు ఎందుకు విఫలమవుతున్నాయి అనే అంశాలను విశదీకరించారు. 'పేలవమైన చట్టపాలన కలిగిన సమాజాలు, జనాభాను దోపిడీ చేసే సంస్థలు.. వృద్ధిని కానీ, సమాజంలో మార్పును కానీ సృష్టించలేవని ఎందుకు చెబుతారో.. అవార్డు గ్రహీతల పరిశోధన ద్వారా అర్థం చేసుకోవచ్చు' అని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన నోబెల్ కమిటీ వెల్లడించింది. డారోన్ అసిమోగ్లు, సైమన్ జాన్సన్.. అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పనిచేస్తుండగా.. రాబిన్సన్ చికాగో యూనివర్సిటీలో పరిశోధనలు చేస్తున్నారు. 'దేశాల మధ్య ఆదాయాల్లో భారీ వ్యత్యాసాలను తగ్గించడం ప్రస్తుతం మన ముందున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. ఒక దేశం ఆర్థికంగా ఎదగాలంటే సామాజిక సంస్థల పాత్ర ఎంతో కీలకమని అవార్డు గ్రహీతలు తెలియజేశారు' అని స్వీడిష్ అకాడమీ ఎకనామిక్ సైన్సెస్ కమిటీ చైర్మన్ జాకబ్ స్వెన్సన్ అన్నారు. కాగా, గతవారం వైద్య విభాగంలో మొదలైన నోబెల్ బహుమతుల ప్రకటన సోమవారంతో ముగిసింది.

మానవతా మూర్తి.. మరిక సెలవు

- ప్రొఫెసర్ సాయిబాబాకు కన్నీటి వీడ్కోలు
- కడసారిగా హక్కుల ఉద్యమ నేతకు అంజలి
- గాంధీ మెడికల్ కాలేజీకి భౌతికకాయం అప్పగింత



ప్రొఫెసర్ సాయిబాబా భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల ఉద్యమ నేత, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబాకు పౌర సమాజం కన్నీటి వీడ్కోలు పలికింది. ప్రజా సంఘాలు, పౌర హక్కుల నేతలు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, జర్నలిస్టులు, మేధావులు తదితర పుర ప్రముఖులు ఆయన భౌతిక కాయానికి కడసారిగా నివాళులర్పించారు. అనారోగ్యంతో కన్నుమూసిన ప్రొఫెసర్ సాయిబాబా భౌతిక కాయాన్ని సోమవారం ఉదయం 8 గంటలకు నిమ్స్ ఆస్పత్రి నుంచి గన్‌పార్కులోని తెలంగాణ అమరుల స్థూపం వద్దకు తీసుకెళ్లారు. అయితే, భౌతిక కాయాన్ని అక్కడ ఉంచడానికి వీల్లేదంటూ పోలీసులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. అనంతరం భౌతిక కాయాన్ని మౌలాలి జవహర్‌నగర్‌లోని సాయిబాబా సోదరుడి నివాసానికి తరలించారు. అక్కడ వేల మంది సాయిబాబా భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. కళా నాట్యమండలి కళాకారులు సాయిబాబా జీవిత విశేషాలపై ఉద్యమ గీతాలు ఆలపించారు. సాయిబాబాను కడసారి చూసేందుకు వచ్చిన వారితో జవహర్‌నగర్ జనసంద్రమైంది. మధ్యాహ్నం 3 గంటలకు జవహర్‌నగర్ నుంచి ర్యాలీగా సాయిబాబా భౌతిక కాయాన్ని తీసుకొచ్చి గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

ఎదురుచూసినంత సేపు పట్టలేదు..

సాయిబాబా రాక కోసం ఎదురుచూసినంత సేపు పట్టలేదు.. మమ్మల్ని వదిలి దూరమవడానికి. 7 నెలలకిందట విడుదలైనా, కంటి నిండా చూసుకున్నది లేదు. మనసు విప్పి మాట్లాడుకున్నది లేదు. హైదరాబాద్‌కు వచ్చాక ఆస్పత్రిలోనే ఎక్కువ సమయం అయిపోయింది. తన జైలు అనుభవాలను రాయాలనుకున్నారు. **-వసంత, సాయిబాబా జీవిత సహచరి**

నాన్నతో ఎన్నో మాట్లాడాలనుకున్నా..

నాన్నతో నాకు చిన్నప్పటి నుంచి అనుబంధం ఎక్కువ. మా ఇద్దరి ఆలోచనలు ఒక్కటే అనడానికి నాన్నలాగే నాకూ ఆంగ్ల సాహిత్యం అంటే చాలా ఇష్టం. అదే సబ్జెక్టులో ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నాను. చనిపోవడానికి వారం ముందు నుంచి ఆయన తీవ్రమైన నొప్పులతో బాధపడుతున్నారు. అయినా, పుస్తకాలు చదివారు. నాన్న చదివిన చివరి పుస్తకం పాలస్తీనియన్లకు మద్దతుగా మౌమితా ఆలం రచించిన 'ది స్మెల్ ఆఫ్ ఆజాదీ' కవిత్వం. 'కార్ల్‌మార్క్స్ తాత్విక రచనలు' పుస్తకం నా చేతికి ఇస్తూ, ఇది నువ్వు కూడా చదివితే చర్చిద్దాం అని అన్నారు. నాన్నతో ఎన్నో విషయాలు మాట్లాడాలనుకున్నాను. ఇంత తొందరగా దూరమవుతారని అనుకోలేదు. **- మంజీర, సాయిబాబా కుమార్తె**

నిరంకుశ పాలనపై నైతిక గెలుపు..

నిరంకుశ పాలనలో జైలులో నరక యాతన అనుభవించి నిర్దోషిగా బయటకు వచ్చిన సాయిబాబా మరణం సమాజానికి తీరని లోటు. చనిపోయినా.. నైతిక విజయం ఆయనదే. ఆయన చాలా చెప్పాలనుకున్నారు. జీవితం గురించి, అనుభవించిన కష్టాల గురించి, సమాజం గురించి ఎంతో చెప్పాలనుకున్నారు. అంతలోపే ఆయనను మరణం తీసుకెళ్లింది. ఆయన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. **- కె.శ్రీనివాస్, ఎడిటర్, ఆంధ్రజ్యోతి**

ఇస్రో చైర్మన్‌కు 'ఐఏఎఫ్ వరల్డ్ స్పేస్ అవార్డు'

న్యూఢిల్లీ, అక్టోబరు 14: ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మక 'ఐఏఎఫ్ వరల్డ్ స్పేస్ అవార్డు-2024'ను ఆయన సోమవారం మిలాన్‌లో అందుకున్నారు. గత ఏడాది చంద్రయాన్-3 మిషన్ ద్వారా ఇస్రో సాధించిన విజయానికి గుర్తుగా అంతర్జాతీయ ఆస్ట్రోనాటికల్ ఫెడరేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది.

నాగాయలంకలో క్షిపణి పరీక్ష కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటు చేయనున్న క్షిపణి పరీక్ష కేంద్రానికి లైన్ క్లియర్ అయ్యింది. కృష్ణా జిల్లాలోని నాగాయలంకలో దీన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ప్రధాని మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) ఇటీవలే ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో నాగాయలంకలో కొత్త క్షిపణి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఇక్కడ కొత్తగా ఏర్పాటు చేసే కేంద్రంలో డీఆర్‌డీవో అభివృద్ధి చేసే భూమిపై నుంచి గాల్లోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థలు, యాంటీ ట్యాంక్ క్షిపణులు, వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థలను పరీక్షిస్తారు.

నదుల దురాక్రమణను

ఎలా అరికడుతున్నారు?

పర్యావరణ క్షీణత నుంచి నదులను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలేంటి?

- కేంద్ర సంస్థలకు సుప్రీంకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోని నదీ పరివాహక ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న దురాక్రమణలు, అక్రమ నిర్మాణాలతో నదుల పర్యావరణ వ్యవస్థకు నష్టం జరుగుతుండడంతోపాటు తరచూ వరదలు సంభవిస్తుండడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఆక్రమణలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలంటూ కేంద్ర పర్యావరణ, అటవీశాఖ, జలశక్తి మంత్రిత్వ శాఖ, భూశాస్త్ర విభాగం, జల సంఘం, కాలుష్య నియంత్రణ మండలి తదితర కేంద్ర సంస్థలకు నోటీసులు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా పెరిగిపోవడం.. పర్యావరణం, జీవావరణం, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందంటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అశోక్‌కుమార్ రాఘవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందిస్తూ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ నోటీసులు జారీ చేసింది. కాగా, అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాల వల్ల భారీ ఉత్పాతాలు, తరుచూ వరదలు సంభవిస్తున్నాయని. కీలకమైన మౌలిక సదుపాయాలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని పిటిషనర్ తెలిపారు. 1986లో ఆమోదించిన పర్యావరణ (పరిరక్షణ) చట్టం కింద ఈ అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవడం కేంద్ర పర్యావరణ అటవీశాఖ కీలక బాధ్యతగా ఆయన పేర్కొన్నారు. 2015 నుంచి నదుల పరిరక్షణ జోన్ లేదా నదుల నియంత్రణ జోన్‌ను నోటిపై చేయకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. నదుల అక్రమ ఆక్రమణల వల్ల భూగర్భ జలాలు కూడా ఇంకిపోతున్నాయని, నీటి కొరతకు కూడా దారి తీస్తుందని, దీంతో దేశంలో నీటి భద్రతకు ముప్పు ఏర్పడుతుందని పిటిషన్‌లో వివరించారు. నదులను కాపాడేందుకు కఠినమైన నిబంధలను రూపొందించాలని, నదుల పరిరక్షణ జోన్‌పై వెంటనే నోటిఫికేషన్ జారీ చేసేలా చూడాలని సుప్రీంకోర్టును కోరారు. దీంతో పర్యావరణ క్షీణత నుంచి దేశంలోని నదులను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించాలంటూ నోటీసుల్లో సుప్రీంకోర్టు పేర్కొంది. కాగా, తెలంగాణలో నదుల పరిక్షణకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కొవిడ్ వ్యాక్సిన్ ప్రతికూలతలపై ఇప్పుడు పిటిషన్ ఎందుకు?

కరోనా వ్యాక్సిన్ ప్రతికూల ప్రభావాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. వ్యాక్సిన్ కారణంగా రక్తం గడ్డకట్టడం వంటి ప్రతికూల ప్రభావాలు కనిపించాయని పేర్కొంటూ ప్రియా మిశ్ర, మరికొందరు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. పరిశీలించిన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం..ఇది కేవలం సంచలనం కోసం వేసిన వ్యాజ్యమని అభిప్రాయపడింది. "ఈ పిటిషన్ వల్ల ఏమి ఉపయోగం? ఒకవేళ వ్యాక్సిన్ తీసుకోకపోయి ఉంటే కలిగే దుష్పరిణామాలపైనా ఆలోచించండి" అని పిటిషన్ తరపు న్యాయవాదిని ఉద్దేశించి వ్యాఖ్యానించింది.

అభిషేక్‌కు బెయిల్

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో నిందితుడు అభిషేక్ బోయినపల్లికి సుప్రీంకోర్టు సోమవారం సాధారణ బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అభిషేక్‌ను 2022లో అరెస్టు చేసి తిహాడ్ జైలుకు పంపించింది. అయితే, తన భార్య అనారోగ్యంతో బాధపడుతున్నారని అభిషేక్ సుప్రీంకోర్టులో మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఏడాది మార్చి 20న సుప్రీంకోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆ బెయిల్‌ను పొడిగిస్తూ వచ్చింది. అభిషేక్ సాధారణ బెయిల్ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో జస్టిస్ సుందరేశ్, జస్టిస్ అరవింద్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో నిందితులందరూ బెయిల్‌పై బయటే ఉన్నారని అభిషేక్ తరఫున న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అభిషేక్‌కు కూడా సాధారణ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఈడీ వాదనలు వినిపించాలని కోరగా.. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ఎటువంటి అభ్యంతరం తెలపలేదు. దీంతో కోర్టు అభిషేక్‌కు సాధారణ బెయిల్ మంజూరు చేసింది.

ముంబైలో కార్లకు టోల్ ఫ్రీ!

- నగరంలోకి ప్రవేశించే ఐదు బూత్‌ల్లో సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి
- ఎన్నికల కోడ్‌కు ముందు శిందే సర్కారు కీలక నిర్ణయం



ముంబై, అక్టోబరు 14: మహారాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ముంబై నగరంలోకి ప్రవేశించే ఐదు టోల్ బూత్‌ల్లో కార్ల (లైట్ మోటార్ వాహనాల)కు టోల్ ఫీజును మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వస్తుందని తెలిపింది. సీఎం ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. టోల్ బూత్‌ల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోందని, టోల్ ఫీజును రద్దు చేయాలని వాహనదారులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారని సీఎం శిందే క్యాబినెట్ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. అందుకే టోల్ ఫీజు రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం దహిసర్, ఎల్‌బీఎస్ రోడ్-ములుంద్, ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే-ములుంద్, ఎయిరోలి క్రీక్ బ్రిడ్జి, వాశి టోల్ బూత్‌ల్లో ఇకపై కార్లు, జీపులు, వ్యాన్లు, ఆటోలు, ట్యాక్సీలు, డెలివరీ వ్యాన్లు, చిన్నపాటి ట్రక్కులు టోల్ రుసుము చెల్లించకుండానే ప్రయాణించవచ్చు. రోజూ ఈ టోల్ బూత్‌ల గుండా 6 లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో 80 శాతం లైట్ మోటార్ వాహనాలేనని అధికారులు తెలిపారు. ఈ వాహనాలకు టోల్ రుసుమును రద్దు చేయడం వల్ల సమయం, ఇంధనం ఆదా అవడంతోపాటు కాలుష్యం తగ్గుతుందని సీఎం శిందే చెప్పారు. టోల్ రుసుము రద్దు చేయాలన్న డిమాండ్ పెండింగ్‌లో ఉందని, చాలా మంది సామాజిక కార్యకర్తలు దీనిపై కోర్టులను కూడా ఆశ్రయించారని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం తాము తీసుకుంటున్న నిర్ణయాల్లో ఇది అత్యంత కీలకమైందన్నారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోడ్ వెలువడడానికి కొద్ది గంటల ముందు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

దౌత్య యుద్ధం!



(మొదటి పేజీ తరువాయి)

పంపింది. దీనిపై భారత్ తీవ్ర స్థాయిలో స్పందించింది. భారత దౌత్యవేత్తలపై చేసిన కల్పిత ఆరోపణలకు తగిన విధంగా జవాబు చెప్పే హక్కు తమకు ఉందని స్పష్టం చేసింది. సోమవారం కెనడా నుంచి భారత హైకమిషనర్‌తో సహా ఆరుగురు దౌత్య సిబ్బందిని ఉపసంహరించుకుంది. భారత్‌లో ఉన్న ఆరుగురు కెనడా దౌత్య సిబ్బందిని భారత్ నుంచి 'బహిష్కరించింది'. 'కెనడా ప్రభుత్వంపై మాకు విశ్వాసం లేదు. మా హైకమిషనర్, దౌత్య ఉన్నతాధికారుల భద్రత విషయంలో భరోసా లేకుండా పోయింది. తీవ్రవాదం, హింసాత్మక వాతావరణంలో ట్రూడో ప్రభుత్వ చర్యలు వారి భద్రతను ప్రమాదంలోకి నెట్టాయి. అందుకే భారత హైకమిషనర్, దౌత్య ఉన్నతాధికారులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించాం" అని భారత్‌లో కెనడా హైకమిషనర్ (ఇన్‌చార్జి) స్టీవార్ట్ వీలర్‌కు విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. వీలర్‌తోపాటు ఆరుగురు కెనడా దౌత్య సిబ్బందిని భారత్ నుంచి బహిష్కరించింది. వీరు ఈనెల 19వ తేదీలోపు భారత్‌ను వీడి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. 1988 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ కుమార్ వర్మ.. 2022 సెప్టెంబరు నుంచి కెనడాలో భారత హైకమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయనపై కెనడా ఆరోపణలు చేయడాన్ని భారత్ ఖండించింది. ఆయన ఎలాంటివారో తమకు తెలుసునని, 36 సంవత్సరాలుగా ఆయన వివిధ దేశాల్లో భారత దౌత్యవేత్తగా పనిచేస్తున్నారని తెలిపింది. కెనడా ప్రధాని ట్రూడో కేవలం రాజకీయ లబ్ధి కోసం భారత వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి, వేర్పాటువాదులకు కొమ్ము కాస్తున్నారని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. "భారత్‌పై ట్రూడో శత్రుత్వం ఇప్పటిదికాదు. దీనికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి" అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. "ట్రూడో మంత్రివర్గంలో కొందరికి తీవ్రవాదులు, భారతదేశ విభజన కోరుకునే వారితో నేరుగా సంబంధాలున్నాయి. 2020 డిసెంబరులో భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం ద్వారా ఆయన నిజస్వరూపం బయటపడింది" అని విదేశాంగ శాఖ నిప్పులు చెరిగింది. కాగా, భారత ప్రభుత్వ ఏజెంట్లకు, కెనడా పౌరుడి (నిజ్జర్) హత్యకు మధ్య ఉన్న సంబంధాలపై తిరుగులేని సాక్ష్యాలున్నాయని కెనడా దౌత్యవేత్త వీలర్ తెలిపారు. భారత్ చెబుతున్నట్లు అన్ని ఆరోపణలపైనా దృష్టి పెట్టాలని అన్నారు. భారత్‌తో సహకరించేందుకు కెనడా సిద్ధంగా ఉందని తెలిపారు. మరోవైపు, క్షీణిస్తున్న భారత్- కెనడా దౌత్య సంబంధాల విషయంలో ప్రధాని మోదీ ప్రతిపక్షాల సలహాలనూ పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, ఖర్గేతో పాటు ఇతర పార్టీల నేతలపై ప్రధాని మోదీ విశ్వాసం ఉంచి వారి నుంచి సలహాలు తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది.

మళ్లీ వార్తల్లోకి 'మొదానీ'!

- ఈసారి కెన్యా నుంచి.. ప్రధాని మోదీపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ, అక్టోబరు 14: అదానీ గ్రూప్‌కు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కట్టబెట్టడంపై కెన్యాలో రాజకీయ వివాదం చెలరేగింది. రాజకీయ నాయకులు పెద్దఎత్తున లంచాలు తీసుకొని అదానీ కంపెనీకి ప్రాజెక్టులు అప్పగించారని కెన్యా నేతలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కెన్యా మాజీ ప్రధాని రైలా ఒడింగా ప్రధాని మోదీ, అదానీ గురించి మాట్లాడిన వీడియో వైరల్‌గా మారింది. ఆ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మోదీపై విరుచుకుపడింది. "మొదానీ (మోదీ-అదానీ) మళ్లీ వార్తల్లోకి వచ్చారు. ఈసారి కెన్యా నుంచి" అని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. అదానీ గ్రూప్‌కు అయాచిత లబ్ధి చేకూర్చారని విమర్శలు ఎదుర్కొంటున్న ఒడింగా.. మోదీయే అదానీని తనకు పరిచయం చేశారని చెప్పినట్లు ఆ వీడియోలో ఉంది.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసు..

కోర్టులో లొంగిపోయిన చైతన్య



మంగళగిరి కోర్టులో లొంగిపోయిన పానుగంటి చైతన్య

మంగళగిరి సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడు పానుగంటి చైతన్య సోమవారం మంగళగిరి కోర్టులో లొంగిపోయాడు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఇతడు ఆ పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి ప్రధాన అనుచరుడు. 2021 అక్టోబరు 19న మంగళగిరి బైపాస్ రోడ్డులోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ నేతలు, కార్యకర్తలు మూకదాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో చైతన్య ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు సీసీ ఫుటేజీల్లో ఆధారాలు లభ్యమయ్యాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన చైతన్య.. ముందస్తు వ్యూహం ప్రకారమే మంగళగిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి ఎదుట లొంగిపోయాడు. చైతన్యకు 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఆదేశాలిచ్చారు. ఈకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం సోమవారం మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. కేసు దర్యాప్తు అధికారి, సీఐ వైశ్రీనివాసరావు వారిని విచారించారు. అయితే వారి వద్ద నుంచి సంతృప్తికరమైన సమాధానాలను రాబట్టలేకపోయారు. కేసు దర్యాప్తులో కీలకంగా మారిన సెల్‌ఫోన్లు ఇచ్చేందుకు నేతలు విముఖత చూపారని, కోర్టు ఆదేశాలు ఉంటేనే ఇస్తామంటున్నారని తెలిపారు. కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించడంపై తమకు ఉత్తర్వులు అందలేదన్నారు.

ఐదు నెలలు మాయం!

- సీఐడీకి బదిలీ చేసిన రోజే ప్రత్యక్షం..
- చైతన్య అరెస్టులో పోలీసుల వైఫల్యం

గుంటూరు, అక్టోబరు 14: అతడేమీ అంతర్జాతీయ తీవ్రవాది కాదు.. పేరు మోసిన గజదొంగ కూడా కాదు.. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడిలో నిందితుడు మాత్రమే. అయినప్పటికీ ఐదు నెలలుగా అతడిని పట్టుకోవడంలో గుంటూరు జిల్లా పోలీసు యంత్రాంగం విఫలమైంది. టీడీపీ ఆఫీసుపై దాడిలో వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యది కీలక పాత్ర. ఆ పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి అతడు ప్రధాన అనుచరుడు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని గడచిన ఐదేళ్లలో అనేక అరాచకాలకు తెగబడ్డాడన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడి కోసం హైదరాబాద్, బెంగళూరు, ముంబై, గోవాతోపాటు ఉత్తర భారతంలోనూ గాలించామని పోలీసులు చెప్పుకొంటున్నా.. అది నమ్మశక్యంగా లేదని టీడీపీ వర్గాలు అంటున్నాయి. ఎందుకంటే ఈ కేసును సీఐడీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న కొద్దిగంటల్లోనే సోమవారం అతడు నేరుగా గుంటూరు కోర్టులో లొంగిపోవడానికి వచ్చాడు.

ఎందుకు ప్రయత్నించలేదు?

సాధారణంగా హత్య కేసులు, దోపిడీ కేసుల్లో నిందితులు పట్టుబడకపోతే పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తుంది. పొరపాటున కోర్టులో లొంగిపోతే దానిని మరింత అవమానంగా భావిస్తుంది. కోర్టులో లొంగిపోయే అవకాశం ఉందని ఏమాత్రం అనుమానం వచ్చినా పెద్ద సంఖ్యలో పోలీసులు కోర్టు చుట్టూ కాపలాకాస్తారు. కానీ చైతన్య విషయంలో ఈ ప్రయత్నాలే కనిపించడం లేదు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో అతడు తన న్యాయవాదితో కలిసి గుంటూరు మొబైల్ కోర్టులో లొంగిపోయేందుకు వచ్చాడు. అయితే ఆ కేసు మంగళగిరి రూరల్ స్టేషన్‌లో నమోదైనందున మంగళగిరి కోర్టులో లొంగిపోవాలని న్యాయాధికారి ఆదేశించారు. దాంతో చైతన్య గుంటూరు నుంచి మంగళగిరి కోర్టుకు వెళ్లి లొంగిపోయాడు. కనీసం మంగళగిరి వెళ్లేలోపైనా అతడిని అరెస్టుచేసే అవకాశం ఉంది. అయినా పోలీసులు ప్రయత్నించలేదు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలకు పాల్పడిన అనేక కేసుల్లో నిందితులుగా ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడైన వెంకటరామిరెడ్డి, వారి ప్రధాన అనుచరుడు మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌లను కూడా పోలీసులు ఇంతవరకు అరెస్టు చేయలేకపోయారు. పిన్నెల్లిని అరెస్టు చేయగలిగినప్పుడు మిగిలిన నిందితులను ఎందుకు పట్టుకోలేకపోతున్నారనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇజ్రాయెల్ సైనిక స్థావరంపై దాడి

- రాకెట్లు, డ్రోన్లతో హడలెత్తించిన హెజ్‌బొల్లా మిలిటెంట్లు
- నలుగురు ఇజ్రాయెల్ సైనికుల మృతి



లెబనాన్‌లో శిథిలాల నుంచి మృతదేహాలను వెలికితీసి తరలిస్తున్న సహాయ సిబ్బంది

టెల్ అవీవ్, అక్టోబరు 14: హైఫా నగరానికి సమీపంలోని బిన్యామినా ప్రాంతంలో ఉన్న ఇజ్రాయెల్ సైనిక స్థావరంపై హెజ్‌బొల్లా రాకెట్లు, డ్రోన్లతో దాడి జరిపింది. ఈ దాడిలో ఇజ్రాయెల్ డిఫెన్స్ చీఫ్ హెర్జి హలెవి ప్రాణాలు కోల్పోయినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే ఈ దాడిలో ఆయన చనిపోలేదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ డ్రోన్ దాడుల్లో తమ సైనికులు నలుగురు చనిపోయారని, 61 మంది గాయపడ్డారని వెల్లడించింది. మరోవైపు హెజ్‌బొల్లా డ్రోన్ దాడిని ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ రక్షణ వ్యవస్థ గుర్తించలేకపోయింది. మరోవైపు బాలిస్టిక్ క్షిపణులను ధ్వంసం చేసే అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్ (థాడ్)ను ఇజ్రాయెల్‌కు అందించాలని అమెరికా నిర్ణయించింది. థాడ్ నిర్వహణ కోసం మూడువేల మంది అమెరికా సైనికులు ఇజ్రాయెల్‌కు రానున్నారు. దీంతో ఇజ్రాయెల్‌కు అండగా అమెరికా సైన్యం ప్రత్యక్షంగా బరిలోకి దిగినట్లేనని అంతర్జాతీయ పరిశీలకులు చెబుతున్నారు. అమెరికా నిర్ణయంపై ఇరాన్ భగ్గుమంది. తమ ప్రజలను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యలకైనా ఉపక్రమిస్తామని హెచ్చరించింది.

భద్రతపై పొన్నవోలు

పిటిషన్ కొట్టివేత

అమరావతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) హోదాలో తనకు కల్పించిన భద్రతను కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. తనకు భద్రత అవసరం లేదనే నిర్ణయానికి రావడం వెనుక సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్ఆర్‌సీ)కి దురుద్దేశం ఉందనడానికి, ఇతర కారణాలు ఉన్నాయని నిరూపించేందుకు పొన్నవోలు ఎలాంటి ఆధారాలనూ కోర్టు ముందు ఉంచలేదని పేర్కొంది. ఆయనకు ఎలాంటి ప్రాణహానీ లేదని ఎస్ఆర్‌సీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో భద్రతను కొనసాగించాలని ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి సోమవారం తీర్పు వెలువరించారు. ఈ వ్యాజ్యంపై ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు.

అయ్యో బాబోయ్!

ఐటీ శాఖలో చిత్ర విచిత్రాలు.. బాబుపై ఫిర్యాదు చేసిన వ్యక్తికి 'నజరానా'

- కొలువులో కొనసాగించడమే చిత్రం
- ఇప్పుడు జీతం 5లక్షలకు పెంచాలని ఫైలు
- డేటా చోరీ పేరుతో నాడు నానా రచ్చ
- జగన్ బ్యాచ్ కొనసాగింపుపై సీఎం విస్మయం
- అయినా మారని ఐటీ శాఖ అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

2014-19 కాలంలో అప్పటి సీఎం చంద్రబాబు పౌరుల డేటాను చోరీ చేశారంటూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి నానా యాగీ చేసిన సంగతి గుర్తుందా? ఇంత రచ్చకు కారణమైన వ్యక్తి ఇప్పటికీ ఐటీ శాఖలో కన్సల్టెంట్‌గా కొనసాగుతున్నారు. అంతేకాదు... ఆయనకు ఇప్పుడు ఇస్తున్న రూ.2లక్షల జీతం సరిపోదని, రూ.5లక్షలు చేయాలని ఫైలు సిద్ధం చేశారు. రేపో మాపో దానికి ఆమోదముద్ర కూడా వేయనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో డేటా చోరీకి గురైందంటూ 2022లో ఐటీ శాఖలోకి దూరిన ఒక కన్సల్టెంటు ఫిర్యాదు చేశారు. అంతే.. చంద్రబాబును ఎలాగైనా ఇరికించాలని చూస్తున్న నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి రెచ్చిపోయారు. అసెంబ్లీలోనే పలు అబద్ధాలతో నానాయాగీ చేశారు. రాష్ట్ర ప్రజలకు తెలియకుండానే వారి ఖాతాల్లోని డబ్బు మాయమయ్యే ప్రమాదం ముంచుకొచ్చేసిందని ఆరోపించారు. ఇలాంటి చౌర్యం చేసిన చంద్రబాబును ఉపేక్షించకూడదన్నారు. తన అస్మదీయుడు, అప్పటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో సభా సంఘాన్ని వేయించారు. సభాసంఘం ఛైర్మన్‌గా భూమన.. నాటి ఐటీ కార్యదర్శి జయలక్ష్మి, పూర్వ ఐటీ కార్యదర్శి విజయానంద్‌నూ పిలిచి డేటా చోరీపై విచారించారు. మరో కార్యదర్శి అహ్మద్‌బాబును కూడా పిలిపించారు. ఈ విచారణంతా చంద్రబాబునే లక్ష్యంగా చేసుకుని జరుగుతుండడంతో.. ఏమీ జరగలేదని వాస్తవం చెప్పినా కరుణాకర్‌రెడ్డి అండ్ కో నమ్మే పరిస్థితి లేదని అహ్మద్‌బాబు సెలవు పెట్టేసి లండన్ వెళ్లిపోయారు. డేటా చోరీకి ఆస్కారమే లేదని కార్యదర్శులు జయలక్ష్మి, విజయానంద్ సభాసంఘానికి తేల్చి చెప్పేశారు. ప్రభుత్వ ఉత్తర్వును డౌన్‌లోడ్ చేసినా ఎవరు చేశారో తెలిసిపోయేంత సాంకేతిక విధానాన్ని అమలు చేస్తున్నామని.. అలాంటిది పౌరుల డేటా చోరీ కావడం అసాధ్యమని వారు స్పష్టంచేశారు. ఒక్కటంటే ఒక్క డేటా కూడా బయటకు వెళ్లలేదని సభాసంఘం గుర్తించింది. నివేదిక ఇవ్వకుండానే అర్ధంతరంగా ముగింపు కార్డు వేసేసింది. ఇంతటి వివాదానికి కారణమైన ఐటీ కన్సల్టెంట్ ఇప్పటికీ ఆ శాఖలో తన హవా కొనసాగిస్తుండడం గమనార్హం. ఇటీవల సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్ కార్యాలయాన్ని సందర్శించినప్పుడు అధికారులు ఆ కన్సల్టెంట్‌ను ఘనంగా పరిచయం చేశారు. ఆయన్ను 2022లో తీసుకున్నారని తెలిపారు. అయితే, జగన్ బ్యాచ్ ఇంకా కొనసాగుతున్నారా.. వారిని ఇంకా తీసేయలేదా అని సీఎం ప్రశ్నించేసరికి అధికారుల గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది.

జీతాలు పెంచాలని..

స్వయానా సీఎం ప్రశ్నించినా ఆ ఆ కన్సల్టెంట్‌ను తొలగించలేదు. పైగా... మరింత అందలమెక్కించేందుకు రంగం సిద్ధం చేయడం విశేషం. ఆయన వేతనాన్ని రూ.5 లక్షలకు పెంచాలని సిఫారసు చేశారు. ఐటీ శాఖలో ఆయనతో పాటు మరో ఐదుగురు కన్సల్టెంట్లు ఉన్నారు. వీరికి కూడా భారీగా జీతాలు పెంచాలని ప్రతిపాదించారు. సదరు ఫైలు కూడా శరవేగంగా కదిలింది. నేడో రేపో ఆమోదం పొందబోతోందని ఐటీ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరితోపాటు ఈ శాఖలో చేతిలో ల్యాప్‌టాప్‌లు పట్టుకుని హడావుడిగా తిరిగే బ్యాచ్ మరొకటి ఉందని.. పనిలో పనిగా వారికీ జీతభత్యాలు పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని తెలుస్తోంది.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

నేడే సిరిమానోత్సవం

- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: విజయనగరం పైడితల్లి అమ్మవారి తొలేళ్ల తంతు పూర్తయింది. అసలు సంబరానికి వేళ అయింది. కొద్ది గంటల్లో అశేష జనవాహిని అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించే సిరిమానోత్సవం ఆరంభం కానుంది. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సిరిమాను బయలుదేరనుంది. ఇందుకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. అమ్మవారి పరివారంగా పిలిచే జాలరి వల, అంజలి రథం, పాలధార రథాలు సిరిమాను వెంట నడుస్తాయి. సాయంత్రం ఆరు గంటల సమయానికి సిరిమానోత్సవాన్ని పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఉదయం పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలేళ్ల ఉత్సవం

పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం సోమవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. పూసపాటి వంశీయులు కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, సతీమణి సునీలా గజపతిరాజు, కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సభ్యులు కూడా పైడిమాంబకు పట్టువస్త్రాలు సమర్పించి, పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఆదివారం రాత్రి 10.35 గంటల సమయంలో అమ్మవారిని తొలేళ్ల ఉత్సవానికి సిద్ధం చేస్తూ వివిధ నదీజలాలతో అభిషేకించారు.

రైతులకు విత్తనాలు పంపిణీ

సిరిమాను అధిరోహించే పూజారి బంటుపల్లి వెంకటరావు అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం విజయనగరం పరిసర ప్రాంత రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ విత్తనాలను తీసుకునేందుకు రైతులు అర్ధరాత్రి వరకూ వేచి ఉన్నారు. రాత్రి 12 గంటల సమయంలో ఈ ప్రక్రియ కొనసాగింది. ఈ తంతుతో తొలేళ్ల ఘట్టం పూర్తయింది.

టిడ్కో ఎండీకి అదనపు బాధ్యతలు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీ టిడ్కో ఎండీ బి.సునీల్‌కుమార్‌రెడ్డికి ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ అండ్ హౌసింగ్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో పాటు ఏపీ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ ఇన్‌చార్జి ఎండీగా, దక్కన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్(డిల్)కు ఇన్‌చార్జి ఎండీగాను నియమించింది. ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్న సీడీఎంఏ హరినారాయణ్‌ను రిలీవ్ చేశారు.

రఘురామ కేసు దర్యాప్తు అధికారిగా

ప్రకాశం ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు క్రైం, అక్టోబరు 14: మాజీ ఎంపీ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై హత్యాయత్నం కేసుకు సంబంధించి దర్యాప్తు అధికారిగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్న గుంటూరు జిల్లా ఏఎస్పీ రమణమూర్తి స్థానంలో ఈయన్ను నియమించారు. కేసుకు సంబంధించిన ఫైల్స్‌ను ఆయనకు అప్పగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దామోదర్ ప్రొబెషనరీ డీఎస్పీగా ప్రకాశం జిల్లాలో పనిచేసిన సమయంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైవే కిల్లర్ మున్నా గ్యాంగ్ ఆట కట్టించిన అధికారిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ముక్కుసూటితనం, పోలీసు ప్రతిష్ఠను పెంచాలనే ఆశయంతో పనిచేసి అనేక ముఖ్యమైన కేసులు ఛేదించారు. దామోదర్‌కు ఈ కేసు అప్పగించడంతో దర్యాప్తు వేగం పుంజుకుంటుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అప్పట్లో సీఐడీలో ఏఎస్పీగా పనిచేస్తున్న విజయపాల్ విచారణ కోసం పిలిచి తనపై హత్యాయత్నం చేశారని ఈ ఏడాది జూలై 11న గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో రఘురామ ఫిర్యాదు చేశారు. అందుకు బాధ్యులుగా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డితోపాటు నాటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, మరికొందరిని కూడా పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కేసు విచారణాధికారి రమణమూర్తి ఈ నెల 11న విజయపాల్‌ను విచారణకు పిలిచారు. అయితే విజయపాల్ సహకరించలేదని తెలిసింది. దీంతో ఎస్పీ స్థాయిలో ఉన్న దామోదర్‌ను విచారణాధికారిగా నియమించారు.

మాజీ సైనికుల సంక్షేమానికి 'అపెక్స్‌కో'

- రూ.10 కోట్ల కార్పస్ ఫండ్‌తో కార్పొరేషన్ ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దేశానికి సేవ చేసిన మాజీ సైనికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. దేశ సేవలో భాగంగా అమరులైన సైనికుల కుటుంబాలు, వికలాంగులైన వారి సంక్షేమం కోసం రూ.10 కోట్ల కార్పస్ ఫండ్‌తో ఆంధ్రప్రదేశ్ ఎక్స్ సర్వీస్‌మెన్ కార్పొరేషన్ లిమిటెడ్(అపెక్స్‌కో) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర హోంశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర హోంశాఖ భాగస్వామ్యంతో నడిచే అపెక్స్‌కో యుద్ధ వికలాంగులు, యుద్ధ వితంతువులు, వారిపై ఆధారపడిన కుటుంబసభ్యుల సంక్షేమం కోసం పనిచేస్తుంది. స్వయం ఉపాధి, పునరావాసం, సంక్షేమ పథకాలు అందించడం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల కల్పన వంటివి ఏపీ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ ద్వారా అమలు చేయిస్తుంది. మాజీ సైనికుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న దేశవ్యాప్త వినతుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్‌లో అపెక్స్‌కో ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని సూచించినా గత వైసీపీ ప్రభుత్వ పాలనలో సాధ్యం కాలేదు. అయితే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తాజాగా కేంద్రం నిర్ణయానికి అనుగుణంగా అపెక్స్‌కో ఏర్పాటు చేసి తక్షణమే రూ.3 కోట్లు కేటాయించింది. విడతల వారీగా మరో రూ.7 కోట్లు కేటాయించి మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేయనున్నది.



డిప్యూటీ ఈవోకు బెడ్‌షీట్లను అందజేస్తున్న గౌతమ్ సింఘానియా

శ్రీవారి సేవలో రేమాండ్స్ అధినేత

- టీటీడీకి వెయ్యి బెడ్‌షీట్లు విరాళం

తిరుమల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రేమాండ్స్ అధినేత గౌతమ్ సింఘానియా సోమవారం మధ్యాహ్నం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రేమాండ్స్ అతిథి గృహానికి చేరుకున్న ఆయన రూ.20 లక్షల విలువైన వెయ్యి బెడ్‌షీట్లను టీటీడీకి విరాళంగా అందజేశారు. ఈ బెడ్‌షీట్లను రిసెప్షన్ డిప్యూటీ ఈవో ఆర్‌1 భాస్కర్‌కు అందజేశారు. గతంలోనూ ఆయన టీటీడీకి పలుమార్లు బెడ్‌షీట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రేమాండ్స్ పీఆర్వో రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాలకు పట్టం

- 4500 కోట్లతో 30 వేల పనులు: పీతల సుజాత

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): 'గ్రామాలకు పట్టంగట్టడం కోసమే కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తోంది. వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను భ్రష్టు పట్టిస్తే కూటమి ప్రభుత్వం మళ్లీ వాటిని గాడిలో పెడుతోంది. మూడు నెలల్లో రూ.4,500 కోట్ల విలువైన 30,000 పనులను పంచాయతీల్లో చేపట్టి పూర్తి చేయబోతున్నాం' అని మాజీ మంత్రి పీతల సుజాత పేర్కొన్నారు. సోమవారం ఆమె ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వం చేసిన వినాశనం అంతా ఇంతా కాదు. రూ.13 వేల కోట్ల పంచాయితీల నిధులను గ్రామాల్లో ఖర్చు చేయకుండా దారి మళ్లించి ఇతర అవసరాలకు వాడేసింది. గ్రామాల్లో ఒక్క పని చేయడానికి అవకాశం లేక సర్పంచులు, వార్డు సభ్యులు ప్రజల ముందు దోషుల్లా నిలబడాల్సి వచ్చింది. ఉపాధి హామీ పథకం నుంచి 45 వేల జాబ్ కార్డులు తొలగించింది. రెండు లక్షల మంది పేదలు ఉపాధి హామీ పనులు చేయకుండా నిలిపివేశారు. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి రూ.2,000 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉంచారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ బకాయిలు విడుదల చేసింది' అని ఆమె చెప్పారు. రాబోయే రోజుల్లో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళిక రూపొందించినట్లు సుజాత తెలిపారు.

సీఎంఆర్ఎ‌ఫ్‌కు పలువురు దాతల విరాళాలు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధికి పలువురు విరాళాలు అందించారు. సోమవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును పలువురు దాతలు కలిసి, విరాళాల చెక్కులు అందించారు. యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో రూ.30.85 లక్షలు, తుళ్లూరు గ్రామ రైతులు రూ.8 లక్షలు, విజయ్‌కుమార్ రూ.6 లక్షలు, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఏపీ సర్కిల్ రూ.3,11,116, ఎన్నారై టీడీపీ వింగ్(న్యూజిల్యాండ్) రూ.2.70 లక్షలు, మల్లంపాటి శ్రీనివాసరావు రూ.2.50 లక్షలు, లక్ష్మీ సుభాషిణి రూ.లక్ష, వెలంగ సరంధ రూ.లక్ష, మంచికలపూడి సుబ్బారావు రూ.లక్ష, వెలంగ భాస్కర్ రూ.50 వేలు అందించారు.

కల్చర్ కమిషన్ ఓఎస్డీ మల్లికార్జున్ రాజీనామాకు ఆమోదం

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ ఓఎస్డీ ఆర్.మల్లికార్జున్ రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు పర్యాటక శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వంలో క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్‌కు సీఈవోగా పనిచేసిన మల్లిఖార్జున్ పదవీ విరమణ తర్వాత అదే కమిషన్‌కు ఓఎస్డీగా కొనసాగారు. గత ప్రభుత్వం ఆయనకు రెండేళ్ల పాటు ఓఎస్డీగా అవకాశం కల్పించింది. అయితే జగన్ సర్కార్ డైరెక్టర్ పోస్టు భర్తీ చేయకుండా మల్లిఖార్జున్‌ను ఓఎస్డీగా నియమించి కమిషన్ బాధ్యతలు మొత్తం ఆయనకే అప్పగించింది. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో మల్లికార్జున్ ఓఎస్డీ పోస్టుకు రాజీనామా చేశారు. కూటమి ప్రభుత్వం కమిషన్‌కు సీఈవోను నియమించాల్సి ఉంది.

ఉపాధి 'సోషల్ ఆడిట్' డైరెక్టర్ నియామకానికి కమిటీ

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులు తనిఖీ చేసేందుకు ఏర్పాటు చేసిన సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) విభాగం డైరెక్టర్ నియామకానికి సెర్ప్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక కార్యకర్తను సోషల్ ఆడిట్ డైరెక్టర్‌గా నియమిస్తారు. ప్రతి ఐదేళ్లకోసారి నియమించే ఈ పోస్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాల ప్రకారం సెర్ప్ కమిటీని ఏర్పాటు చేస్తుంది. కొత్త కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నామినేట్ చేసిన సీసీఎల్ఏ జయలక్ష్మి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా స్థానిక సంస్థల ఆడిట్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్/అకౌంటెంట్ జనరల్ ఇన్‌చార్జి, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి, ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ కాంతి మహంతి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ అశిష్ గుప్తాలను నియమించారు.

28న ఉక్కు కార్మికుల సమ్మె

- యాజమాన్యానికి నోటీసు ఇచ్చిన కార్మిక సంఘాలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, కార్మిక సమస్యలను సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28వ తేదీన సమ్మె చేయనున్నట్టు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం సీజీఎం (హెచ్‌ఆర్) గాంధీకి సమ్మె నోటీస్ ఇచ్చారు.



హోం మంత్రి అనితకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న అధికారి

గత ఏడాది అవమానం...
ఈ ఏడాది మర్యాదలతో దర్శనం

- పైడిమాంబకు హోం మంత్రి అనిత పూజలు

విజయనగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం రాత్రి పైడిమాంబను దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం మూడులాంతర్లు చదురుగుడి ఎదుట మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. 'టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా గత ఏడాది పైడిమాంబ దర్శనానికి వచ్చాను. స్పెషల్ దర్శనం టికెట్ తీసుకున్నా... ఆలయం లోపలకు రాకుండా, గేటు వేసి తాళం అప్పటి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి వద్ద ఉంచుకున్నారు. దీంతో అనాడే ఇటువంటి రాక్షస పాలన రాకుండా చూడాలంటూ పైడిమాంబకు మొక్కుకున్నా. ఇప్పుడు ఆ మొక్కు తీర్చుకుంటున్నా. ఈ ఏడాది పైడిమాంబ దర్శనం సంతృప్తిగా జరిగింది. గత పాలకులు పైడిమాంబ సిరిమానోత్సవాన్ని భక్తుల పండుగగా కాకుండా, తమ సొంత పండుగలా భావించారు. దీన్ని అనాడు ప్రతి ఒక్కరూ ఖండించారు. ఈ ఏడాది జరుగుతున్న సిరిమానోత్సవంలో అలాంటి పరిస్థితి లేదు. సామాన్య భక్తులు సైతం అతి సునాయసంగా పైడిమాంబను దర్శించుకుంటున్నారు.' అని మంత్రి అనిత అన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవిత ఖైదీలకు క్షమాభిక్షపై అధ్యయన కమిటీ

- హోంమంత్రి అనిత వెల్లడి

ఆరిలోవ(విశాఖపట్నం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించే విషయంపై విధివిధానాలు రూపొందించేందుకు అధ్యయన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సోమవారం ఆమె విశాఖపట్నంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి 26వ తేదీ నాటికి జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందన్నారు. అధ్యయన కమిటీ నివేదిక అందగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇంట్లో ఒక మతం..వీధిలో మరో మతం

- జగన్ తీరుపై అశోక్ గజపతిరాజు ధ్వజం
- అరాచక పాలన నుంచి విముక్తి పొందామని వ్యాఖ్య

విజయనగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌కు ఇంట్లో ఒక మతం, వీధిలో మరో మతమని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజు విమర్శించారు. విజయనగరంలో పైడితల్లమ్మ జాతర సందర్భంగా సోమవారం అమ్మవారికి ఆయన పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పాలకులు ఆలయాలపై చూపించిన వివక్ష, ప్రవర్తించిన తీరును ఎండగట్టారు. ఇంట్లో ఒక మతం, వీధిలో మరొక మతమని జగన్ తీరును పరోక్షంగా విమర్శించారు. కసాయికైనా మంచి మనసు ఉంటుంది కానీ, గత వైసీపీ పాలకులకు లేకపోయిందన్నారు. రామతీర్థంలో కోదండరాముని శిరస్సు తొలగించడం కానీ, పోలిపల్లి పైడితలమ్మ విగ్రహం ధ్వంసంతోపాటు అనేక ఆలయాల్లో విధ్వంసం సృష్టించారని తెలిపారు. పైడితల్లమ్మ దయ వల్ల నాటి అరాచక పాలన నుంచి విముక్తి చెందామన్నారు. ఇక నుంచి ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని చెప్పారు. ప్రజలందరికీ పైడితల్లమ్మ దర్శనం కలగాలనే ఉద్దేశంతో భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించామన్నారు.

ఏఈఓ గ్రేడ్ 2 పదోన్నతుల్లో అక్రమాలు!?

- అగ్రికల్చర్ బీటెక్ అభ్యర్థులకు అన్యాయం
- 449 ఖాళీల్లో ఒక్కరికీ దక్కని అవకాశం
- చివరి నిమిషంలో జాబితా తారుమారు
- తెలంగాణలో ఒక రూల్.. ఆంధ్రాలో మరో రూల్

గుంటూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన వ్యవసాయ విస్తరణ అధికారుల పదోన్నతుల్లో (ఏఈఓ గ్రేడ్-2) అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సీనియారిటీ జాబితా రూపకల్పనలో అగ్రికల్చర్ బీటెక్ చదివిన అభ్యర్థులకు అన్యాయం జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 449 ఏఈఓ గ్రేడ్-2 పోస్టులకు పదోన్నతులు ఇవ్వగా, అగ్రికల్చర్ బీటెక్ చదివిన ఒక్క అభ్యర్థిని కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం వివాదాస్పదమవుతోంది. తొలుత.. జీఓ 35, జీఓ3 ద్వారా ఏఈఓ గ్రేడ్-2 పోస్టులకు ప్రమోషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 749 పోస్టులు ఖాళీ ఉండగా, నేరుగా నియామకం ద్వారా 300 పోస్టులు, పదోన్నతుల ద్వారా 449 పోస్టుల భర్తీకి వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు అనుమతిచ్చారు. ఈ 449 పోస్టుల్లో వీఏఏ గ్రేడ్-2 వారికి 70 శాతం, వీఏఏ గ్రేడ్-3 వాళ్లకు 30 శాతం రేషియాలో ప్రమోషన్లు ఇవ్వాలి. ఏఈఓ గ్రేడ్-2 పోస్టులకు ఇప్పటికే గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులు (వీఏఏ గ్రేడ్-2, గ్రేడ్-3)గా రెండేళ్ల సర్వీసు పూర్తి చేసి, డిపార్టుమెంటు పరీక్ష రాసి, ప్రొబేషన్ పూర్తయిన వారిని ఎంపిక చేయాలన్నది నిబంధన. గ్రామ, వార్డు సచివాలయంలో అగ్రికల్చర్ బీఎస్సీ, అగ్రికల్చర్ బీటెక్, అగ్రికల్చర్ డిప్లొమా చదివిన చాలా మంది వీఏఏ గ్రేడ్-2 లుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆయా కోర్సులు చదివిన అందరూ ప్రమోషన్ పొందేందుకు అర్హులేనని తెలుస్తోంది. అయితే చివరి నిమిషంలో పదోన్నతుల సీనియారిటీ జాబితాలను తారుమారు చేసినట్లు సమాచారం. ఉదాహరణకు ప్రకాశం జిల్లాలో రూపొందించిన సీనియారిటీ జాబితాలో గవిని తారకరామారావు, ఎలిశెట్టి శ్రీకాంత్ పేర్లు ఉన్నాయి. ఈ ఇరువురు అభ్యర్థులు అగ్రికల్చర్ బీటెక్ చదివిన వాళ్లే. ఈ నెల 3న విడుదల చేసిన ఫైనల్ సీనియారిటీ జాబితాలో మాత్రం వారి పేర్లు లేవు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పద్ధతిలో పేర్లు తొలగించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కొందరికి అవకాశం దక్కినప్పటికీ వారినీ చివరి నిమిషంలో జాబితా నుంచి పక్కన పెట్టేశారు. కొన్ని జిల్లాల్లో సీనియారిటీ జాబితా రూపకల్పనలో భారీగా పైరవీలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. శ్రీకాకుళంలో 32, విజయనగరంలో 48, విశాఖపట్నంలో 19, తూర్పుగోదావరిలో 47, పశ్చిమగోదావరిలో 28, కృష్ణాలో 35, గుంటూరులో 51, ప్రకాశంలో 36, నెల్లూరులో 27, కర్నూలులో 57, కడపలో 22, అనంతపురంలో 16, చిత్తూరులో 31 ఏఈఓ గ్రేడ్-2 పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వగా, అగ్రికల్చర్ బీటెక్ చదివిన అభ్యర్థుల పేర్లు ఒక్కటి కూడా లేకపోవడం గమనార్హం. పక్కనున్న తెలంగాణలో ఏఈఓ గ్రేడ్-2 పోస్టులను నేరుగా భర్తీచేస్తూ అగ్రికల్చర్ బీటెక్ అభ్యర్థులను అర్హులుగా ఎంపిక చేసినట్టు బాధితులు చెబుతున్నారు. ఇక్కడ మాత్రం పదోన్నతుల్లో కూడా తమను పరిగణనలోకి తీసుకోలేదని, ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు తమకు అన్యాయం చేశారని వాపోతున్నారు. హైకోర్టుకు సెలవులు ఉన్న దసరా పండగ రోజుల్లో అర్ధరాత్రి హడావుడిగా ప్రమోషన్ల జాబితా విడుదల చేసినట్లు బాధితులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

తెలంగాణలో ....

ప్రస్తుతం తెలంగాణలో అగ్రికల్చర్ బీటెక్ చదివిన వాళ్లను ఏఈఓ పోస్టుల్లో నియమిస్తున్నారు. అక్కడ 2017లో విడుదల చేసిన నోటిఫికేషన్ 51/2017 లోనూ అదే పద్ధతిలో నియామకాలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పద్ధతి కొనసాగింది. జగన్ ప్రభుత్వంలో 2020లో నిబంధనలు తారుమారు చేస్తూ జీఓ 35నుతీసుకురావడంతో అగ్రికల్చర్ బీటెక్ చదివిన అభ్యర్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి.

జీఓ సవరించాలి

ఈ వ్యవహారంలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల వాదన మరోలా ఉంది. అగ్రికల్చర్ బీటెక్ చదివిన అభ్యర్థులు ప్రమోషన్‌కు అర్హులే కానీ, ఏఈఓ గ్రేడ్-2 పోస్టుకు మాత్రం అర్హులు కాదని చెబుతున్నారు. వారికి ఒకవేళ ప్రమోషన్ ఇవ్వాలంటే జీఓ సవరించడం తప్పనిసరంటున్నారు.

రేపటి నుంచి అందుబాటులోకి 48 రీచ్‌లు

- ఇక నుంచి పూర్తిస్థాయిలో ఇసుక అందిస్తాం: మంత్రి కొల్లు

అమరావతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ వైఫల్యాల వల్లే రాష్ట్రంలో ప్రస్తుతం ఇసుక కొరత ఏర్పడిందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. కొరతను అధిగవిుంచేందుకు ఈనెల 16 నుంచి.. 48 మాన్యువల్ రీచ్‌లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వెల్లడించారు. ఇక్కడి ఎండీసీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఇసుక ఎంత తవ్వారు..? ఎంతకు అమ్మారో.. లెక్కలే లేవని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానం ద్వారా పారదర్శకంగా ప్రతి విషయాన్నీ ప్రజలకు తెలియజేస్తున్నామని మంత్రి వివరించారు. ఇక నుంచి ఇసుక పూర్తిస్థాయిలో అందిస్తామని చెప్పారు. ఇప్పటికే పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులిచ్చామన్నారు. రోబో శాండ్ విషయంలో ప్రత్యేక పాలసీ తీసుకొస్తామని, అది అమల్లోకి వస్తే ఇసుక కొరతను అధిగమించగలమని మంత్రి వెల్లడించారు. ప్రైవేటు రీచ్‌ల ఏర్పాటును మంత్రివర్గంలో చర్చించి ఆమోదించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ధరల్లో వ్యత్యాసాలు నిజమే..

స్టాక్ యార్డుల నుంచి ఇసుక అందించడంలో ధరల్లో కాస్త వ్యత్యాసాలున్న మాట వాస్తవమేనని మంత్రి రవీంద్ర అంగీకరించారు. రీచ్‌లన్నీ ప్రారంభిస్తే ఇసుక కొరత తగ్గి ధరలు తగ్గుముఖం పడుతాయన్నారు. రీచ్‌లన్నీ ప్రారంభించడానికి ఎన్జీటీ, సుప్రీం కోర్టుల్లో కేసులు అడ్డంకిగా మారాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో టన్ను ఇసుక రూ.475కు అమ్మితే, తాము ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. తాము కేవలం సీనరేజీ, లోడింగ్ చార్జీలు వసూలు చేస్తున్నామన్నారు.

జగన్‌వి పిచ్చి కూతలు

మాజీ సీఎం జగన్ తీరుపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రంగా స్పందించారు. ఆయన హయాంలో ఇసుక దోపిడీ గురించి అప్పుడే మరచి ట్వీట్ల పేరిట పిచ్చికూతలు కూస్తున్నారన్నారు. తన పాలనలో ఇసుక తవ్వకాలు, లభ్యత, వివరాల గురించి ఏనాడూ మాట్లాడని జగన్, ఇప్పుడు ఉచిత ఇసుక అమలుపై అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి 35 లక్షల టన్నుల ఇసుక మాత్రమే అందుబాటులో ఉందని, జగన్ 85 లక్షల టన్నులు ఉందంటూ అసత్యాలు మాట్లాడుతున్నారని అన్నారు.

గ్యాంగ్ రేప్‌పై ప్రత్యేక కోర్టు!

- నిందితులకు కఠిన శిక్ష పడాలన్న సీఎం

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనపై ప్రత్యేక కోర్టు ద్వారా విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులకు కఠిన శిక్షలు పడాలన్నారు. మహిళల భద్రత నిమిత్తం ప్రత్యేక కోర్టు కోసం న్యాయస్థానాన్ని అభ్యర్థించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. గతంలో బాపట్లలో సామూహిక అత్యాచార ఘటనపైనా ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు కృషి చేద్దామని, లైంగిక వేధింపులు, మహిళలపై నేరాల కట్టడికి కఠినంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఇటువంటి నేరాల్లో టెక్నాలజీ విరివిగా వినియోగించాలని, రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఉండేలా చూడాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎక్కడికక్కడ అవసరం మేరకు సీసీ కెమేరాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి పోలీసుశాఖకు అవసరమైన సహకారం లభిస్తుందని భరోసా ఇచ్చారు.


సత్యమేవ జయతే

కూచిపూడిని విశ్వవ్యాప్తం చేసిన వెంపటి చినసత్యం



- సినీ నృత్య దర్శకుడిగా అంతులేని పేరు ప్రఖ్యాతులు
- టీటీడీ ఆస్థాన నాట్యాచార్యుడిగా అరుదైన గౌరవం
- పద్మభూషణ్ వంటి ఎన్నో అవార్డులు సొంతం
- మహామహులకు నాట్యంలో మెలకువలు నేర్పిన గురువు
- ప్రపంచవ్యాప్తంగా 10 వేలకు పైగా శిష్యులు
- ఏటా రాష్ట్ర ప్రభుత్వ యక్షగాన సార్వభౌమ స్మారక పురస్కారం
- కూచిపూడి నుంచి కాలిఫోర్నియా వరకూ ఖ్యాతి

నిజమైన కళ అంటే.. కనులకు, చెవులకు ఆనందాన్ని ఇచ్చేది కాదు. మనసును ఆహ్లాదపరిచేది. అలాంటి కళతో జనులను రంజింపజేసినవాడు చరితార్థుడవుతాడు. పద్మభూషణ్ వెంపటి చినసత్యం ఈ కోవకు చెందినవారే. భరతనాట్యమే ప్రధానంగా సాగుతున్న భారతీయ నాట్యరంగంలో కూచిపూడికి అగ్రస్థానం కల్పించిన మహనీయుడాయన. ఆయన స్పృశించిన ప్రతి రూపకం నాటరాజ పాదపద్మాంకితమే. ఆయన ప్రతి శిష్యుడూ ప్రపంచపటంలో ఓ నాట్య శిఖరమే. 'క్షీరసాగర మదనం' మొదలు 'చండాలిక' వంటి ఎన్నో రూపకాలు తెలుగు కీర్తి పతాకాన్ని విశ్వవీధుల్లో రెపరెపలాడించాయి. మన కూచిపూడిలో పుట్టి.. మన కూచిపూడి నాట్యాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన మహానుభావుడి జయంతి నేడు..



నేడు వెంపటి చినసత్యం జయంతి

8లో

ఆంధ్రజ్యోతి

ఎన్టీఆర్

మంగళవారం 15 అక్టోబరు 2024

ఆయన శిష్యరికం నా అదృష్టం



కూచిపూడి నాట్యానికి వన్నె తెచ్చిన మహనీయుడు వెంపటి చినసత్యం. ఆయన శిష్యరికం నాకెంతో అదృష్టం. చెన్నైలో కూచిపూడి ఆర్ట్ అకాడమీని స్థాపించి వేలాది మంది కళాకారులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కింది. టీటీడీ ఆస్థాన నాట్యాచార్యులుగానే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో అనేక అవార్డులు, సత్కారాలు పొందిన అపర సిద్ధేంద్రయోగి.

– డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత



రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పవన్. చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాము తదితరులు (ఇన్‌సెట్‌లో) గుడివాడలో మురుగుగా వస్తున్న తాగునీటి బాటిళ్లను చూపిస్తూ అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి ఆదేశాలిచ్చిన డిప్యూటీ సీఎం పవన్



పల్లెగూటికి పండగొచ్చింది

కృష్ణాకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వరాల జల్లు

- కంకిపాడు-రొయ్యూరు రోడ్డు ఆధునికీకరణకు ఆదేశాలు
- లంక గ్రామాల్లో అనుసంధాన రహదారులకూ ఓకే

గుడివాడ నియోజకవర్గ తాగునీటి సమస్యకు చెక్

విజయవాడ/కంకిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృష్ణాజిల్లాకు వరాల జల్లు కురిపించారు. కంకిపాడులో 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ తన దృష్టికి తీసుకొచ్చిన పలు అంశాలపై ఆయన అక్కడికక్కడే స్పందించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ కంకిపాడు-రొయ్యూరు వయా చోడవరం రోడ్డును ఆధునికీకరించాలని కోరారు. వెంటనే పవన్ స్పందిస్తూ.. దానిపై తగు

- మిగతా 8లో

సిండికేట్ల కిక్కు

జిల్లా మద్యం షాపుల లాటరీలో మాయాజాలం

113 షాపుల కేటాయింపులో వారిదే హవా

- షాపు దక్కిన వెంటనే అరుపులు, ఆనందోత్సాహాలు
- మొత్తం 20 షాపులు దక్కించుకున్న మహిళలు
- సరిహద్దుల్లోని షాపులపై తెలంగాణ వ్యాపారుల కన్ను
- ఒక్కో షాపునకు ముగ్గురిని ఎంపిక చేసిన అధికారులు



లాటరీ తీస్తున్న కలెక్టర్ సృజన



మద్యం లాటరీ కార్యక్రమానికి హాజరైన దరఖాస్తుదారులు

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు సిండికేట్లకు 'కిక్కె'క్కించింది. కొన్నేళ్లుగా మద్యం వ్యాపారంలో ఉన్నవారే దాదాపు షాపులను కైవసం చేసుకున్నారు. ఇక ఈసారి లాటరీలో మహిళలు ఏకంగా 20 షాపులను వశం చేసుకున్నారు. డ్రాలో టోకెన్ తగలగానే అరుపులు, కేరింతలు కొట్టిన సిండికేట్లు.. ఇతరులకు దక్కిన అరకొర షాపులను కూడా లాక్కునేందుకు బేరాలు సాగించడంతో సోమవారం జరిగిన లాటరీ ప్రక్రియ ఆద్యంతం గమ్మత్తుగా సాగింది.

విజయవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 113 మద్యం దుకాణాలకు 5,825 దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దాఖలయ్యాయి. వాటిని పరిశీలించిన అధికారులు గురునానక్ కాలనీలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో సోమవారం డ్రా తీశారు. కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్ నిధిమీనా, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, డీపీఈవో శ్రీనివాసరావు లాటరీ విధానాన్ని నిర్వహించారు. 113 మద్యం దుకాణాలను రెండు భాగాలు చేసి రెండు హాళ్లలో లాటరీ తీశారు. షాపుల నెంబర్లవారీగా దాఖలైన దరఖాస్తుదారుల పేర్లను ఎక్సైజ్ అధికారులు చదివారు. తర్వాత ఒక బోర్డుపై ఉన్న అంకెలపై దరఖాస్తులు ఎన్ని ఉన్నాయో, అన్ని నెంబర్ల టోకెన్లను అమర్చారు. వాటిని దరఖాస్తుదారులకు చూపించారు. ఆ తర్వాత వాటిని ఒక స్టీల్ డబ్బాలో వేసి కలిపారు. అందులో నుంచి కలెక్టర్ సృజన, జేసీ నిధిమీనా ఒక టోకెన్ తీశారు. టోకెన్‌పై ఉన్న సంఖ్యకు సంబంధించి దరఖాస్తుదారుడికి షాపును కేటాయించారు. ఇదికాకుండా రిజర్వ్‌డ్ 1(ఆర్1), రిజర్వ్‌డ్ 2(ఆర్2)గా మరో రెండు టోకెన్లు తీశారు. షాపును దక్కించుకున్న దరఖాస్తుదారుడు సొమ్ము చెల్లించకపోయినా, బ్యాంకు గ్యారెంటీ ఇవ్వకపోయినా అతడికి షాపును రద్దుచేసి ఆర్1కు కేటాయించేలా ఈ ప్రక్రియను చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటలకు షాపుల కేటాయింపు పూర్తయింది. జిల్లావ్యాప్తంగా 20 షాపులు మహిళలకు దక్కాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలో ఆరోవంతు భాగాన్ని బ్యాంక్ డీడీల రూపంలో చెల్లించాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎక్సైజ్ అధికారులు ప్రొవిజనల్ లైసెన్స్‌ను జారీ చేస్తారు. తర్వాత షాపు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు, నిబంధనల ప్రకారం ఈ ఏర్పాటు ఉందా, లేదా అనే అంశాలను పరిశీలించి అసలు లైసెన్స్‌ను జారీ చేస్తారు. రెండో సంవత్సరం ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పదిశాతం పెంచి రుసుం చెల్లించాలి.

సిండికేట్ మాయాజాలం

లాటరీ తీస్తున్న హాల్ నుంచి సిండికేట్ సభ్యులు కదలనేలేదు. ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు కుర్చీల్లోనే ఉండిపోయారు. జిల్లాలో 113 షాపులుండగా, కొంతమంది ఒక్కో షాపునకు ఐదు నుంచి పది దరఖాస్తులు పెట్టారు. ఇక సిండికేట్లు చేసిన దరఖాస్తుల సంఖ్యకు లెక్కేలేదు. ఒక సిండికేట్ ఏకంగా 500 దరఖాస్తులు చేసింది. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షలను ప్రభుత్వానికి చెల్లించింది. ఈవిధంగా మొత్తం రూ.10 కోట్ల వరకు పెట్టుబడి పెట్టింది. ఈ సిండికేట్ లాటరీలో 11 షాపులను దక్కించుకుంది. లిక్కర్ సిండికేట్లను నాయకత్వం వహిస్తున్న వారూ భారీగానే షాపులను దక్కించుకున్నారు. ప్రస్తుతం బార్ అండ్ రెస్టారెంట్లను నిర్వహిస్తున్న వారు కొన్ని షాపులను దక్కించుకున్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తి మొత్తం 50 దరఖాస్తులు చేశారు. లాటరీలో ఆయనకు ఒక షాపు తగిలినట్టు సమాచారం.

పోటాపోటీగా..

ఈసారి సిండికేట్ల మధ్య పోటీగా తీవ్రంగా సాగింది. ఎక్కువ షాపులను దక్కించుకోవాలన్న తపనతో సిండికేట్లు భారీగా దరఖాస్తు చేశారు. కొన్నాళ్లుగా లిక్కర్ వ్యాపారంలో ఉన్నవారు మరికొంతమందిని కలుపుకొని సిండికేట్‌గా ఏర్పడ్డారు. కొత్తగా లిక్కర్ వ్యాపారంలోకి అడుగుపెడదామని వచ్చినవారు సిండికేట్ అడుగుజాడల్లో నడిచారు. లాటరీలో దక్కిన షాపులను సిండికేట్ సభ్యులు పంచుకున్నారు. నగరంలో మొత్తం 39 షాపులుండగా, 20కి పైగా షాపులను

- మిగతా 8లో



కొంపముంచేస్తున్నారు..!

పీఎంఏవై లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ మరో షాక్

- నిన్న నోటీసులు.. నేడు డబ్బు చెల్లించాలంటూ ఫోన్లు
- 'రీ వెరిఫికేషన్' పేరుతో ఉన్నతాధికారుల నిర్వాకం
- 300 యూనిట్ల విద్యుత్ వినియోగాన్ని సాకుగా చూపి..
- ప్రభుత్వం పట్టించుకోవాలని లబ్ధిదారుల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) లబ్ధిదారులను గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు నానా ఇబ్బందులు పెడుతున్నారు. లబ్ధిదారులపై అనర్హత వేటు వేసేందుకు పదరాని పాట్లు పడుతున్నారు. ఎప్పుడో కట్టుకున్న ఇళ్లకు, పురోగతిలో ఉన్న ఇళ్లకు విద్యుత్ బిల్లు వినియోగం 300 యూనిట్లు దాటిందన్న పేరుతో ఇప్పటికే అనర్హుల జాబితాలో చేర్చిన సంగతి తెలిసిందే. తాజాగా.. అనర్హతను బట్టి ఈ పథకం కింద పొందిన రూ.1.50 లక్షల సాయాన్ని తిరిగి చెల్లించాలంటూ లబ్ధిదారుల మెడపై కత్తి పెడుతున్నారు. 'మీరు అనర్హులుగా మారారు. పీఎంఏవై డబ్బును తిరిగి చెల్లించండి..' అంటూ గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా లబ్ధిదారులకు ఫోన్లు చేయిస్తున్నారు. ఇళ్లు నిర్మించుకున్నాం కాబట్టి తమకొచ్చిన నష్టమేమీ లేదని కొంతమంది లబ్ధిదారులు భావిస్తున్నా.. మరికొంతమంది మాత్రం కోర్టును ఆశ్రయించాలనుకుంటున్నారు. ఇళ్లు కట్టుకున్నాక డబ్బు తిరిగి చెల్లించమనటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

గృహనిర్మాణ శాఖ అత్యుత్సాహమే..

ఈ సమస్యకు గృహ నిర్మాణ శాఖ అధికారుల అత్యుత్సాహమే ప్రధాన కారణం. ప్రభుత్వ మెప్పు కోసం పీఎంఏవై పథకంలో ఏవో అక్రమాలు జరిగిపోయాయంటూ రీ వెరిఫికేషన్‌కు తెరతీశారు. సుబ్బారావు అనే వ్యక్తికి పీఎంఏవై కింద ఇల్లు మంజూరైతే.. అందుకు భిన్నంగా శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇల్లు కట్టుకుంటే.. అనర్హుల జాబితాలో చేర్చవచ్చు. అలాకాకుండా ఏదో రకంగా ప్రభుత్వానికి రిమార్కులు చూపించటం కోసం సిక్స్ పాయింట్ ఫార్ములా వెరిఫికేషన్‌ను తెరపైకి తెచ్చారు. ఈ ఫార్ములా ప్రకారం విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటకూడదన్న సాకును చూపించారు. ఇల్లు కట్టాక విద్యుత్ వినియోగంపై అనర్హత వేటు వేయడమేమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. పీఎంఏవై మార్గదర్శకాల ప్రకారం సొంత స్థలం కలిగి ఉండి, దారిద్ర్యరేఖకు దిగువన ఉంటే చాలు.. ఈ పథకానికి అర్హత సాధిస్తారు. కేంద్రం కూడా అర్హతను పరిశీలించాకే ఆమోదం తెలుపుతుంది. వాటన్నింటినీ తోసిపుచ్చి అనర్హత వేటుతో పాటు మెడపై కత్తి పెట్టినట్టుగా డబ్బు తిరిగి చెల్లించమనడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

- మిగతా 8లో



క్రైమ్స్ డీసీపీగా తిరుమలేశ్వరరెడ్డి

విజయవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కమిషనరేట్ క్రైమ్స్ డీసీపీగా డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజుల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో ఆయన్ను కమిషనరేట్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.



సిందూరశోభితం

ఇంద్రకీలాద్రికి పోటెత్తుతున్న భవానీలు

విజయవాడ/వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి ఎరుపెక్కింది. వివిధ రాష్ట్రాల నుంచి భవానీలు భారీగా తరలివస్తున్నారు. ఆదివారంతో పోల్చుకుంటే సోమవారం రద్దీ కాస్త తగ్గుముఖం పట్టినా..

- మిగతా 8లో

గుండెల్లో రైళ్లు!

వరుస ప్రమాదాలతో భీతిల్లుతున్న ప్రయాణికులు

- నివారించకపోతే.. రైల్వేపై నమ్మకంపోతుంది
- ప్రయాణికులకు రక్షణ కల్పించలేని ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు
- ఆధునిక టెక్నాలజీ చెంత ఉన్నా.. ప్రమాదాలకు చెక్ పెట్టలేరా?

6లో

పేకాట శిబిరంపై దాడి

- 24మంది అరెస్ట్, రూ.1.52 లక్షలు స్వాధీనం

8లో



నగరం.. నరకం..

నగరంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ట్రాఫిక్ అస్తవ్యస్తమైంది. బందరురోడ్డులో నీరు నిలిచిపోవడంతో గంటలకొద్దీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

కరకట్ట రోడ్డు విస్తరణకు సీఆర్‌డీఏ సన్నాహాలు

- అవసరమైన భూముల కోసం అధ్యయనం
- భూములు కొలిక్కిరాగానే.. నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయం

6లో



అందాల అనన్య

లబ్బీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25న విడుదలకానున్న పొట్టేల్ చిత్ర యూనిట్ సోమవారం నగరంలో సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా హీరోయిన్ అనన్య నాగళ్ల విలేకరులతో మాట్లాడారు. హీరో యువచంద్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

16, 17న దుర్గగుడి హుండీల లెక్కింపు

8లో

రాకెట్ ప్రయోగాలకు అనువైన ప్రాంతం గుల్లలమోద

» సతీష్‌రెడ్డి చొరవకు మండలి బుద్ధప్రసాద్ అభినందన

నాగాయలంక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నాగాయలంక మండలంలో గుల్లలమోదకు క్షిపణి పరీక్షా కేంద్రాన్ని మంజూరు చేసిన సందర్భంగా డీఆర్డీవో పూర్వపు ఛైర్మన్ జి.సతీష్‌రెడ్డిని సోమవారం విజయవాడలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు.


జి.సతీష్‌రెడ్డిని సత్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్

ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ సారథ్యంలోని హైలెవల్ సెక్యూరిటీ కమిటీ నిర్ణయం మేరకు గుల్లలమోదకు నియోజకవర్గానికి మహత్తర ప్రాజెక్టు ఇచ్చిందన్నారు. రాకెట్ ప్రయోగాలకు గుల్లలమోద అనువైన ప్రాంతంగా శాటిలైట్ ద్వారా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుకు ఎంపిక చేస్తే గత ఐదేళ్లలో రాష్ట్ర సహకారం లేక ముందుకు సాగలేదన్నారు. ఈ దశలో సతీష్ రెడ్డి క్షిపణి పరీక్షాకేంద్రానికి పర్యావరణ అనుమతుల కోసం విశేష కృషి చేశారాన్నరు. నియోజకవర్గానికి రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేలకోట్ల నిధులు ఇచ్చే ప్రాజెక్టు మంజూరు చేసిన ప్రధాని మోదీకి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో సెక్యూరిటీ కమిటీ కౌన్సిల్ గుల్లలమోద క్షిపణి పరీక్ష కేంద్రానికి ఆమోదం తెలిపినట్టు సతీష్ రెడ్డి చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంతోపాటు జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. త్వరితగతిన ఈ కేంద్రం ద్వారా దేశానికి మరిన్ని క్షిపణులు అందించాలని ఆయన ఆకాంక్షించారు.

దుర్గమ్మ సేవలో సతీష్ రెడ్డి


సతీష్ రెడ్డికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సోమవారం కేంద్ర రక్షణమంత్రి సాంకేతిక సలహాదారు, డీఆర్డీవో పూర్వపు ఛైర్మన్, సతీష్ రెడ్డి దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీస్సులతో పాటు లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.


కలెక్టరేట్ వద్ద కవుతరం మత్స్యకార సంఘం సభ్యుల ప్రదర్శన

అక్రమాలపై చర్యలు తీసుకోండి


» కవుతరం మత్స్యకార సంఘ సభ్యుల నిరసన ప్రదర్శన

మచిలీపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా లెక్కలు చెప్పడంలేదని, సంఘపాలకవర్గం అక్రమాలకు పాల్పడుతోందంటూ కవుతరం మత్స్యకార సహకార సంఘ సభ్యులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. మూడేళ్లుగా సుమారు రూ. 24 లక్షల ఆదాయం వచ్చిందని, ఆదాయ-జమ ఖర్చులు సభ్యులకు తెలపడంలేదని సంఘ సభ్యులు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేసి ఆదాయ వ్యయాలు చెప్పాలని పాలకవర్గ సభ్యులను అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధ్యక్షుడు, కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారని సంఘసభ్యులు ఏడుకొండలు తదితరులు ఆరోపిస్తున్నారు. లీజుకు ఇచ్చిన సొమ్మును బ్యాంకులో జమ చేయలేదని, బోనస్‌ను సభ్యులకు పంచడంలేదన్నారు. అక్రమాలపై జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు, కలెక్టర్ తగిన న్యాయం చేయాలన్నారు.

గుండెల్లో రైళ్లు!



వరుస ప్రమాదాలతో భీతిల్లుతున్న ప్రయాణికులు
నివారించకపోతే.. రైల్వేపై నమ్మకం పోతుంది
సిగ్నలింగ్, ట్రాక్ ఛేంజ్ సందర్భాలలోనే ఎక్కువ ప్రమాదాలు
ప్రయాణికులకు రక్షణ కల్పించలేకపోతున్న ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు
ఆధునిక టెక్నాలజీ చెంత ఉన్నా ప్రమాదాలకు చెక్ పెట్టలేరా?


చెన్నయ్ దుర్ఘటన (ఫైల్)

రోజుకోచోట ట్రాక్ తప్పుతూ ప్రయాణికుల గుండెల్లో 'రైళ్లు' పరిగెత్తిస్తున్నాయి.. బాలాసోర్ ఉదంతం తర్వాత ఇటీవలి కాలంలో వరుసగా రైళ్లు పట్టాలు తప్పటం, ఎదురెదురుగా ఢీకొట్టడం, భోగీలు ఎగిరిపడుతుండటంతో రైలు ప్రయాణికులకు తీవ్ర భయాందోళనలు కలిగిస్తోంది. ఒకప్పుడు అత్యంత సురక్షితమైన రవాణా వ్యవస్థల్లో రైల్వేను ప్రధానంగా చెప్పుకున్నా.. ఇటీవల కాలంలో రైళ్లు పట్టాలు తప్పుతుండటంతో ప్రయాణికుల్లో భయాన్ని పెంచుతోంది. బాలాసోర్ దుర్ఘటన ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగించగా.. ఆ తర్వాత పలు సందర్భాలలో రైళ్లు పట్టాలు తప్పటం.. తాజాగా చెన్నై దుర్ఘటతో రైలు ప్రయాణమంటేనే అభద్రతాభావనకు గురయ్యే పరిస్థితి నెలకొంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

రైలు ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ అధికారులు సరికొత్త వాదనలకు తెరదీస్తున్నారు. రైల్వే ఎదుర్కొంటున్న సమస్యలను పక్కదారి పట్టించేలా.. ఒక్కో ప్రమాదం ఒక్కో వాదన తెరపైకి వస్తోంది. తాజాగా చెన్నై రైలు ప్రమాదంలో కుట్ర కోణం ఉందని వాదిస్తున్నారు. ఇటీవల కాలంలో జరిగిన పలు ఘటనల దృష్ట్యా సిగ్నలింగ్ ఆధారిత సమస్యలు తలెత్తుతున్నాయి. దాంతోపాటుగా ట్రాక్ నుంచి రైలు మారే సందర్భంలో కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ రెండింటి కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయన్నది ఇటీవల పలు ప్రమాదాలను చూస్తే అర్థమౌతోంది.

● బాలాసోర్ ఉదంతం తర్వాత దేశంలోనే రెండో అతిపెద్ద జంక్షన్ అయిన విజయవాడ డివిజన్ పరిధిలో ట్రాక్ దృఢత్వాన్ని పెంచే పనులు, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. నాన్ ఇంటర్ లాకింగ్ పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. భద్రత విషయంలో రాజీలేకుండా పనిచేస్తున్నారు. దీంతో భారీ సంఖ్యలో రైళ్లను కూడా రద్దు చేస్తున్నారు.



● చెన్నయ్ ఘోర దుర్ఘటనతో విజయవాడ డివిజన్ ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. విజయవాడ నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణాలు చేసేది చెన్నైకే.. విజయవాడ డివిజన్ పరిధిలో నడిచే రైళ్ల అత్యధికంగా చెన్నైకే కావటం గమనార్హం. ఆ తర్వాతే సికింద్రాబాద్, బెంగళూరు, విశాఖపట్నంలకు రాకపోకలు సాగిస్తుంటారు. పండగ ముందు చెన్నై ప్రమాదంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. టెక్నాలజీ విస్తరిస్తున్న తరుణంలోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఎల్‌హెచ్‌బీ బోగీలు వచ్చిన తర్వాత రైళ్లు గుద్దుకున్నా బోగీలు బ్యాలెన్స్ తప్పవని, ప్రయాణికులకు భద్రత ఉంటుందని చెబుతున్నా.. బాలాసోర్ ఉదంతంలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు కూడా ప్రయాణికుల ప్రాణాలను నిలపలేకపోయాయి. ప్రమాదాలను నివారించే కవచ్ వంటి రక్షణాత్మక వ్యవస్థలు కూడా చాలా పరిమితంగానే అమలు చేయటం జరిగింది. వరుస ప్రమాదాలతో రైల్వే ప్రతిష్ఠ మసకబారుతోంది. ప్రయాణికులకు భద్రతను కల్పించకపోతే రానున్న రోజుల్లో రైలు ప్రయాణికులు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుంది. ప్రయాణికుల సేఫ్టీ కోసం మరింతగా అధికారులు ఆధునిక టెక్నాలజీని వినియోగించాల్సిన అవసరం ఉంది.

అర్జీలు క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలి

» డీఆర్వో చంద్రశేఖరరావు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సత్వరం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో 'మీకోసం' కార్యక్రమంలో చంద్రశేఖరరావు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులకు సత్వరమే వకాలత్‌లు ఫైల్ చేయాలన్నారు. ప్రతి నెలా 5న ఆర్టీఐ నివేదికలు పంపాలన్నారు. వీల్‌చైర్లు అడిగిన దివ్యాంగులకు వెంటనే ఇప్పించాలన్నారు. ప్రత్యేక ఉపకలెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల నుంచి వచ్చే అర్జీలు సత్వరమే పరిష్కరించి కలెక్టరు ముందుంచాలన్నారు.

● మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్‌లను కాంట్రాక్టరు కట్టడంలేదని ఏఐటీయూసీ నాయకులు ఒఎల్‌రావు, ఎం ఫణీంద్రలు వినతి పత్రం సమర్పించారు. 25 ఏళ్ళుగా పనిచేస్తున్నామని అరకొర జీతాలు చెల్లిస్తున్నారని కార్మికులు తెలిపారు. జీతాలు పెంచాలని కోరారు.


ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి

● వరదకు తాము పండించిన వరి, పసుపు పూర్తిగా పాడయ్యాయని, తమకు నష్టపరిహారం అందలేదని తోట్ల వల్లూరు మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన మోర్ల సత్యనారాయణ, శివపార్వతి, లుక్కా శివ నారాయణ, రమాదేవి తదితర రైతులు అర్జీ సమర్పించారు. నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

● ఆధార్‌కార్డు ఇప్పించాలని మచిలీపట్నం కాలేఖాన్‌పేటకు చెందిన తుమ్మా రాఘవులు కోరారు.

● అధిక వర్షాలకు పంట నష్టపోయామని, నష్ట పరిహారం తమకు చెల్లించలేదని పెడన మండలం సేరీ వర్లులపల్లి, ముచ్చిలగుంట గ్రామాలకు చెందిన రైతులు జన్ను నారాయణమ్మ, పుట్టి బ్రహ్మయ్యలు కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జి.గీతాభాయి, హౌసింగ్ పీడీ ఎస్.వెంకట్రావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టాటా మృతి తీరని లోటు


ఆటోనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రతన్ టాటా మృతి కేవలం దేశానికే కాదని, ప్రపంచానికి తీరని లోటని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని ది విజయవాడ ఇండస్ట్రీయల్ ఎస్టేట్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్, జె.ఆర్.డి టాటా ఐలా సర్వీసెస్ సొసైటీ, ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ ఇండస్ట్రీయల్ ఎస్టేట్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాల్‌లో రతన్ టాటాకి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రతన్ టాటా విలువలకు, నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శమని కొనియాడారు. తన ఆదాయంలో సగానికి పైగా సేవా కార్యక్రమాలకు ఉపయోగించడంతో ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. విదేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థులకు నేరుగా ప్రవేశం లభించాలన్నదే రతన్ టాటా లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ బాయిన వెంకట్రావు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోకరాజు గంగరాజు


శ్రీకాకుళేశ్వరుని సన్నిధిలో అన్నపూర్ణ

శ్రీకాకుళేశ్వరుని దర్శించిన సినీనటి అన్నపూర్ణ

ఘంటసాల: శ్రీకాకుళం గ్రామంలో శ్రీకాకుళేశ్వరస్వామిని సినీనటి అన్నపూర్ణ సోమవారం దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేశారు.


ఫ్లెక్సీలను తొలగిస్తున్న తాతయ్య

పోస్టర్, ఫ్లెక్సీ రహిత పట్టణంగా జగ్గయ్యపేట

జగ్గయ్యపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : పోస్టర్లు, ఫ్లెక్సీలులేని సుందర జగ్గయ్యపేటగా తీర్చిదదిద్దేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సహకరించాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్రలు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వివిధ సందర్భాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్ల తొలగింపుకు వారు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ, మంత్రి పి.నారాయణ నెల్లూరును పోస్టర్లు, ఫ్లెక్సీల రహితంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ముందుగా తాము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్నామని తెలిపారు. ఇతర పార్టీల వారు తమ ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. ఫ్లెక్సీల వల్ల ప్రధాన రహదారులు మూసుకుపోయి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు ఈ చర్య ఉపక్రమిస్తుందని తెలిపారు. రెండు, మూడు రోజులు అవకాశం ఇస్తామన్నారు. ముందస్తుగా అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా అంగీకరించబోమని చెప్పారు. పురపాలక సంఘ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

మరో 2 రోజుల పాటు కోస్తా తీరంలో వర్షాలు కురిసే అవకాశం

» అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్ » వరి పొలాలకు మేలు

మచిలీపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం విడతలవారీగా భారీ వర్షం కురిసింది. నాగాయలంకలో అత్యధికంగా 55.4 మిల్లీమీటర్లు, ఉయ్యూరులో అత్యల్పంగా 3.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 8.0 మిల్లీమీటర్లుగా నమోదైంది. కోస్తాతీరం వెంబడి రానున్న రెండు రోజుల్లో 20 సెంటీ మీటర్ల కన్నా అధికంగా వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతోపాటు గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రానున్న రెండు రోజులపాటు దక్షిణ కోస్తాతీరం మొత్తాన్ని ఆరెంజ్ అలర్ట్‌గా వాతావరణశాఖ ప్రకటించింది.

వర్షాలతో వరికి మేలు

జిల్లాలో ముందస్తుగా వరినాట్లు పూర్తి చేసిన పొలాల్లో వరిపైరు బిర్రుపొట్ట దశలో ఉంది. ప్రధానంగా కంకిపాడు, ఉయ్యూరు పామర్రు, తోట్లవల్లూరు, తదితర మండలాల్లోని వరిపైరుకు వర్షాలు మేలు చేస్తాయని రైతులు చెబుతున్నారు. పైరు త్వరితగతిన ఈతకు వస్తుందని పేర్కొంటున్నారు. వాతావరణంలో మరింతగా మార్పులు చోటుచేసుకుంటే వరిపైరుకు తెగుళ్లు ఆశించే ప్రమాదం కూడా ఉందని రైతు లు భయపడుతున్నారు. కాలువ శివారు ప్రాంతాల్లో 45 రోజు లకు పైబడిన వరి పైరుకు ఎరువులు వేసి ఉంటే మరింత ఏపుగా ఎదుగుతుందని, శివారు ప్రాంతాలకు సాగునీటి ఎద్దడి కొంత మేర తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.


కోనేరు సెంటర్లో నిలిచిన వర్షపు నీరు



కరకట్ట రోడ్డు విస్తరణకు సీఆర్‌డీఏ సన్నాహకాలు

» భూముల కోసం సీఆర్‌డీఏ అధ్యయనం
» 4 వరుసలుగా విస్తరించాలని నిర్ణయం

విజయవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధానికి విజయవాడ నుంచి అత్యంత ప్రధానమైన కరకట్ట మార్గాన్ని నాలుగు వరుసులుగా అభివృద్ధి చేసేందుకు సీఆర్‌డీఏ అధికారులు సన్నాహకాలు చేపడుతున్నారు. టెండర్లు పిలవటానికి కొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. కరకట్ట రోడ్డును నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించటం జరిగింది. సీడ్ యాక్సెస్ మొదటి దశ పనుల నేపథ్యంలో దీని పనులు చేపట్టలేదు. ఈ లోపు ఎన్నికలు రావటం వైసీపీ ప్రభుత్వ ఏర్పడింది. కరకట్ట రోడ్డును రెండు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులకు పనులు అప్పగించింది. భూముల ఇబ్బందుల వల్ల ఈ పనులు ముందు సాగలేదు. కేవలం 3 ఎకరాల దగ్గర సమస్య రావటంతో కరకట్ట విస్తరణ పనులు సాధ్యం కాలేదు. మళ్ళీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తిరిగి నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించింది. ప్రస్తుతం నాలుగు వరుసలుగా చేస్తున్న నేపథ్యంలో, అదనంగా భూములను సేకరించాల్సి వస్తోంది. ఈ మేరకు సీఆర్‌డీఏ అధికారులు ఎంత భూములు అవసరమౌతుందన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. భూముల ప్రతిపాదన కొలిక్కి రాగానే.. ఈ ప్రక్రియను చేపట్టాలని భావిస్తున్నారు. భూ సమీకరణ, భూ సేకరణ విధానంలో వీలును బట్టి వెళ్ళాలని సీఆర్‌డీఏ భావిస్తోంది.

విద్యార్థి మృతదేహం లభ్యం



వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక స్వర్గపురి ఘాట్ కృష్ణానదిలో స్నానం చేయటానికి దిగి గల్లంతైన రేపల్లె రాజ్ (21) మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ, కొత్తపాలెంకు చెందిన రేపల్లె రాజ్ నగరంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఎంఏ చదువుతున్నాడు. స్నేహితులైన పోతినేని కేశవ, వెక్కల విష్ణువర్ధన్‌లతో కలిసి ఆదివారం సరదాగా కృష్ణానదిలో స్నానం చేసేందుకు స్వర్గపురి ఘాట్ వద్ద నదిలో దిగారు. రేపల్లె రాజ్ ప్రమాదవశాత్తు నదిలో గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందం నదిలో గాలించినప్పటికీ అతడి ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం గల్లంతైన ప్రదేశంలోనే మృతదేహాన్ని గుర్తించారు.


రాజ్ ఇంటివద్ద భారీగా బంధువులు, గ్రామస్థులు

స్వగ్రామంలో విషాదఛాయలు..

కోడూరు : మండల పరిధిలోని వి.కొత్తపాలెంలో గ్రామానికి చెందిన యువకుడు విద్యనభ్యసించేందుకు విజయవాడ వెళ్లి శవమై రావటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన రేపల్లె అజయ్ కుమారుడు రేపల్లె రాజా (20) విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఎంఏ చదువుతున్నాడు. దసరా సెలవులకు కూడా ఇంటికి రాకుండా ప్రత్యేక కోచింగ్ ఉందని విజయవాడలోనే ఉన్నాడు. ఆదివారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి విజయవాడలో కృష్ణానదిలో గల్లంతైన రాజా సోమవారం ఉదయానికి శవమై తేలటంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన అజయ్‌కు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడిపైనే కోటి ఆశలు పెట్టుకున్న ఆ తండ్రి కుమారుడి ఉన్నత చదువుల కోసం ఖర్చు చేస్తున్నాడు. త్వరలో కొడుకు ఉన్నతస్థితికి ఎదుగుతాడని ఆశ పడగా, ఇంతలోనే మృత్యుఒడిలోకి చేరుకోవటంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు పలువురిని కలచివేస్తోంది. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన వి.కొత్తపాలెం గ్రామానికి తీసుకురాగా, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు తరలివచ్చి మృతదేహాన్ని సందర్శించారు. తల్లిదండ్రుల శోకాన్ని చూసి చలించిపోయారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

నేడు ఐఎంఏ వైద్యుల నిరాహార దీక్షలు

» బెంగాల్‌లో జూ.డాల ఆమరణ దీక్షకు సంఘీభావం

ఆటోనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కోల్‌కతాలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు ఐఎంఏ సంఘీభావం ప్రకటించింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లో 12 గంటల పాటు నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఫణిదర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతాలో గత 9 రోజులుగా జూనియర్ వైద్యులు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా దేశవ్యాప్తంగా నిరాహార దీక్షలు చేపట్టాలని ఐఎంఏ పిలుపునిచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా అక్టోబరు 15న ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రాష్ట్రంలో అన్ని మెడికల్ కాలేజీల్లో దీక్షలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొనాలని కోరారు. బెంగాల్‌లోని జూనియర్ వైద్యుల డిమాండ్లను బెంగాల్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అంగీకరించాలని డిమాండ్ చేశారు. విజయనగరం మహారాజా వైద్య కళాశాలలో జరిగే నిరాహార దీక్షలో ఎం.జయచంద్రనాయుడు, విజయవాడ మెడికల్ కాలేజీలో ఫణిదర్, ఇతర చోట్ల ఐఎంఏ నాయకులు, విద్యార్థులు పాల్గొననున్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గద్దె రామ్మోహన్

దక్షిణ భారత్‌లో డై పోల్ విస్తరణ

» నగరంలో బ్రాంచి ప్రారంభం

పటమట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆస్ట్రేలియాలో 12 ఏళ్లగా ఐటీ, కమ్యూనికేషన్స్ బ్రాడ్‌కాస్టింగ్ రంగంలో సేవలందిస్తున్న డై పోల్ గ్రూప్ భారత్‌లో తన కార్యకలాపాల విస్తరణకు శ్రీకారం చుట్టింది. విజయవాడలో నూతన కార్యాలయాన్ని గద్దె రామ్మోహన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో యువతకు, ముఖ్యంగా విజయవాడలో ఉపాధి అవకాశాలను డై పోల్ సృష్టించాలని కోరారు. సంస్థ వ్యవస్థాపకుడు రవి నెక్కలపూడి మాట్లాడుతూ, వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో 500 మందికిపైగా ఐటీ నిపుణులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సాగర్ చాప్కే, డై పోల్ ప్రతినిధులు పాల్గొన్నారు.


జాతీయ స్థాయి సేవా ధార్మిక్ అవార్డును అందుకుంటున్న హెల్పింగ్ హ్యాండ్స్ సీహెచ్ వెంకట్

హెల్పింగ్ హ్యాండ్స్‌కు సేవా ధార్మిక్ అవార్డు


ఆటోనగర్ : లతా రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17వ జాతీయస్థాయి సేవా ధార్మిక్ అవార్డును విజయవాడకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సీహెచ్ వెంకట్ సోమవారం నల్గొండలో అందుకున్నారు. ప్రతి రాష్ట్రం నుంచి నలుగురిని ఎంపిక చేసి వారికి జాతీయ సేవా ధార్మిక్ అవార్డును ఫౌండేషన్ అందిస్తోంది. దీంతో పాటు రూ.లక్ష నగదుబహుమతిని మాజీ డీజీపీ సి.ఆంజనేయరెడ్డి అందజేశారు. అనంతరం వెంకట్‌ను శాలువాతో సత్కరించారు.



సత్యమేవ జయతే

నేడు వెంపటి చిన్నసత్యం జయంతి

కూచిపూడిని విశ్వవ్యాప్తం చేసిన వెంపటి చినసత్యం



- సినీ నృత్య దర్శకుడిగా ప్రాచుర్యం
- టీటీడీ ఆస్థాన నాట్యాచార్యుడిగా అంతులేని ఖ్యాతి
- పద్మభూషణ్ వంటి ఎన్నో అవార్డులు సొంతం
- మహామహులకు నాట్యంలో మెలకువలు నేర్పిన గురువు
- ప్రపంచవ్యాప్తంగా 10 వేలకు పైగా శిష్యులు
- ఏటా యక్షగాన సార్వభౌమ స్మారక పురస్కారం
- కూచిపూడి నుంచి కాలిఫోర్నియా వరకూ విజయదుందుభి

కూచిపూడి.. ఈ పేరు వినగానే ఎవరికైనా గుర్తొచ్చేది ఆంధ్రజాతికి ఆభరణమైన కూచిపూడి నృత్యమే. హావభావాలు, హస్త విన్యాసాలు, పదకృతులతో ఆవిష్కృతమయ్యే మనోజ్ఞ ప్రబంధమే. అంతటి కూచిపూడి నృత్యానికి మరిన్ని మెరుగులుదిద్ది విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి వెంపటి చినసత్యం. దక్షిణ భారతంలో భరతనాట్యమే ప్రధానంగా విరాజిల్లుతున్న తరుణంలో తన కళారూపాలు, నృత్య రూపకాలతో కూచిపూడికి ప్రాచుర్యం కల్పించారు. క్షీరసాగర మదనం మొదలు చండాలిక వంటి ఎన్నో నృత్య రూపకాలు రూపొందించి, ప్రపంచవ్యాప్తంగా కూచిపూడి నృత్య రూపకాలు ప్రదర్శించి తెలుగువాడి కీర్తి పతాకాన్ని విశ్వవీధుల్లో రెపరెపలాడించిన మహానుభావుడి జయంతి, ప్రపంచ కూచిపూడి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

(ఆంధ్రజ్యోతి, అవనిగడ్డ/కూచిపూడి): కూచిపూడి గ్రామంలో 1929, అక్టోబరు 15న వెంపటి చలమయ్య-వరలక్ష్మి దంపతులకు చిన సత్యం జన్మించారు. తాడేపల్లి పేరయ్య శాస్త్రి వద్ద అభ్యాసం ప్రారంభించి ఆరేళ్ల చిరుప్రాయంలోనే గురువు మన్ననలు పొందారు. వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి వద్ద కూచిపూడిలో అన్ని మెలకువలు నేర్చుకుని పసుమర్తి కొండలరాయుడు నాట్యమేళాలో వివిధ పాత్రల పోషణలో తర్ఫీదు పొందారు. అనంతరం ఆర్థిక ఇబ్బందులతో మద్రాసు వెళ్లి తన సోదరుడు వెంపటి సత్యం వద్ద కొన్నాళ్లు శిష్యరికం చేశారు. సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రవేశించి నృత్య దర్శకుడిగా పలు చిత్రాల్లో పనిచేశారు. లవకుశ, శ్రీకృష్ణవిజయం వంటి ఎన్నో చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించారు. 'లవకుశ' సినిమాలో 'వినుడు.. వినుడు రామాయణ గాథ' పాటకు నృత్యాన్ని సమకూర్చగా, 'శ్రీకృష్ణ విజయం' చిత్రంలో నటి హేమమాలిని నర్తించిన 'జోహారు శికిపించమౌళి..' పాటకు నృత్య దర్శకత్వం వహించారు. సినిమాల ద్వారా ఆర్థిక ఇబ్బందులు తొలగినా అది ఆయనలోని కళాతృష్ణను తీర్చలేకపోవటంతో 1963 ఫిబ్రవరి 6న కూచిపూడి ఆర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేసి వేలాది మందికి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చి ప్రఖ్యాతి పొందిన నృత్య కళాకారులుగా తీర్చిదిద్దారు.

విప్లవాత్మక మార్పులు

నాట్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు చినసత్యం. అప్పటి వరకు కేవలం పురుషులే నృత్య రూపకాల్లో ఉంటూ స్త్రీ పాత్రలు పోషించేవారు. కానీ, వెంపటి చిన సత్యం తాను రూపొందించిన నృత్య రూపకాల్లో మహిళా పాత్రలను మహిళలతోనే వేయించి విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టారు.

ఎన్నో అవార్డులు, పురస్కారాలు

కూచిపూడి నాట్యాచార్యులుగా, నృత్య రూపకాల శిల్పిగా 4 దశాబ్దాలపాటు విశేషంగా సేవలందించిన చినసత్యం ఎన్నో అవార్డులు, గౌరవ పురస్కారాలు అందుకున్నారు. 1980లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ అవార్డుతో ఆయన్ను గౌరవించగా, 1981లో కేంద్ర సంగీత నాటక అకాడమీ కూచిపూడి నాట్య ప్రముఖ్ పురస్కారాన్ని అందించింది. 1983లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయగా, 1992లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం కాళిదాసు పురస్కారాన్ని ప్రదానం చేసింది. 1994లో తమిళనాడు ప్రభుత్వం కళైమామణి అవార్డు అందించగా, భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ అవార్డుతో గౌరవించింది. 2001లో సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ అందించింది. పలు జీవన సాఫల్య పురస్కారాలను ఆయనందుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా శిష్య బృందం

వెంపటి చినసత్యానికి ప్రపంచవ్యాప్తంగా శిష్య బృందం ఉంది. ప్రఖ్యాత నృత్య కళాకారులు యామిని కృష్ణమూర్తి, రేఖ, మంజుభార్గవితో పాటు నిన్నటి తరం నటి రమ్యకృష్ణ సైతం చిన్న సత్యానికి శిష్యులే. మద్రాసులో ఏర్పాటు చేసిన కూచిపూడి ఆర్ట్స్ అకాడమీలో దాదాపు 10వేల మందికిపైగా నాట్యం నేర్చుకుని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలిస్తున్నారు.

కుటుంబ నేపథ్యం

1952లో స్వరాజ్యలక్ష్మిని వివాహమాడిన ఆయనకు కామేశ్వరి, కాత్యాయణి, బాలాత్రిపుర సుందరి, వెంకట చలపతి సంతానం. 2,800 మందితో హైదరాబాద్‌లో ప్రదర్శన ఇచ్చి ఔరా.. అనిపించారు. 1963లో చెన్నైలో కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయగా, ఆయన వద్ద శిష్యరికం చేసిన శిష్యులు 2,800 మందితో 2011లో హైదరాబాద్‌లో ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనకు గిన్నిస్ బుక్‌లో స్థానం లభించింది. 1963లో స్థాపించిన కూచిపూడి ఆర్ట్స్ అకాడమీకి తమిళనాడు ప్రభుత్వం 1997లో భూమిని కేటాయించగా, ఆయన శిష్య బృందం సహకారంతో సొంత భవనంలో నేడు అకాడమీ విజయవంతంగా నడుస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వ అరుదైన గౌరవం

2012, జూలై 29న వెంపటి చినసత్యం మృతి చెందగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు అరుదైన గౌరవాన్ని ఇచ్చింది. ఏటా అక్టోబరు 15న ప్రపంచ కూచిపూడి దినోత్సవంగా ప్రకటించి వేడుకలు నిర్వహించటంతో పాటు ఆయన పేరిట రూ.5లక్షలతో యక్షగాన సార్వభౌమ స్మారక పురస్కారాన్ని అందిస్తోంది.

అందెల రవళిని విశ్వవ్యాప్తం చేసిన మహాతపస్వి

స్వాతంత్ర్యానికి పూర్వం కేవలం కూచిపూడికే పరిమితమైన కూచిపూడి నృత్యాన్ని విశ్వవ్యాప్తం చేయటంలో వెంపటి చినసత్యం రూపొందించిన నృత్యరూపకాలు విశేష పాత్రను పోషించాయి. 1947లో సినీరంగంలో ప్రవేశించిన ఆయన 1961లో సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో క్షీరసాగర మదనం నృత్య రూపకాన్ని రూపొందించి ప్రదర్శించారు. ఈ నృత్య రూపకం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. అప్పటికే పేరెన్నికగన్న నృత్యకారిణిగా ఉన్న యామిని కృష్ణమూర్తి, వేదాంతం సత్యనారాయణ శర్మను కలుపుకొని రూపొందించిన ఈ క్షీరసాగర మదనం ఆయనకు మంచిపేరు తెచ్చింది. శ్రీకృష్ణ సత్యల దాంపత్య శ్రుతుల వివరణ, నవరత్న నిర్మితమైన హంసతులికా తల్పాల విశేషాలను అభినయంతో ఆవిష్కరిస్తూ భామాకలాపాన్ని రూపొందించారు. ఈ నృత్య రూపకం ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందగా, పలు అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శితమైంది. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో రూపొందించిన 'శ్రీనివాస కల్యాణం' నృత్య రూపకం తెలుగులోనూ, తమిళంలోనూ అజరామరంగా నిలిచింది. మేనక విశ్వామిత్ర, హరవిలాసం, అర్ధనారీశ్వరం, శివధనుర్భంగం, శాకుంతలం, విప్రనారాయణ, కుమార సంభవం వంటి పౌరాణిక సన్నివేశాలకు నృత్య రూపకాన్ని అందించిన చిన్నసత్యం ఠాగూర్ రచించిన 'చండాలిక' కావ్యాన్ని జనరంజకంగా తీర్చిదిద్దారు.

నా పూర్వజన్మ సుకృతం



కూచిపూడి నాట్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి ప్రపంచపటంలో సముచిత స్థానం కల్పించిన గొప్ప నాట్య గురువు వెంపటి చిన్నసత్యం. ఆయన దర్శకత్వంలో కాలిఫోర్నియాలో ప్రదర్శన ఇవ్వటం నా పూర్వజన్మ సుకృతం. కూచిపూడి ఆర్ట్స్ అకాడమీని చెన్నైలో స్థాపించి వేలాదిమంది శిష్యులను తీర్చిదిద్దిన గొప్ప నాట్యాచార్యులాయన. ఆయన వద్ద నేర్చిన కూచిపూడి నాట్య భంగిమలను భావితరాలకు అందించటం గొప్ప సదావకాశంగా భావిస్తున్నాను.

- డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, కూచిపూడి శ్రీసిద్ధేంద్ర కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్

పేకాట శిబిరంపై

టాస్క్‌ఫోర్స్ దాడి

- 24మంది అరెస్ట్, రూ.1.52 లక్షలు స్వాధీనం
- నిర్వాహకుడు టీడీపీ 48వ డివిజన్ మాజీ అధ్యక్షుడు

విద్యాధరపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భవానీపురంలో గుట్టుచప్పుడు కాకుండా టీడీపీకి చెందిన ఓ డివిజన్ మాజీ అధ్యక్షుడు జోరుగా పేకాట నిర్వహిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు అతడిపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో అతడు భవానీపురంలో ఓ గోడౌన్‌లో పేకాట ఆడుతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. పశ్చిమలోని 48వ డివిజన్ టీడీపీ మాజీ అధ్యక్షుడు బేవర జోగేశ్వరరావు భవానీపురంలో ఉల్లిపాయల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొంతకాలం నుంచి కొందరు ఉల్లిపాయల వ్యాపారులతో ఉల్లిపాయల గోడౌన్‌లోనే గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నాడని టాస్క్‌ఫోర్స్ అధికారులకు తెలిసింది. సోమవారం ఈ టాస్క్‌ఫోర్స్ అధికారులు భవానీపురం పోలీసుల సహకారంతో పేకాట శిబిరంపై దాడిచేశారు. నిర్వాహకుడు జోగేశ్వరరావుతో పాటు మొత్తం 24 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు రూ.1,52,700 స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అయితే పేకాటలో మొత్తం రూ.5 లక్షలు పట్టుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.



మద్యం మత్తులో వీరంగం చేసిన వ్యక్తి (టీ షర్ట్‌తో ఉన్న యువకుడు)

పంజా, నైజాంగేటు సెంటర్లలో

గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు

- భయభ్రాంత్రులకు గురవుతున్న స్థానికులు

ఆంధ్రజ్యోతి, వన్‌టౌన్: వన్‌టౌన్‌లోని పంజాసెంటర్, నైజాంగేటు సెంటర్ల వద్ద రాత్రీ, పగలు అనే తేడా లేకుండా బ్లేడ్‌బ్యాచ్, గంజాయి బ్యాచ్ సభ్యులు వీరంగం వేస్తున్నారు. దీంతో స్థానికులు, ఒంటరిగా నడచుకుంటూ వెళ్లే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీరిపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ బ్యాచ్ సభ్యులు పీకలవరకు మత్తు పదార్థాలు సేవించి రోడ్లపై గొడవపడుతూ తమ వద్ద ఉన్న బ్లేడులు, చాకులతో దాడులకు దిగుతున్నారు. అడ్డుకోవటానికి ప్రయత్నించిన స్థానికులను దూషిస్తున్నారు. మూడు రోజుల క్రితం వించిపేటలో టిఫిన్ బండి నడుపుకునే ఓ మహిళ వద్దకు పలువురు గ్యాంగ్ సభ్యులు వెళ్లి దాడికి ప్రయత్నించారు. ఆమె భయంతో కేకలేయగా, స్థానికులు పట్టుకోవటానికి ప్రయత్నించగా కొందరు పారిపోగా, ఒకరిని పట్టుకున్నారు. ఆ వ్యక్తిని స్థానికులు స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. ఇటీవల రైల్వే కో పైలట్‌పై ఓ సైకో దాడిచేసి హత్యచేసిన సంఘటన మరవకముందే బ్లేడ్, గంజాయి బ్యాచ్ సభ్యులు ఒంటరిగా ఉన్న మహిళలపై దాడులకు పాల్పడుతున్నారు. దీంతో స్థానికులు, ఒంటరిగా వెళ్లే మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ బ్యాచ్‌ల వారు ముఠాలుగా విడిపోయి అర్ధరాత్రి వేళలో రోడ్లపై వీరంగం వేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో

ముగిసిన దసరా ఉత్సవాలు

- పాల్గొన్న సీపీ రాజశేఖర్ బాబు

వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంతో దసరా మహోత్సవాలు ముగిశాయి. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో దసరా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ గురుప్రకాష్ దంపతులు పాల్గొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు పాల్గొని అమ్మవారికి పట్టువస్త్రాలు, నవధాన్యాలు సమర్పించారు. అనంతరం సీపీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ రాజశేఖర్ బాబు మీడియాతో మాట్లాడుతూ దసరా మహోత్సవాలకు సుమారు ఆరు వేల మంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొన్నారని తెలిపారు. దుర్గమ్మను 15 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నారని, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ఈ.ఓ కె.ఎస్.రామరావు, డీసీపీ గౌతమీశాలిని, ఏడీసీపీ జి.రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మహోత్సవాల ముగింపులో పాల్గొన్న సీపీ రాజశేఖర్ బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు.



మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు భేష్

- భక్తుల మన్ననలు పొందుతున్న వీఎంసీ అధికారులు, సిబ్బంది

ఆంధ్రజ్యోతి, చిట్టినగర్: పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనలో వీఎంసీ భేష్ అంటూ భక్తులతోపాటు నగర ప్రజల మన్ననలు పొందుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా 3 షిఫ్టుల్లో సుమారు 1400 మంది సిబ్బందితో పనులు నిర్వహించారు. కొండచుట్టూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక మరుగుదొడ్లతోపాటు మంచినీరు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో నిరంతరాయంగా మంచినీటి సరఫరాతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని భక్తులే చెబుతున్నారు. ముఖ్యంగా దుర్గాఘాట్, కృష్ణవేణి, పున్నమి, భవానీఘాట్‌లో పారిశుధ్య, మరుగుదొడ్ల, మంచినీటి, వాడకపు నీటి సమస్యలు లేకుండా అధికారులు పర్యవేక్షించారు. 24 గంటలు అధికారులను అప్రమత్తం చేస్తూ వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఎలాంటి సమస్యలు లేకుండా పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అధికారులను అప్రమత్తం చేస్తూ పరిసరాలను క్లీన్‌గా ఉంచారని కమిషనర్‌కు ప్రశంసలు వస్తున్నాయి. రోజుకు మూడు షిఫ్టుల్లో 120 వాహనాల్లో సుమారు 80 టన్నుల చెత్తను తరలించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్, ముగ్గురు అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లతోపాటు వెటర్నరీ అసిస్టెంట్, బయాలజిస్ట్, 6 శానిటరీ సూపర్‌వైజర్లు, 64 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 74 మంది మేస్త్రీలు పని చేశారు. గతం కంటే ఈ దసరా ఉత్సవాల్లో వీఎంసీ ఏర్పాట్లు బాగున్నాయని భక్తులు మెచ్చుకుంటున్నారు.

3న స్విమ్మింగ్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో నవంబరు 3న సౌత్‌జోన్ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల స్విమ్మింగ్ జిల్లా మీట్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను ఈనెల 29లోగా ఎస్ఎఫ్ఐ యూఐడీతో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా సెక్రటరీ ఐ రమేష్ 7989534719, కృష్ణాజిల్లా సెక్రటరీ వి వినోద్ 9160766070 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



వ్యాపారికి రూ.10 నాణేలను అందజేస్తున్న గొల్లపూడి బ్రాంచ్ మేనేజర్ విజయ, క్యాషియర్ రమ, అధికారి రాజు

రూ.10 నాణేలపై అవగాహన

విజయవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్బీఐ విడుదల చేసిన రూ.10 నాణేలపై వ్యాపారులకు అవగాహన కల్పించాలని యూనియన్ బ్యాంక్ అధికారులు నిర్ణయించారు. అన్ని బ్రాంచ్‌ల్లోను వ్యాపారులకు ఈ నాణేలు అందజేశారు. జిల్లాలోని అన్ని బ్రాంచ్‌ల్లో రిటైర్ కస్టమర్లు, పీఎం స్వానిధి రుణగ్రహీతలు, చిన్న వ్యాపారులు, కిరాణా వ్యాపారులకు సిబ్బంది రూ.10 నాణేలను అందజేశారు.

పల్లెగూటికి పండగొచ్చింది

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకుని రోడ్డు వేసేలా ఆదేశాలు జారీ చేశారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని 43 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, అక్కడి నీటిని ఓ బాటిల్‌లో పట్టి మరీ సమస్యను పవన్ కల్యాణ్‌కు వివరించారు. దీనిపై స్పందించిన పవన్.. గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా శాఖ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అక్కడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ఎదురుమొండి-గొల్లమంద పరిధిలోని లంక గ్రామాలకు అనుసంధాన రహదారులు కావాలని ప్రతిపాదించారు. వాటిని కూడా పూర్తిచేసేందుకు డిప్యూటీ సీఎం ఆదేశాలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ ఎమ్మెల్యేలు చేసింది శూన్యమని, కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు బాధ్యతగా నడుచుకోవడం చూస్తుంటే ముచ్చటగా ఉందన్నారు. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని, తప్పకుండా దాన్ని ప్రధాని నరేంద్రమోదీ వివరిస్తానన్నారు.

సర్పంచులు రోడ్డు పాలయ్యారు : మంత్రి కొల్లు రవీంద్ర

గత ప్రభుత్వ హయాంలో రోడ్లు వేసినవారు రోడ్డు పాలయ్యారని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచులు ఆస్తులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. పల్లెల్లో పండుగ వాతావరణం తెచ్చేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం రూ.12 వేల కోట్ల కేంద్ర నిధులను ఖర్చు చేయకుండా దారి మళ్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్ కల్యాణ్ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం పంచాయతీ కార్యాలయాలకు పార్టీ రంగులు వేసుకోవడం తప్ప గ్రామాల్లో అభివృద్ధి చేసింది లేదన్నారు. గత ప్రభుత్వంలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా పదవులు వెలగబెట్టిన నాయకులు జిల్లాకు ఏమీ చేయకపోగా జిల్లా పరువు తీశారని మండిపడ్డారు.

మహాత్ముడి స్ఫూర్తితో పల్లె పండుగ : బాలశౌరి

గ్రామాలు సామాజికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందితేనే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయనే మహాత్మాగాంధీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని పవన్ కల్యాణ్ పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పవన్ వ్యక్తి కాదు, శక్తి అన్నారు. స్వయంగా ప్రధాని మంత్రి నరేంద్రమోదీనే 'పవన్ కాదు.. తుఫాన్' అని కొనియాడారన్నారు. ఒకేసారి 13,326 గ్రామసభలు నిర్వహించడం ఒక రికార్డు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పల్లెల్లో అభివృద్ధి చూస్తున్నామన్నారు. మచిలీపట్నం రేపల్లె రైల్వే ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజల కల నెరవేరుస్తామన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.4,500 కోట్లతో మొదలవుతున్న పనులు సంక్రాంతికి పూర్తయితే గ్రామాలు స్వర్గసీమలను తలపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్, సర్పంచ్ బాకి రమణ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సిందూరశోభితం

(5వ పేజీ తరువాయి)

క్యూలైన్లు మాత్రం కిటకిటలాడాయి. దర్శన టికెట్ అమ్మకాలను ఇంకా నిలుపుదల చేశారు. ఉచిత, రూ.500, రూ.300, రూ.100 క్యూలతో పాటు వీవీఐపీ, వీఐపీల కోసం ఏర్పాటుచేసిన క్యూల్లోనూ భవానీలనే అనుమతించారు. కర్ణాటక, తమిళనాడు, ఒడిసా రాష్ట్రాల నుంచి భవానీలు భారీగా వచ్చారు. దర్శనానికి గంట సమయం పడుతోంది. ప్రస్తుతం క్యూలన్నీ నియంత్రణలోకి రావడంతో పోలీసులు హోల్డింగ్ పాయింట్లలోకి భక్తులను పంపడం ఆపేశారు. వచ్చిన భక్తులను వచ్చినట్టుగా క్యూలైన్లలోకి పంపుతున్నారు. అధికారులు మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈవో రామారావు ఎప్పటికప్పుడు రద్దీని పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, ఆదివారం సుమారు లక్షా 25వేల మంది, సోమవారం రాత్రి 7 గంటల వరకు 70 వేల మంది భవానీలు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కొంపముంచేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

ఈ పథకంతో ఇల్లు కట్టుకున్నాక ఇప్పుడు ఈ అనర్హతలేవిటంటూ లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ పథకం ద్వారా వచ్చిన డబ్బు ఇంటికి ఖర్చు చేశామని, తిరిగి ఇవ్వమంటే ఎక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. పీఎంఏవై కింద కేంద్రం ఇచ్చిన రూ.1.50 లక్షలు కొంతమేర సాయపడినా, పూర్తి ఇంటి ఖర్చుకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చయిందని, ఆ మొత్తాన్ని అప్పు చేసుకున్నామని చెబుతున్నారు. ఇల్లు నిర్మించుకుని మూడేళ్లవుతున్నా ఇంకా పూర్తి సాయం అందలేదని, చాలామందికి రూ.30 వేల డబ్బు చెల్లించాల్సి ఉందంటున్నారు. కాగా, ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నవారికి ఇంకా రూ.70 వేలు, ఆపైన చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బును తక్షణం చెల్లించటం ద్వారా లబ్ధిదారులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఆ పని చేయకుండా రీ వెరిఫికేషన్ పేరుతో ఇలా ఇబ్బంది పెట్టడం దారుణమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా తప్పించుకునేందుకే ఇలా చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు చేసిన తప్పును సరిదిద్దాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బందోబస్తు పోలీసులకు సత్కారం



డీఎస్పీ సత్యానందానికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో బందోబస్తు విధులు నిర్వర్తించిన పోలీసు అధికారులను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సత్కరించారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం వారికి సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధికారులకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేసి సత్కరించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా విధులు నిర్వర్తించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ గౌతమీ షాలి, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

16, 17న దుర్గగుడి హుండీల లెక్కింపు

వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరిగిన దసరా ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 16, 17న లెక్కించనున్నట్టు దేవస్థానం ఈవో కేఎస్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహామండపం 6వ అంతస్తులో ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు.

సిండికేట్ల కిక్కు

(5వ పేజీ తరువాయి)

సిండికేట్లే దక్కించుకున్నారు. లాటరీ తీసిన హాళ్ల ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను తలపించాయి. దరఖాస్తుదారుల చేతుల్లో షాపులకు దరఖాస్తులు చేసిన వారి పేర్లతో జాబితాలు కనిపించాయి. ఏ నెంబరు ఎవరికి దక్కిందన్న ప్రకటన వెలువడగానే ఆ పేర్లను మార్క్ చేసుకున్నారు. సిండికేట్‌లో సభ్యులకు షాపు దక్కగానే హాల్లో అరుపులు, కేకలు వేశారు. సిండికేట్లకు షాపులు దక్కినప్పటికీ ఆశ మాత్రం చావలేదు. ఒకటి, రెండు షాపులు దక్కించుకున్న వారి వద్దకు వెళ్లి వాటినిక కూడా తమకు అమ్మాలని బేరాలు పెట్టారు. హాళ్లలోనే షాపుల కోసం బేరాలు జరిగాయి.

రూరల్‌లో 'తెలంగాణం'

రూరల్ ప్రాంతాల్లో షాపులు ఎక్కువగా తెలంగాణ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయి. ఇప్పటికే తెలంగాణలోని నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, మధిర ప్రాంతాల్లో మద్యం షాపులు నిర్వహిస్తున్న వారు తాజాగా జిల్లాకు సంబంధించిన షాపులకు దరఖాస్తులు చేసుకున్నారు. సరిహద్దు గ్రామాలను అనుకుని ఉన్న మండలాల్లో ఉన్న షాపులను తెలంగాణ వ్యాపారులు దక్కించుకున్నారు. ఒక్కో వ్యాపారి 10-15 దరఖాస్తులు దాఖలు చేశారు. జగ్గయ్యపేట, నందిగామ, వత్సవాయి, వీరులపాడు, తిరువూరు, రెడ్డిగూడెం, గంపలగూడెం ప్రాంతాల్లో షాపులను తెలంగాణ మద్యం వ్యాపారులు లాటరీలో దక్కించుకున్నారు.



ఆగు జర!

రపామైసిన్ ఔషధంతో వృద్ధాప్యానికి అడ్డుకట్ట?

ఈ మందుతో.. పెరిగిన ఎలుకల జీవితకాలం
చిరాయువుగా జీవించేందుకు అమెరికా కుబేరుడు బ్రయాన్ జాన్సన్ వాడుతున్న కీలక ఔషధం ఇదే!
దీని వాడకంతో పలు దుష్ప్రభావాలూ ఉంటాయని, మరిన్ని ప్రయోగాలు జరగాలని అంటున్న వైద్యులు

ఎక్కువ కాలం బతకాలని ఎవరికుండదు చెప్పండి! దానికి రెండే మార్గాలు. ఒకటి.. పురాణాల్లో పాత్రల్లాగా ఏదైనా వరం పొందడం!! రెండోది.. శాస్త్రీయంగా ఔషధాలు, చికిత్సలు, వ్యాయామం వంటివాటితో.. వయసు మందగించే ప్రక్రియకు, వృద్ధాప్యానికి (జర) వీలైనంతవరకూ అడ్డుకట్ట వేయడం. మొదటిది ఎలాగూ అసాధ్యం కాబట్టి.. ప్రపంచ కుబేరుల్లో చాలా మంది రెండో మార్గంలో వయసు తగ్గించుకునే ప్రయత్నాల్లో మునిగిపోయారు. ఈ క్రమంలో.. చాలా మంది వైద్యనిపుణుల దృష్టిని ఆకర్షిస్తున్నది, దీర్ఘాయుష్షు దిశగా జరుపుతున్న ప్రయోగాల్లో ప్రధానంగా పరీక్షిస్తున్నది.. రపామైసిన్ అనే ఔషధమే. జీవితాన్ని పొడిగించే 'మ్యాజిక్ పిల్'గా వైద్యనిపుణులు దీన్ని అభివర్ణిస్తున్నారు. అమెరికాకు చెందిన ఔత్సాహిక టెక్ పారిశ్రామికవేత్త బ్రయాన్ జాన్సన్ (47) తన వయసును తగ్గించుకునే ప్రయోగాల్లో భాగంగా ఏడాదికి రూ.16 కోట్లు ఖర్చుచేస్తున్నట్టు ఇటీవలికాలంలో వార్తలు వచ్చాయి గుర్తుందా? ఆయన వాడుతున్న మందుల్లో కీలకమైనది ఇదే. నిత్యం తాను రపామైసిన్ తీసుకుంటున్నట్టు ఆయన ఒకసారి ట్వీట్ చేశాడు. 2009లో 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ ఏజింగ్ ఇంటర్వెన్షన్స్ టెస్టింగ్ ప్రోగ్రామ్' ఎలుకలపై జరిపిన ఒక అధ్యయనంలో.. రపామైసిన్ వల్ల వాటి జీవితకాలం 25 శాతం మేర పెరిగినట్టు తేలింది. ఆ అధ్యయనం తర్వాతే ప్రపంచం దృష్టి, యాంటీ ఏజింగ్ పరిశోధనలు చేస్తున్న వైద్యనిపుణుల దృష్టి రపామైసిన్‌పై పడింది. ఈ నేపథ్యంలోనే బ్రయాన్ వైద్యులు ఆయనకు ఈ చికిత్సను సిఫారసు చేశారు.

ఏమిటీ రపామైసిన్?


రపామైసిన్‌ను వైద్యులు 'ఇమ్యూనో సప్రెసెంట్' ఔషధంగా వాడుతారు. అవయవమార్పిడి శస్త్రచికిత్స చేసినప్పుడు గ్రహీత శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ.. కొత్తగా వచ్చిన దాత అవయవాన్ని పారిన్ బాడీగా భావించి దానిపై దాడి చేస్తుంది. అలా దాడి చేయకుండా రోగనిరోధకవ్యవస్థను నియంత్రించే మందులను 'ఇమ్యూనో సప్రెసెంట్స్' అంటారు. అలాగే.. యాంటీ క్యాన్సర్ చికిత్సల్లో కూడా ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. చిలీలోని ఈస్టర్ ఐలండ్‌లో కనిపించే ఒక బ్యాక్టీరియమ్ నుంచి దీన్ని తయారుచేశారు. ఈస్టర్ ఐలండ్‌ను స్థానికులు 'రపా నుయి'గా వ్యవహరిస్తారు కాబట్టి దీనికి రపామైసిన్ అని పేరుపెట్టారు. ఇది మన శరీరంలోని ఎంటీఓఆర్ అనే ప్రొటీన్‌ను నిరోధించడం ద్వారా పనిచేస్తుంది. ఆ ఎంటీఓఆర్ ప్రొటీన్.. కణాల పెరుగుదల, వ్యాప్తి, మనుగడను నియంత్రించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ లక్షణం వల్లనే.. రపామైసిన్ 'యాంటీ ఏజింగ్' ఔషధంగా పేరొందుతోంది. లాన్సెట్ జర్నల్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రచురితమైన ఒక అధ్యయన నివేదిక ప్రకారం.. వయసు పెరగడం వల్ల వచ్చే మార్పులపై రపామైసిన్ ప్రభావం ఉంటుందని, అది వాటిని నియంత్రిస్తోందని తేలింది. ఈ అధ్యయనంలో పరిశోధకులు 18,400 వ్యాసాలను విశ్లేషించి.. రపామైసిన్ ప్రభావం ఎండోక్రైన్, కండర, నాడీ వ్యవస్థలపై ఉండట్లేదని, దానివల్ల రోగనిరోధక, హృదయ సంబంధిత, చర్మ సంబంధిత ఆరోగ్యం మెరుగవుతోందని పేర్కొన్నారు. - సెంట్రల్ డెస్క్

అమెరికా జన్యు శాస్త్రవేత్త డేవిడ్ సింక్లెయిర్ ప్రకారం.. వృద్ధాప్యం అంటే టెలోమియర్లు కుచించుకుపోయే వ్యాధి. టెలోమియర్లంటే.. కణాలకు సంబంధించిన జన్యు సమాచారాన్ని భద్రపరచుకునే భాండాగారాలు. క్రోమోజోముల చివర్లలో ఉండే ఈ టెలోమియర్ల పొడుగు.. మన వయసు పెరిగే కొద్దీ తగ్గిపోతూ ఉంటుంది. మనం పుట్టినప్పుడు 11 కిలోబేస్‌ల పొడుగు ఉండే టెలోమియర్లు క్రమంగా కుచించుకుపోతూ.. 4 కిలోబేస్‌లకు తగ్గిపోతాయి. టెలోమియర్లు కుచించుకుపోకుండా ఆపగలిగితే వృద్ధాప్యానికి చెక్ పెట్టినట్టే. కొన్నిరకాల మందులు, ఇంజెక్షన్ల ద్వారా వాటి పొడుగు తగ్గకుండా ఆపొచ్చు. కానీ, దానివల్ల అపరిమిత కణవిభజన జరిగి క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఎక్కువ.

టెలోమియర్లతో లింకుందా?

అందుకే ప్రపంచవ్యాప్తంగా చాలా మంది శాస్త్రజ్ఞులు క్యాన్సర్ ముప్పు లేకుండా వృద్ధాప్యాన్ని ఆపే ప్రయోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. టెలోమియర్ల పొడుగుకు, రపామైసిన్‌కు ఉన్న సంబంధాలపైన కూడా కొన్ని అధ్యయనాలు, ప్రయోగాలు జరిగాయి. వాటిలో స్పానిష్ శాస్త్రవేత్తలు చేసిన ఒక ప్రయోగంలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. రకరకాల కారణాలవల్ల టెలోమియర్ల పొడుగు తక్కువగా ఉన్న, డీఎన్ఏ సమస్యలున్న ఎలుకల జీవితకాలాన్ని రపామైసిన్ పొడిగించలేకపోగా, వాటి శరీరంలోని టెలోమియర్ల పొడుగును మరింత తగ్గించిందని.. ఆరోగ్యవంతమైన సాధారణ ఎలుకల జీవితకాలాన్ని మాత్రం ఈ ఔషధం పెంచగలిగిందని వారి ప్రయోగంలో తేలింది. అంటే.. టెలోమియర్లకు, రపామైసిన్‌కు ఏదో సంబంధం ఉన్నట్టే. అదేంటో పక్కాగా తెలుసుకునేందుకు పలువురు శాస్త్రజ్ఞులు కృషి చేస్తున్నారు.

సురక్షితమేనా?



ఇమ్యూనో సప్రెసెంట్ అయిన రపామైసిన్‌ను బ్రయాన్ జాన్సన్‌లాగా.. చిరాయువు కోసం, వృద్ధాప్యాన్ని ఆలస్యం చేయడానికి ఎక్కువకాలంపాటు తీసుకోవడం మంచిదేనా? అది ఎంతవరకూ సురక్షితం? అంటే.. దీనికి సంబంధించి ఇప్పటి దాకా ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో చెప్పుకోదగ్గ ఫలితాలే కనిపించాయి. మానవులపై కొన్ని ప్రయోగాలు జరిగినప్పటికీ.. అవి పరిమితమైన ప్రయోగాలే. మరింత విస్తృత స్థాయిలో, వైద్యపర్యవేక్షణలో మరిన్ని ట్రయల్స్ జరగాల్సి ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. రపామైసిన్ వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉంటాయని హెచ్చరిస్తున్నారు.

రపామైసిన్ ఇమ్యూనో సప్రెసెంట్ కాబట్టి.. దీన్ని తీసుకునే వారు తరచుగా ఇన్ఫెక్షన్ల బారిన పడే ముప్పు ఎక్కువ అవుతుంది.

నోటిలో పుండ్ల వంటి సమస్యలూ వచ్చే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయులు పెరిగి మధుమేహం బారిన పడే ముప్పుంది. గుండెకు హాని కలిగించే కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల స్థాయులు పెరిగే ప్రమాదం ఉంది.

గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యలు పెరుగుతాయి. కడుపునొప్పి, విరేచనాల వంటి దుష్ప్రభావాలు కలుగుతాయి.

రపామైసిన్ వల్ల రోగ నిరోధక వ్యవస్థ సరిగ్గా పనిచేయదు కాబట్టి.. ఏవైనా దెబ్బలు తగిలితే అవి త్వరగా తగ్గవు. రక్తకణాలు, ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గే ప్రమాదం ఉంది.

..కాబట్టి, రపామైసిన్ వినియోగం మానవులకు ఎంతవరకూ సురక్షితమో విస్తృత ప్రయోగాల్లో తేలేదాకా దాని జోలికి వెళ్లకపోవడమే మంచిదని, డాక్టర్లను సంప్రదించకుండా తీసుకుంటే ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.



నష్టాల ఊబి నుంచి లాభాల్లోకి వ్యాపారాలు

కలిసొచ్చే కాలానికి.. అందొచ్చిన కొడుకులు!

తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని నిలబెట్టిన అనిల్ అంబానీ కుమారులు అన్‌మోల్, అన్షుల్

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకని సామెత! అపర కుబేరుడు ధీరూభాయ్ అంబానీ రెండో కుమారుడు.. అనిల్ అంబానీకి ఒకరు కాదు.. ఇద్దరు కొడుకులు.. జై అన్‌మోల్, జై అన్షుల్ అచ్చం అలాగే అవసరానికి కలిసొచ్చారు. నష్టాల్లో, అప్పుల్లో కూరుకుపోయిన రిలయన్స్ పవర్‌ను రూ.20,526 కోట్ల కంపెనీగా నిలబెట్టారు. కన్న తండ్రిని సగర్వంగా తలెత్తుకునేలా చేశారు. ఆస్తుల పంపకం అనంతరం అన్న ముకేశ్ అందనంత ఎత్తుకు ఎదిగిపోతే.. నష్టాలపాలై, దివాలా తీసిన అనిల్ అంబానీ.. ఇప్పుడు పుత్రోత్సాహాన్ని అనుభవిస్తున్నారు. తండ్రి నుంచి తన వాటాగా వచ్చిన రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కొడుకులు తమ సామర్థ్యంతో మళ్లీ నిలబెట్టడంతో మురిసిపోతున్నారు. ఇటీవలే ఆయన రిలయన్స్ పవర్ షేర్లు 5 శాతం మేర పెరిగి.. 52 వారాల గరిష్ఠానికి చేరాయి. రిలయన్స్ పవర్ డెట్‌ఫ్రీ కంపెనీగా మారగా.. రిలయన్స్ ఇన్‌ఫ్రా అప్పులు 87 శాతం తగ్గిపోయాయి. రిలయన్స్ పవర్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,052.67 కోట్లు దాటింది. మరీ ముఖ్యంగా రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్‌కు కొత్త శక్తిని నింపడంలో జై అన్‌మోల్ కీలక పాత్ర పోషించారు. ఈ ఉత్సాహంతో అనిల్ అంబానీ.. భూటాన్‌లో పలు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు చేపట్టారు. డ్రక్ హోల్డింగ్ సంస్థతో కలిసి అనిల్ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ 1270 మెగావాట్ల సోలార్, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులను ప్రకటించింది. ఇంధన రంగంలో తన వ్యాపారాన్ని, పెట్టుబడులను విస్తరించడానికి రిలయన్స్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఒక కొత్త సంస్థనే ప్రారంభించారు. కాగా.. అన్నదమ్ములిద్దరిలో అన్‌మోల్ అంబానీ 2014లో రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ పగ్గాలు చేపట్టారు. 2017 నాటికి రిలయన్స్ క్యాపిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయ్యారు. అన్‌మోల్ నేతృత్వంలో.. రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్, రిలయన్స్ క్యాపిటల్ అసెట్ మేనేజ్‌మెంట్ వంటి సంస్థలు లాభాలబాట పట్టాయి. ఫలితంగా అతడి నికర విలువ రూ.20 వేల కోట్లు దాటింది. ఇతడికి ముంబైలో రూ.5 వేల కోట్ల విలువ చేసే 17 అంతస్తుల టవర్ (దాని పేరు 'ఏబోడ్') ఉంది. రోల్స్‌రాయిస్, లాంబోర్గిని తదితర హైఎండ్ కార్ల కలెక్షన్, సొంత విమానం కూడా ఉన్నాయి. ఇక.. న్యూయార్క్ వర్సిటీలోని ప్రఖ్యాత స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి బాచిలర్స్ డిగ్రీ పుచ్చుకున్న అనిల్ చిన్న కుమారుడు అన్షుల్ కూడా వ్యాపార రంగంలో సత్తా చాటుతున్నారు. అయితే, దానికన్నా అతడి విలాసవంతమైన జీవనశైలే ఎక్కువగా ప్రచారంలో ఉంది. అన్షుల్ కార్ల కలెక్షన్‌లో.. మెర్సిడెస్ జీఎల్‌కే 350, లాంబోర్గిని గల్లార్డో, రోల్స్ రాయిస్ ఫాంటమ్, రేంజ్ రోవర్ వోగ్ తదితరాలున్నాయి. బొంబార్డియర్ గ్లోబల్ ఎక్స్‌ప్రెస్ ఎక్స్‌ఆర్ఎస్, ఫాల్కన్ 2000, ఫాల్కన్ 7ఎక్స్ విమానాలు, బెల్ 412 హెలికాప్టర్ ఉన్నాయి.

నవ్య | చిత్రజ్యోతి



నాగబంధం చుట్టూ తిరిగే కథ

'డెవిల్ ద బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' సినిమాతో దర్శకుడిగానూ తన ప్రతిభను చాటుకున్న నిర్మాత అభిషేక్ నామా రూపొందిస్తున్న రెండో సినిమా 'నాగబంధం.. ద సీక్రెట్ ట్రెజర్'. 'పెదకాపు' చిత్రంతో హీరోగా పరిచయమైన విరాట్ కర్ణ ఇందులో హీరోగా నటిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లు. సోమవారం క్లాప్ కొట్టి ఈ చిత్రాన్ని ప్రారంభించారు మెగాస్టార్ చిరంజీవి. ఈ సందర్భంగా దర్శకుడు అభిషేక్ నామా మాట్లాడుతూ 'భారతదేశంలోని 108 విష్ణు ఆలయాలు నాగబంధం ద్వారా రక్షింపబడుతున్నాయి. ఆ నాగబంధం చుట్టూ తిరిగే కథ ఇది. భక్తి, అడ్వెంచర్ ఎలిమెంట్స్ ఉంటాయి. స్పెషల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది' అని చెప్పారు. నిర్మాత కిశోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ 'హై బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఈ నెల 23 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. 2025లో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం' అని చెప్పారు.

కోహినూర్ వజ్రం కోసం...



'క్షణం' ఫేమ్ రవికాంత్ పేరేపు దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ ఓ చిత్రంలో నటిస్తున్నారు. సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ సంస్థతో ఇప్పటికే 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలలో నటించారాయన. తాజాగా, ఈ సినిమాకు 'కోహినూర్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "కోహినూర్ వజ్రాన్ని తిరిగి భారత్‌కు తీసుకురావడమే కథాంశంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాను 2026లో విడుదల చేయనున్నాం. ఈ చిత్రం ఘనవిజయం సాధించి.. సిద్ధుకూ, మాకు హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తుంది" అని అన్నారు. కాగా, రవికాంత్ పేరేపు దర్శకత్వంలో ఇంతకుముందు 'కృష్ణ అండ్ హిజ్ లీల' చిత్రంలో నటించారు సిద్ధు జొన్నలగడ్డ.

బ్లాక్‌బస్టర్ పక్కా




ఎనర్జిటిక్ మ్యూజిక్‌తో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్. ఆయన ఈ నెల 19న గచ్చిబౌలిలో ఓ మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ ప్రెస్ మీట్ ఆయన సంగీతం అందిస్తున్న 'పుష్ప-2' సినిమా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "పుష్ప-2' సినిమా ఫస్టాఫ్ వినగానే నేనూ, చంద్రబోస్ చప్పట్లు కొట్టాం. ఈ సినిమాను సుకుమార్ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవ్వడం పక్కా" అని చెప్పారు. అలాగే, మ్యూజికల్ కన్సర్ట్ గురించి మాట్లాడుతూ "మన దేశంలో ఇలాంటి మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించాలని ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికి కుదిరింది. ఈ కార్యక్రమం కచ్చితంగా మీ అందరికీ మరిచిపోలేని అనుభూతిని ఇస్తుంది" అని అన్నారు.

క్రూరమైన పాత్రలో...



యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పొట్టేల్'. ఈ రూరల్ యాక్షన్ డ్రామాను నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మిస్తున్నారు. ఇందులో నటుడు అజయ్ 'పటేల్' అనే ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఇందులో ఆయన పాత్ర ఎంత క్రూరంగా ఉంటుందో ఓ పోస్టర్‌ను విడుదల చేసి హింటిచ్చారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోంది.

స్టైలిష్ లుక్‌లో ...



రామ్ పోతినేని, 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ మహేశ్‌బాబు పచ్చిగొల్ల దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. వర్కింగ్ టైటిల్ 'రాపో22'. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఇందులో రామ్ విభిన్న పాత్రలో.. స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారు. ఆయన కెరీర్‌లోనే ఓ ప్రత్యేక మైలురాయిగా నిలిచిపోయే చిత్రవిది" అని అన్నారు.

మట్కా కోసం మరోసారి



ఎన్టీఆర్ నటించిన 'టెంపర్' సినిమాలో 'ఇట్టాగే రెచ్చిపోదాం' అనే పాటలో స్టెప్పులతో రెచ్చిపోయే.. ప్రభాస్ నటించిన 'బాహుబలి' సినిమాలో 'మనోహరి' పాటలో తన వయ్యారాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు ఐటెం సాంగ్స్ స్పెషలిస్ట్ నోరా ఫతేహి. తెలుగులో లాంగ్ గ్యాప్ తర్వాత ఆమె, వరుణ్‌తేజ్ నటిస్తున్న 'మట్కా' సినిమాలో సోఫియాగా ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలోని 'లేలే రాజా' అనే రెట్రో సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటలో వరుణ్‌తేజ్‌ను ఆకట్టుకోవడానికి ఓ బార్‌లో ఆమె వేసిన స్టెప్పులు అలరించేలా ఉన్నాయి. భాస్కరభట్ల పాటను రచించగా, నీతి మోహన్ ఆలపించారు. జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. కరుణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం నవంబరు 14న విడుదలవుతోంది.

హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ. 4,235 కోట్లు

ఒక్కో షేరుకు రూ. 12 డివిడెండ్



న్యూఢిల్లీ: దేశంలో మూడో అతి పెద్ద ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25), సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో కంపెనీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10.51 శాతం వృద్ధితో రూ.4,235 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి సంస్థ లాభం రూ.3,832 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ2లో హెచ్‌సీఎల్ టెక్ రూ.28,862 కోట్ల ఆదాయాన్ని గడించింది. 2023-24 క్యూ2లో నమోదైన రూ.26,672 కోట్ల రెవెన్యూతో పోలిస్తే 8.21 శాతం వృద్ధి కనబరిచింది. ఈ జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)తో పోలిస్తే మాత్రం కంపెనీ నికర లాభం 0.5 శాతం తగ్గగా.. ఆదాయంలో కేవలం 3 శాతం వృద్ధి నమోదైంది. డేటా అండ్ ఏఐ, డిజిటల్ ఇంజనీరింగ్, శాప్ మైగ్రేషన్ అండ్ ఎఫిషియెన్సీ ఆధారిత ప్రోగామ్‌లు సహా కంపెనీ చేతిలో ఆర్డర్లు సమృద్ధిగా ఉన్నాయని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సీ విజయ్ కుమార్ అన్నారు. కాగా, ఈ సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ మంచి ఆదాయ వృద్ధిని నమోదు చేయడంతో పాటు లాభదాయకతనూ మెరుగుపరుచుకుందని కంపెనీ సీఎఫ్ఓ శివ్ వాలియా అన్నారు.

మరిన్ని ముఖ్యాంశాలు..

- 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను హెచ్‌సీఎల్ టెక్ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.
- పూర్తి ఆర్థిక సంవత్సరానికి స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.5-5 శాతం మేర వృద్ధి చెందవచ్చని, ఎబిటా మార్జిన్ 18-19 శాతంగా ఉండవచ్చని హెచ్‌సీఎల్ టెక్ అంచనా వేసింది.
- గడిచిన త్రైమాసికంలో సంస్థ 221 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. అంతక్రితం త్రైమాసికంలో లభించిన 196 కోట్ల డాలర్ల డీల్స్‌తో పోలిస్తే విలువ మరింత పెరిగింది.
- ఈ జూలై-సెప్టెంబరులో కంపెనీ 2,932 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకుంది. అయినప్పటికీ, గత మూడు నెలల్లో ఉద్యోగుల సంఖ్య నికరంగా 780 తగ్గి మొత్తం 2,18,621 కి పరిమితమైంది. అయితే, ఉద్యోగుల వలసల రేటు మాత్రం 12.9 శాతానికి తగ్గింది. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 4,000 మంది ఫ్రెషర్స్‌ను చేర్చుకున్నట్లు తెలిపింది.
- బీఎస్ఈలో కంపెనీ షేరు 0.89 శాతం లాభంతో రూ.1,856 దగ్గర ముగిసింది.

సెప్టెంబరులో ధరల మంట

- 9 నెలల గరిష్ఠ స్థాయిలో రిటైల్ ద్రవ్యోల్బణం
- 5.49 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: దేశంలో ధరల సెగ మరింత ఊపందుకుంది. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కించే రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబరు నెలలో తొమ్మిది నెలల గరిష్ఠ స్థాయి 5.49 శాతానికి చేరింది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) సోమవారం ఈ వివరాలు విడుదల చేసింది. ఈ ఏడాది ఆగస్టుతో పోల్చితే సెప్టెంబరు రిటైల్ ద్రవ్యోల్బణం 1.84 శాతం పెరిగింది. గత ఏడాది సెప్టెంబరుతో పోల్చితే మాత్రం 0.47 శాతం ఎక్కువ. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని రెండు శాతం అటుఇటుగా నాలుగు శాతం వద్ద కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి లక్ష్యంగా నిర్దేశించింది. మరోవైపు టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారంగా లెక్కించే ద్రవ్యోల్బణం కూడా సెప్టెంబరులో అంతకు ముందు నెలతో పోలిస్తే 1.31 శాతం నుంచి 1.84 శాతానికి పెరిగింది.

రెపో తగ్గింపు ఆశలు గల్లంతు!

సెప్టెంబరు నెల రిటైల్ ద్రవ్యోల్బణం పెరగటానికి ఆహారోత్పత్తుల ధరల పెరుగుదలే ప్రధాన కారణం. ఆగస్టులో 5.66 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 9.24 శాతానికి ఎగబాకింది. కూరగాయల ధరలు చుక్కలంటడం ఆహార ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణమని ఎన్ఎస్ఓ తెలిపింది. ఈ మంట ఇదే విధంగా కొనసాగితే అక్టోబరులోనూ రిటైల్ ద్రవ్యోల్బణం 5.5 శాతంపైనే నమోదయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే డిసెంబరులో జరిగే ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్షలోనూ ఆర్‌బీఐ కీలక రెపో రేటు తగ్గింపునకు సాహసించక పోవచ్చని భావిస్తున్నారు.

రిలయన్స్ లాభం 5% డౌన్



సెప్టెంబరు త్రైమాసిక లాభం రూ.16,563 కోట్లు

ఓ2సీ విభాగం డీలా.. జియో, రిటైల్ నిలకడగా..

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) లాభాలకు గండిపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) కంపెనీ నికర లాభం రూ.16,563 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.24.48) పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదైన రూ.17,394 కోట్ల (ఒక్కో షేరుకు రూ.25.71) లాభంతో పోలిస్తే 5 శాతం తగ్గింది. ఆయిల్ రిఫైనింగ్ అండ్ పెట్రోకెమికల్స్ (ఓ2సీ) వ్యాపారం బలహీనపడటమే ఇందుకు ప్రధాన కారణం. ఈ క్యూ2లో ఓ2సీ ఆదాయం 5.1 శాతం వృద్ధితో రూ.1.55 లక్షల కోట్లకు పెరిగినప్పటికీ, ఎబిటా మాత్రం 23.7 శాతం క్షీణించి రూ.12,413 కోట్లకు పడిపోయింది. ఈ విభాగ పేలవ పనితీరు కారణంగా రిలయన్స్ లాభాలు తగ్గడం వరుసగా ఇది మూడోసారి. కాగా, ఈ క్యూ2లో ఆర్ఐఎల్ మొత్తం ఆదాయం రూ.2.40 లక్షల కోట్లుగా నమోదైంది. 2023-24లో ఇదే కాలానికి గడించిన రూ.2.38 లక్షల కోట్ల రెవెన్యూతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.

రిటైల్ రెవెన్యూ రూ.66,502 కోట్లు

గడిచిన త్రైమాసికంలో ఆర్ఐఎల్ చిల్లర వర్తక విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) నిర్వహణ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.5 శాతం తగ్గి రూ.66,502 కోట్లకు పడిపోయింది. నికర లాభం కేవలం 1.28 శాతం పెరిగి రూ.2,836 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలానికి రిలయన్స్ రిటైల్ రూ.68,937 కోట్ల ఆదాయంపై రూ.2,800 లాభాన్ని ఆర్జించింది. ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ విభాగంలో గిరాకీ బలహీనపడటంతోపాటు రిటైల్ వ్యాపారాల క్రమబద్ధీకరణ, బీ2బీ వ్యాపార మార్జిన్ల పెంపుపై దృష్టిసారించడం రిటైల్ వ్యాపార వృద్ధిపై ప్రభావం చూపిందని ఆర్ఐఎల్ పేర్కొంది. గడిచిన మూడు నెలల్లో ఆర్ఆర్‌వీఎల్ కొత్తగా 464 స్టోర్లను ప్రారంభించింది.

నికర అప్పు రూ.1.16 లక్షల కోట్లు

సెప్టెంబరు 30 నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్ మొత్తం రుణం రూ.3.36 లక్షల కోట్లకు పెరిగింది. కంపెనీ వద్దనున్న రూ.2.20 లక్షల కోట్ల నగదు నిల్వలను మినహాయిస్తే, నికర అప్పు రూ.1.16 లక్షల కోట్లుగా నమోదైంది.

జియో లాభంలో 23.4 % వృద్ధి

ఈ సెప్టెంబరుతో ముగిసిన క్వార్టర్‌లో ఆర్ఐఎల్ టెలికాం, డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 23.4 శాతం వృద్ధి చెంది రూ.6,539 కోట్లకు పెరిగింది. వ్యాపార కార్యకలాపాల ద్వారా సమకూరిన ఆదాయం 18 శాతం పెరుగుదలతో రూ.31,709 కోట్లకు చేరుకుంది. స్థూల ఆదాయం 17.7 శాతం వృద్ధితో రూ.37,119 కోట్లుగా నమోదైంది. రిలయన్స్ జియో ఒక్కో వినియోగదారు నుంచి లభించిన సగటు ఆదాయం (ఆర్పు) రూ.195.1కి పెరిగింది. టారిఫ్‌ల పెంపుతో పాటు వినియోగదారులు మరింత పెరగడం ఇందుకు దోహదపడింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ఆర్పు రూ.181.7గా ఉంది. టారిఫ్‌ల పెంపు ద్వారా పూర్తి స్థాయి లబ్ధి వచ్చే 2-3 త్రైమాసికాల్లో కన్పించవచ్చని కంపెనీ పేర్కొంది. గత క్వార్టర్‌లో రిలయన్స్ జియో కస్టమర్ల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 4.2 శాతం పెరిగి 47.88 కోట్లకు చేరుకుంది.

ఆయిల్, గ్యాస్ ఆదాయం రూ.6,222 కోట్లు

ఆయిల్ అండ్ గ్యాస్ ఉత్పత్తి, అన్వేషణ విభాగ వ్యాపార ఆదాయం ఈ క్యూ2లో 6 శాతం తగ్గి రూ.6,222 కోట్లకు పరిమితమైంది. ఎబిటా మాత్రం 11 శాతం వృద్ధితో రూ.5,290 కోట్లుగా నమోదైంది. గత త్రైమాసికంలో ఏపీలోని కేజీ డీ6 బేసిన్ నుంచి రోజుకు సగటున 28.5 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను, 20,832 బ్యారెళ్ల ఆయిల్‌ను ఉత్పత్తి చేసినట్లు కంపెనీ వెల్లడించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,620 ▲	71,150 ▲	1,03,000 ▲
ముంబై	76,001 ▲	69,617 ▲	90,026 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	



ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	126	విజయవాడ	135
వరంగల్	126	గుంటూరు	135
కరీంనగర్	126	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	126	చిత్తూరు	135
కర్నూలు	126	నెల్లూరు	135
విశాఖపట్నం	125	అనంతపురం	135
గోదావరి	135		

దక్షిణాదిలో ముగిసిన పొగాకు కొనుగోళ్లు

రూ.4,087 కోట్ల విలువైన పంట విక్రయం

ఒంగోలు (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో ఈ సీజన్ పొగాకు కొనుగోళ్ల సోమవారంతో ముగిశాయి. ఒంగోలు కేంద్రంగా ఉన్న రెండు రీజియన్ల పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 2023-24 సంవత్సరానికి 57,767.39 హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగుకు, 8.89 కోట్ల కిలోల ఉత్పత్తికి భారత పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే అనుమతికి మించి సుమారు 72,345 హెక్టార్లలో రైతులు పంట సాగు చేశారు. 14.5 కోట్ల కిలోల పంట ఉత్పత్తి అంచనాతో ఈ ఏడాది ఫిబ్రవరి 29న కొనుగోళ్లను పొగాకు బోర్డు ప్రారంభించింది. మొత్తం ప్రక్రియ సోమవారంతో ముగిసింది. 15.35 కోట్ల కిలోల అమ్మకాలు జరిగాయి. సగటున కిలోకు రూ.266.14 ధర లభించింది. అంటే దక్షిణాదిలో ఈ సీజన్‌లో మొత్తం రూ.4,087.37 కోట్ల విలువైన పంట అమ్మకం జరిగింది. పొగాకు బోర్డు చరిత్రలో దక్షిణాది మార్కెట్లో ఇంత అధికంగా ధర లభించడం ఇదే ప్రథమం.

- ఎస్‌బీఐ కార్డ్.. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి 'క్రిస్‌ఫ్లైయర్ ఎస్‌బీఐ కార్డ్'ను తీసుకువచ్చింది. ఇది సూపర్ ప్రీమియం కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు. క్రిస్‌ఫ్లైయర్ ఎస్‌బీఐ కార్డ్, క్రిస్‌ఫ్లైయర్ ఎస్‌బీఐ కార్డ్ అపెక్స్ పేరుతో ఈ కార్డులు అందుబాటులో ఉంటాయి.
- రూలోన్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అఫర్డబుల్ హౌసింగ్ విభాగంపై ప్రధానంగా దృష్టి పెట్టడం ద్వారా ఈ లక్ష్యాన్ని అందుకోవచ్చని భావిస్తోంది. ఇందులో భాగంగానే విజయవాడకు రూలోన్స్ కార్యకలాపాలను విస్తరించింది.
- సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏజీ అండ్ పీ ప్రథమ్.. తడ, శ్రీసిటీకి తన సీఎన్‌జీ సేవలను విస్తరించింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో కంపెనీ డాటర్ బూస్టర్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది.
- దీపావళిని పురస్కరించుకుని భారత్ నుంచి పంపించే అంతర్జాతీయ షిప్‌మెంట్స్ ధరలను 50 శాతం వరకు తగ్గిస్తున్నట్లు డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించింది. అలాగే దేశీయంగా పంపించే షిప్‌మెంట్స్‌పై కూడా 40 శాతం వరకు డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తున్నట్లు వెల్లడించింది. నవంబరు 2 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది.

మళ్లీ 25,000 ఎగువకు నిఫ్టీ

- సెన్సెక్స్ 592 పాయింట్లు అప్
- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం మెరుగైన లాభాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ 591.69 పాయింట్లు బలపడి 81,973.05 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 163.70 పాయింట్లు పెరిగి 25,127.95 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ రూ.1.35 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.463.62 లక్షల కోట్లకు చేరుకుంది.

- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు పెరిగి రూ.84.06 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర ఒక దశలో 2.52 శాతం తగ్గి 77.05 డాలర్ల వద్ద ట్రేడైంది.
- ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.200 పెరిగి మళ్లీ ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయి రూ.78,700కు చేరుకుంది. కిలో వెండి రూ.500 పెరుగుదలతో రూ.93,500 పలికింది.

స్పోర్ట్స్

మహిళల వరల్డ్‌కప్‌లో నేడు
ఇంగ్లండ్ X వెస్టిండీస్ రా. 7.30

క్రీడా సంఘాల్లో మహిళలకు మరింత ప్రాధాన్యం

స్పోర్ట్స్ బిల్ ముసాయిదాపై మంత్రి మాండవ్య

న్యూఢిల్లీ: క్రీడా సంఘాల్లో మహిళల ప్రాధాన్యాన్ని పెంచే విధంగా జాతీయ స్పోర్ట్స్ బిల్ ముసాయిదాను తయారు చేసినట్టు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవ్య తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ), భారత పాలింపిక్ కమిటీ (పీసీఐ), ఇతర జాతీయ క్రీడా సంఘాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని 30 శాతం వరకు పెంచనున్నట్టు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. లింగ సమానత్వం కోసం ఈ నిర్ణయాలు తీసుకొన్నట్టు చెప్పారు. ఈ బిల్‌పై ప్రజాప్రాయ సేకరణ ఈపాటికే మొదలైంది. కాగా, ఐవోఏ, పీసీఐ, జాతీయ క్రీడా సంఘాల జనరల్ బాడీల్లో ఓటింగ్ అర్హత కలిగిన వారిలో 10 శాతం మంది ప్రముఖ క్రీడాకారులు ఉండేలా డ్రాఫ్ట్‌ను తయారు చేశారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలనే ఆలోచనను దృష్టిలో ఉంచుకొని డ్రాఫ్ట్ బిల్‌ను రూపొందించామన్నారు. కాగా, క్రీడా వివాదాలను వేగంగా పరిష్కరించేందుకు భారత స్పోర్ట్స్ ట్రైబ్యునల్ ఏర్పాటు అంశం కూడా బిల్‌లో పొందుపరిచామని చెప్పారు.



ఫామ్‌లోకి రావాలని..

బరిలో సింధు, లక్ష్య సేన్
నేటినుంచి డెన్మార్క్ ఓపెన్

ఒడెన్స్ (డెన్మార్క్): వరుస వైఫల్యాలతో ఒత్తిడిలో ఉన్న ఏస్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్ మళ్లీ పుంజుకోవాలనుకొంటున్నారు. మంగళవారం నుంచి జరిగే డెన్మార్క్ ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. తొలి రౌండ్‌లో పై యు పో (చైనీస్ తైపీ)తో సింధు తలపడనుంది. యువ షట్లర్లు ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోడ్, ఉన్నతి హుడా సత్తాచాటాలనే ఉత్సాహంతో ఉన్నారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లు గువాంగ్ జు (చైనా)తో లక్ష్య సేన్ ఆడనున్నాడు. గతవారం ఆర్కిటిక్ ఓపెన్‌లో సింధు తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టగా.. లక్ష్యకు రెండో రౌండ్‌లో షాక్ తగిలింది. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల, రితుపర్ణ-స్వేతపర్ణలతోపాటు మిక్స్‌డ్‌లో సుమీత్-సిక్కి, సతీష్-ఆద్య జంటలు పోటీపడనున్నాయి.

భారత్ అవుట్ సెమీస్‌కు కివీస్



54 పరుగులతో పాకిస్థాన్ పరాజయం



పాక్‌పై గెలిచిన ఆనందంలో న్యూజిలాండ్ జట్టు

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్ కప్ నుంచి భారత జట్టు నిష్క్రమించింది. గ్రూపు 'ఎ' ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భాగంగా సోమవారం న్యూజిలాండ్ చేతిలో పాకిస్థాన్ దారుణంగా ఓడడంతో మన అమ్మాయిల సెమీఫైనల్ ఆశలు గల్లంతయ్యాయి. స్వల్ప స్కోరు చేసినా..కట్టుదిట్టమైన బౌలింగ్‌తో న్యూజిలాండ్ అదరగొట్టింది. 54 పరుగులతో గెలిచి ఇటు పాకిస్థాన్‌ను అటు భారత్‌ను నాకౌట్ చేసింది. గ్రూపులో రెండో స్థానంతో సెమీస్ బెర్త్ దక్కించుకుంది. ఇక నాలుగింటికి నాలుగు మ్యాచ్‌లు నెగ్గి గ్రూపు 'ఎ' టాపర్‌గా ఆస్ట్రేలియా ఇప్పటికే సెమీఫైనల్లో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. తొలుత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 110/6 స్కోరుకే పరిమితమైంది. సుజీబేట్స్ (28), హాలీడే (22), సోఫీ డివైన్ (19) రాణించారు. నష్రా సంధూ 3 వికెట్లు పడగొట్టింది. స్వల్ప ఛేదనలో పాకిస్థాన్ 11.4 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ ఫాతిమా సనా (21) టాప్ స్కోరర్. ఆ తర్వాత మునీబా అలీ (15) మాత్రమే రెండంకెల స్కోరు చేసింది. అమీలియా కెర్ 3, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కార్సన్ 2 వికెట్లు తీశారు.

భారీ షాట్లతో బోల్తా: 10.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదిస్తే సెమీస్ బెర్త్ లభిస్తుందన్న లెక్కతో..దూకుడుగా ఆడేందుకు యత్నించిన పాకిస్థాన్ ఆ క్రమంలో వికెట్లు పారేసుకుంది. ఫలితంగా పవర్ ప్లే ముగిసేసరికి 28/5తో కోలుకోలేని స్థితికి చేరింది. కానీ ఫాతిమా సనా, నిదా దర్ (9) ఆరో వికెట్‌కు 24 పరుగులు జోడించడంతో పాకిస్థాన్ జట్టు కనీసం మ్యాచ్‌ను గెలుస్తుందని, తద్వారా భారత్ సెమీఫైనల్ చేరుతుందనే ఆశ ఏర్పడింది. నిదా దర్‌ను ఊరించే బంతితో కెర్ స్టంపౌట్ చేయడం..ఆపై ఒమైమా (2), అరూబ్ (0) ఇలా వచ్చి అలా వెళ్లడం..ఫాతిమా సనాను కెర్ అవుట్ చేయడంతో అటు పాకిస్థాన్ గెలుపు ఆశలు ఇటు భారత్ సెమీస్ అవకాశాలు గల్లంతయ్యాయి.

నష్రా హవా: పాకిస్థాన్ బౌలర్లు ముఖ్యంగా లెఫ్టామ్ స్పిన్నర్ నష్రా సంధు ప్రత్యర్థి బ్యాటర్లకు పూర్తిగా కళ్లెం వేసింది. ఇక పాకిస్థాన్ ఫీల్డర్లు ఏకంగా ఎనిమిది క్యాచ్‌లు వదిలేశారు. అందులో నాలుగు క్యాచ్‌లను నిదా దర్ బౌలింగ్‌లోనే వదిలేయడం గమనార్హం. అయితే పాకిస్థాన్ చెత్త ఫీల్డింగ్‌ను న్యూజిలాండ్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఓపెనర్లు సుజీ బేట్స్, ప్లిమ్మర్ వేగంగా ఆడడంతో పవర్ ప్లేలో కివీస్ 39/0 స్కోరు చేసింది. దూకుడుగా ఆడుతున్న ప్లిమ్మర్ (17)ను, అనంతరం బేట్స్‌ను నష్రా పెవిలియన్ చేర్చింది. అమీలియా (9) విఫలం కావడంతో కివీస్ 58/3తో నిలిచింది. ఈ దశలో కెప్టెన్ సోఫీ, హాలీడే నాలుగో వికెట్‌కు 38 రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. కానీ పాకిస్థాన్ బౌలర్లు మరోసారి విజృంభించి న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు.

సంక్షిప్తస్కోర్లు
న్యూజిలాండ్: 20 ఓవర్లలో 110/6 (బేట్స్ 28, హాలీడే 22, డివైన్ 19, ప్లిమ్మెర్ 17, నష్రా సంధు 3/18)
పాకిస్థాన్: 11.4 ఓవర్లలో 56 ఆలౌట్ (ఫాతిమా సనా 21, మునీబా అలీ 15, కెర్ 3/14, కార్సన్ 2/7).

రిస్క్ తీసుకుంటేనే మజా

మా బ్యాటర్ల దూకుడును ఆపలేను
టీమిండియా చీఫ్ కోచ్ గంభీర్



టీమిండియా ప్రాక్టీస్ సందర్భంగా కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్

బెంగళూరు: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో భారత బ్యాటర్ల ఆటతీరు విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. దాదాపు మూడు రోజుల ఆట వర్షార్పణమైనా చివరి రెండు రోజుల ఆటలోనే మ్యాచ్ ఫలితం వచ్చేలా రోహిత్ సేన చెలరేగింది. అలా రిస్క్ తీసుకుని ఆడితేనే ఫలితం వస్తుందని కోచ్ గంభీర్ చెబుతున్నాడు. పైగా అలాంటి ఆటను ప్రదర్శించగల సత్తా ఉన్న తమ ప్లేయర్లను ఎందుకు అడ్డుకోవాలని ప్రశ్నించాడు. బుధవారం నుంచి కివీస్‌తో టెస్టు సిరీస్ ఆరంభం కానుండగా కోచ్ గంభీర్ విలేకరులతో మాట్లాడాడు. 'తమ సహజమైన శైలితో బ్యాటింగ్ చేస్తూ ఒక్క రోజులోనే 400-500 పరుగులను సాధించగల సత్తా ఉన్న బ్యాటర్లను నేనెందుకు ఆపాలి? ఆడాల్సి వచ్చినప్పుడు అలాగే ఆడతాం. ఎంత రిస్క్ తీసుకుంటే అంత ఫలితం ఉంటుంది. అలాగే ఒక్కోసారి 100 పరుగులకే ఆలౌట్ అయ్యే పరిస్థితి కూడా ఎదురవ్వచ్చు. మరోవైపు డ్రా కోసం ఆడాల్సివస్తే రెండు రోజులైనా క్రీజులో నిలవగలిగేలా జట్టు ఉండాలని కోరుకుంటున్నా. అలా ఆడే బ్యాటర్లు కూడా మా దగ్గర ఉన్నారు. ఏదేమైనా పరిస్థితులకు తగ్గట్టుగా ముందుకెళ్లాల్సి ఉంటుంది. అదే టెస్టు క్రికెట్ అంటే. ఎప్పుడూ ఒకేలా ఆడితే ఎదగలేం' అని గౌతీ తేల్చాడు. మరోవైపు భారత్‌ను ఓడించే సత్తా న్యూజిలాండ్‌కు ఉందని, ఆ జట్టులో అద్భుత క్రికెటర్లున్న విషయం మరువరాదన్నాడు. అందుకే ఈ సిరీస్ తమకు సవాల్‌లాంటిదేనని చెప్పాడు. ప్రస్తుతానికైతే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఆలోచన లేదని, కివీస్‌తో సిరీస్ నెగ్గడంపైనే దృష్టి సారించినట్టు గంభీర్ పేర్కొన్నాడు.

విరాట్ ఫామ్‌పై ఆందోళన ఎందుకు?

బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయాడు. అయితే ప్రతీ మ్యాచ్‌కూ అతడి ఫామ్‌ను అంచనా వేయడం సరికాదని కోచ్ గంభీర్ స్పష్టం చేశాడు. 'విరాట్ అత్యుత్తమ ఆటగాడు. అరంగేట్రం చేసినప్పుడున్న పరుగుల దాహం నేటికీ కొనసాగుతోంది. రానున్న కివీస్, ఆసీస్‌తో సిరీస్‌ల్లో భారీగా పరుగులు సాధించగలడనే నమ్మకం ఉంది. అందుకే అతడి ఫామ్‌పై ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఏదేమైనా ఓ మ్యాచ్‌కో.. సిరీస్‌కో ఆటగాడి ప్రదర్శనను అంచనా వేయడం సరికాదు. ప్రతీ ఆటగాడికి మద్దతుగా నిలవాల్సిన అవసరం నాకుంది' అని గంభీర్ స్పష్టం చేశాడు.

కివీస్‌తో టెస్టుకు ముగ్గురు పేసర్లతోనే!



న్యూజిలాండ్‌తో ఈనెల 16 నుంచి జరిగే తొలి టెస్టులో భారత జట్టు ముగ్గురు పేసర్లతోనే బరిలోకి దిగే అవకాశం ఉంది. స్థానిక చిన్నస్వామి స్టేడియంలో పచ్చికతో కూడిన పిచ్‌ను సిద్ధం చేశారు. దీంతో చక్కటి బౌన్స్ లభించే చాన్సుంది. ఇటీవల బంగ్లాతో సిరీస్‌లోనూ జట్టు ఇదే వ్యూహంతో ముందుకెళ్లింది. తొలి టెస్టు జరిగిన చెన్నై వికెట్ సహజంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంటుంది. కానీ జట్టు మాత్రం పేసర్లకు తగినట్టుగా తయారు చేయించింది. ఇప్పుడు కూడా రాబోయే ఆస్ట్రేలియా టూర్ దృష్ట్యా పేసర్లకు సహాయకారిగా ఉంచే పిచ్ వైపే జట్టు దృష్టి సారించింది. ఫలితంగా కివీస్‌తో మొదటి టెస్టులో భారత్ ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో ఆడొచ్చు. 2022లో ఇక్కడ జరిగిన చివరి టెస్టులోనూ పేసర్ల ఆధిపత్యం కనిపించింది. అప్పుడు శ్రీలంకపై బుమ్రా ఒక్కడే 8 వికెట్లు తీశాడు. పైగా పేసర్లు సిరాజ్, ఆకాశ్ ఆర్‌సీబీ ప్లేయర్లు కావడంతో చిన్నస్వామి వికెట్‌పై చక్కటి అవగాహనే ఉంటుంది. మంగళవారం వికెట్‌ను చూశాక జట్టు కూర్పుపై అంచనాకు వస్తామని గంభీర్ చెప్పాడు. భారత్‌తో సిరీస్‌కు ముందు కివీస్ జట్టు లంక టూర్‌లో స్పిన్నర్లకు దాసోహమైంది. రెండు టెస్టుల్లో ఏకంగా 37 వికెట్లు వారికే కోల్పోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మరో స్పిన్నర్‌ను జట్టులోకి తెచ్చినా ఆశ్చర్యం లేదు.

కుప్పకూలిన ఆంధ్ర

విదర్భ చేతిలో ఓటమి

నాగ్‌పూర్: తాజా రంజీ సీజన్‌ను ఆంధ్ర ఓటమితో ఆరంభించింది. గ్రూప్-బిలో విదర్భతో మ్యాచ్‌లో ఆంధ్ర 74 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. విదర్భ నిర్దేశించిన 318 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు ఆఖరి రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 79/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 243 పరుగులకు కుప్పకూలింది. అభిషేక్ (78), రషీద్ (74) మినహా మిగతా బ్యాటర్లు చేతులెత్తేశారు. ఆదిత్య, హర్ష్ దూబే చెరో 4 వికెట్లు తీశారు. విదర్భ 118, 366 స్కోర్లు చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 167 పరుగులకు ఆలౌటైంది. కాగా, గుజరాత్ చేతిలో హైదరాబాద్ 126 పరుగుల తేడాతో ఓడింది.

ముంబైకి బరోడా షాక్

వడోదర: లెఫ్టామ్ స్పిన్నర్ భార్గవ్ భట్ (6/55) తిప్పేయడంతో.. రంజీ డిఫెండింగ్ చాంప్ ముంబైకి బరోడా షాకిచ్చింది. గ్రూప్-ఎలో జరిగిన మ్యాచ్‌లో బరోడా 84 పరుగులతో ముంబైను ఓడించింది. 262 పరుగుల ఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 42/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 177 రన్స్‌కు ఆలౌటైంది. బరోడా 290, 185 స్కోర్లు చేయగా.. ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 214 రన్స్‌కు ఆలౌటైంది.

గ్రీన్ అవుట్

బోర్డర్-గవాస్కర్ సిరీస్

సిడ్నీ: ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్‌కు ఆసీస్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ దూరమయ్యాడు. వెన్ను నొప్పికి శస్త్రచికిత్స చేయించుకోనున్న అతడు..ఆరు నెలలపాటు ఆటనుంచి విశ్రాంతి తీసుకోనుండడమే అందుకు కారణం. గత నెల యూకే పర్యటన సందర్భంగా 25 ఏళ్ల గ్రీన్ తీవ్ర వెన్ను నొప్పితో బాధపడ్డాడు.

విక్టర్‌కు భారీ ధర

హెచ్‌ఐఎల్ వేలం

న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్) రెండో రోజు వేలంలో బెల్జియం మిడ్‌ఫీల్డర్ విక్టర్ వాగ్నెజ్ అత్యధిక ధర పలికిన ఆటగాడిగా నిలిచాడు. సోమవారం జరిగిన వేలంలో విక్టర్‌ను సూర్మ హాకీ క్లబ్ రూ. 40 లక్షలకు ఖరీదు చేసింది. డచ్ ప్లేయర్లు థియర్రీ బ్రింగ్ మన్‌ను రూ. 38 లక్షలకు, డోరెన్‌ను రూ. 32 లక్షలకు కళింగ లాన్సర్స్ కొనుగోలు చేసింది. భారత ఆటగాళ్లలో రవిచంద్రను రూ. 32 లక్షలకు లాన్సర్స్, రహీల్‌ను రూ. 25 లక్షలకు డ్రాగన్స్ దక్కించుకున్నాయి.

నేడు మహిళల హాకీ ప్లేయర్ల వేలం

తొలి భారత మహిళల హాకీ లీగ్ వేలం మంగళవారం ఇక్కడ జరగనుంది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 300 మందికి పైగా క్రీడాకారిణులు వేలంలో నిలిచారు. వీరిలో 250 మంది దేశ క్రీడాకారిణులుకాగా 70 మంది విదేశీయులు. 4 జట్లు వేలంలో పాల్గొననున్నాయి.



ఫిట్‌నెస్

వ్యాయామం ఎంతసేపు?

ఆరోగ్యం మెరుగ్గా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం చేయాలి. అయితే అధిక కొవ్వు కరగడానికి ఎంతసేపు వ్యాయామం చేయాలి? దీనికి సమయ పరివి ఎతి ఉంటుందా?

తక్కువ సమయంలో ఎక్కువ తీవ్రతతో కూడిన వ్యాయామాలు చేయడం, ఎక్కువ సమయం పాటు తక్కువ తీవ్రతతో వ్యాయామాలు చేయడం... అధిక బరువు తగ్గించుకోవడం కోసం ఈ రెండిట్లో ఏ మార్గాన్ని ఎంచ ఎకోవాలనే విషయంలో ఎంతోమందికి అయోమయం ఉంటుంది. అయితే తక్కువ సమయంలో ఎక్కువ తీవ్రతతో కూడిన వ్యాయామాలకు బదులుగా వారంలో ఐదు రోజుల పాటు రోజుకు గంట చొప్పున వ్యాయామాలు చేయడం మేలని ఓ అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనం కోసం 18 నుంచి 49 ఏళ్ల మధ్య ఉన్న 44 మందిని ఎంపిక చేసి, వారిని మూడు గ్రూపులుగా వి



భజించారు. మొదటి గ్రూపు వారంలో ఆరు రోజుల పాటు వ్యాయామం చేస్తే, రెండవ గ్రూపు వారంలో రెండు రోజుల పాటు, మూడవ గ్రూపు వ్యాయామానికి దూరంగా ఉండేలా చేశారు. చివర్లో వీళ్లందరినీ పరీక్షించినప్పుడు మొదటి గ్రూపు మిగతా రెండు గ్రూపుల కంటే ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేసి, బరువు తగ్గినట్టు తేలింది. కాబట్టి వారంలో కనీసం ఐదు రోజుల పాటు రోజుకు గంట చొప్పున వ్యాయామం చేయడం మేలు. ఇలా వ్యాయామం చేస్తూ, ఆహారపుటలవాట్లను అదుపులో పెట్టుకుంటే అధిక బరువును తేలికగానే తగ్గించుకోవచ్చు.

రెమెడీ

తలనొప్పి తగ్గే మార్గం...

తలనొప్పికి ఒత్తిడి కారణమైతే దాన్ని తొలగించుకునే మార్గాలను అన్వేషించడంతో పాటు, ఒత్తిడి లేని జీవితాన్ని గడిపే మెలకువలను అలవరుచుకోవాలి.

- రోజుకు మూడు సార్లు నియమిత వేళల్లో భోజనం తినాలి.
- తాజాగా వండిన, వేడిగా ఉన్న, వేడి వేడి సూప్‌లు తాగాలి. చల్లగా, పొడిగా, పెళుసుగా ఉండే పదార్థాలు తినకూడదు. తీపి, ఉప్పు, కారం తగ్గించాలి.
- కాఫీ, టీలు మానేసి, వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగుతూ ఉండాలి.



- గోరువెచ్చని నూనెతో శరీర మర్దన ఉపయోగపడుతుంది. స్నానానికి ముందు ఈ అభ్యంగన ఆచరించాలి. ఇలాంటి స్నానంతో రక్తప్రసరణ మెరుగై, నాడీ వ్యవస్థ నెమ్మదించి పెరిగిన తల భారం తగ్గుతుంది. గంధం పొడి, రోజా పువ్వుల నుంచి తీసిన నూనెలను కలిపి, కణతల దగ్గర మర్దన చేసుకున్నా ఫలితం ఉంటుంది.
- యోగాభ్యాసంతో శరీర కణజాలానికి పోషణ అంది, నాడీ వ్యవస్థ, అంతఃస్రావ వ్యవస్థ, లింఫ్ వ్యవస్థలు చైతన్యమవుతాయి. కండర కణజాలం స్వాంతన పొంది, నొప్పి తగ్గుతుంది. ఇందుకోసం ముందుకు వంగే వీలున్న ఆసనాలు వేయాలి.
- పిప్పర్‌మింట్, లావెండర్ ఎసెన్షియల్ నూనెలు కూడా ఉపయోగపడతాయి.
- ధ్యానం కూడా ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది
- స్నేహితులతో సరదాగా కాలక్షేపం చేయడం, ఆహ్లాదరకమైన పరిసరాల్లో స్వాంతన పొందడం వల్ల కూడా ఉపశమనం ఉంటుంది.

హెల్తీ డ్రింక్

ఫ్రూట్ వాటర్

పళ్లు కలిసిన నీళ్లు తాగితే బడలిక తొలిగి, కొత్త ఉత్తేజం దక్కుతుంది. వేసవి తాపం, దాహం తీరడంతోపాటు ఉపశమనాన్ని అందించే ఈ హెల్తీ డ్రింక్ తాగి చూడండి!



కావలసిన పదార్థాలు:
స్ట్రాబెర్రీలు - 4, నిమ్మకాయ - 1
నీళ్లు - 4 గ్లాసులు, తులసి ఆకులు - 5
తేనె - 1 టేబుల్ స్పూను

తయారీ విధానం:
- స్ట్రాబెర్రీలు శుభ్రంగా కడిగి, ముక్కలు చేసి పెట్టుకోవాలి.
- నిమ్మకాయ చక్రాలుగా కోసుకోవాలి.
- వెడల్పాటి గిన్నెలో నీళ్లు నింపి, ముక్కలు, తేనె, తులసి ఆకులు వేసి కలపాలి.
- ఈ గిన్నెను ఫ్రిజ్‌లో 3 గంటల నుంచి 2 రోజుల వరకూ ఉంచి వాడుకోవచ్చు.

ఒసిడి



అడపాదడపా మతిమరుపు వేధించడం సహజమే! అలాగని ప్రతిదీ ఒకటికి పది సార్లు సరిచూసుకుంటున్నా, చేసిన పనే పదే పదే చేస్తున్నా ఆ పరిస్థితిని 'అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్'గా భావించాలి. ఈ రుగ్మత దైనందిన జీవితాన్ని దెబ్బ తీస్తున్నా, ఇతరులకు ఇబ్బంది కలుగుతున్నా మానసిక వైద్యులను సంప్రతించాలి.

ఇది మతిమరుపు కాదు
మానసిక సమస్య

చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తూ ఉండడం (కంపల్షన్), అవసరం లేకపోయినా ఒక పని/వస్తువుకు విపరీతంగా ఆకర్షితులవడం(అబ్సెషన్)... ఇలా ఒసిడి రెండు రకాలుగా ఉంటుంది. కొందరిలో ఈ రెండు సమస్యలూ కలిసి ఉండవచ్చు. గోళ్లు కొరుక్కునే అలవాటు, ఇంటికి రాగానే చేతులు శుభ్రం చేసుకునే అలవాట్లను ఒసిడిగా భావించకూడదు. ఇలాంటివి అలవాట్లు మాత్రమే, వ్యసనాలు కాదు. అయితే కొందరు అర్థం లేని ఆందోళనలు, భయాలకు లోనవుతూ ఉంటారు. పిల్లలు బడి నుంచి సమయానికి ఇంటికి చేరుకోకపోతే, వాళ్లకేదో ప్రమాదం జరిగి ఉండొచ్చని ఊహించుకుని, ఎంతో హైరానా పడిపోతూ ఉంటారు. ఇంకొందరు ఏ వస్తువును తాకినా పదే పదే చేతులు కడుక్కోవడం, రోజులో 10 సార్లు స్నానం చేయడం లేదా బాత్రూమ్‌ను మాత్రమే పదే పదే శుభ్రం చేస్తూ ఉండడం లాంటివి చేస్తూ ఉంటారు. వీళ్ల అసహజ ప్రవర్తనను ఎదుటివాళ్లు తేలికగా గ్రహిస్తారు. కానీ దాని వల్ల ఆరోగ్యానికి, ఇతరులకు చెప్పుకోతగినంత నష్టం జరగదు కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు.

లక్షణాలు ఇవే

ఎక్కువశాతం ఒసిడి వ్యక్తులకు తమ ఆలోచనలు, అలవాట్లు అర్థం లేనివని తెలుసు. అయితే ఆ అలవాట్లు, ఆలోచనలను మానుకోలేరు. ఒకవేళ బలవంతంగా నియంత్రించుకున్నా ఆత్మన్యూనతకు లోనవుతూ ఉంటారు. శుభ్రత, ఒకే రకమైన వస్తువులను సేకరించడం, శరీరంలోని ఒక అవయవం పట్ల అసహ్యం... ఇలాంటివి ఒసిడి లక్షణాలే!



ఒసిడిలో మరో కోణం 'టిక్స్'

కొందరిలో టిక్స్ సమస్య ఉంటుంది. ఇది వాళ్లకు తెలియకుండానే జరుగుతూ ఉంటుంది. వాళ్ల నియంత్రణ లేకుండా అసంకల్పిత చర్యలా జరిగిపోతూ ఉంటాయి. అవేంటంటే...

కనురెప్పలు ఆర్పడం: కళ్లు ఆర్పడం అనేది నిరంతరంగా జరుగుతూనే ఉంటుంది. కనుగుడ్లు పొడిబారకుండా ఉండడం కోసమే ఇలా చేస్తూ ఉంటాం. అయితే పదే పదే కళ్లు ఆర్పే అలవాటు ఒసిడి వ్యక్తుల్లో కనిపిస్తుంది.

కళ్లు తిప్పడం: సూటిగా చూడకుండా చూపులు తిప్పడం, అలా పదే పదే చేయడం ఒసిడి వ్యక్తుల్లో కనిపించవచ్చు.

భుజాలు కదిలించడం: ఉన్నట్టుండి భుజాలు కదిలిస్తూ ఉంటారు. ఇలా పదే పదే ప్రతి ఐదు నిమిషాలకూ చేస్తూ ఉంటారు.

ఉపయోగం లేని వస్తువులను సేకరించే వ్యసనం 'హోర్డింగ్'

ఈ సమస్య ఉన్నవారి ఇంట్లో ఒకే రకం వస్తువులు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తాయి. ఉదాహరణకు కత్తెర పట్ల వ్యసనం ఉన్న ఒసిడి వ్యక్తులు రకరకాల కత్తెరలు, వేర్వేరు సైజుల్లో ఉండేవి లెక్కలేనన్ని సేకరించి పెడతారు. అన్ని కత్తెరల వల్ల ఉపయోగం లేదనే విషయం వాళ్లకూ తెలుసు. అయినా వీలైనన్ని కత్తెరలు సేకరిస్తారు. కనిపించిన కత్తెరలన్నీ కొంటూ ఉంటారు.

'అబ్సెషన్'లో ఇలా...

- సూక్ష్మక్రిముల పట్ల అవసరానికి మించిన భయం
- తమకు, ఇతరులకు ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోననే నిరంతర ఆందోళన
- వస్తువులను ఒకే పద్ధతిలో అమర్చడం
- కొన్ని రంగులు చెడు చేస్తాయనీ, కొన్ని మంచి చేస్తాయనే ప్రగాఢ నమ్మకం
- శరీరంలో నిరంతరం జరిగే (శ్వాస, కళ్లు ఆర్పడం) జీవక్రియల పట్ల నిరంతర స్పృహ కలిగిఉండడం
- భాగస్వామి మోసం చేస్తున్నారనే అనుమానం

'కంపల్షన్'లో ఇలా...

- రోజులో ఎక్కువసార్లు చేతులు శుభ్రం చేసుకుంటూ ఉండడం
- ఒక పనిని ఒకే పద్ధతిలోనే చేస్తూ ఉండడం
- తాళం వేశానా, లేదా? స్విచ్ ఆపానా? లేదా? అని పదే పదే పరిశీలించుకోవడం
- మెట్లు, వంటింటి పాత్రలను పదే పదే లెక్కపెట్టుకోవడం
- వస్తువులను ఒకే పద్ధతిలో అమర్చుకోవడం
- తలుపు గడియ తాకడానికి, ఇతరులకు షేక్‌హ్యాండ్ ఇవ్వడానికి భయపడడం

ఒసిడికి కారణం?

ఇందుకు స్పష్టమైన వివరణ లేకపోయినా, ఈ కోవకు చెందిన వ్యక్తుల మెదడులో నిర్దిష్ట ప్రదేశాలు సాధారణంగా లేకపోవడాన్ని వైద్యులు గమనించారు. అయితే ఈ అంశాలకు సంబంధించి మరింత లోతైన అధ్యయనాలు జరపవలసి ఉంది. ఒసిడి పురుషుల్లో కంటే స్త్రీలలో ఎక్కువ. యువత, మధ్యవయస్కుల్లో ఎక్కువగా ఉంటుంది. ఒత్తిడి తోడైతే సమస్య మరింత ముదురుతుంది. ఒసిడికి జన్యువులూ కారణమనే అనుమానాలూ ఉన్నాయి. అయితే కొందరిలో ఒసిడికి కారణాలను వైద్యులు కొన్ని అంశాలను బట్టి నిర్ధారించారు. అవేంటంటే...

- తల్లితండ్రులలో ఒకరికి, తోడబుట్టినవారికి ఒఒడి ఉంటే, వారి రక్తసంబంధీకుల్లో కూడా ఈ సమస్య తలెత్తే అవకాశాలు ఎక్కువ
- మానసిక కుంగుబాటు, ఒత్తిడి
- ప్రమాదం బారిన పడడం
- బాల్యంలో లైంగికదాడికి గురవడం

నిర్ధారణ పరీక్షలు

ఒసిడి లక్షణాలను కారణాలు అనారోగ్యం కాదని నిర్ధారించుకోవడానికి కొన్ని పరీక్షలు తప్పనిసరి. ఆలోచనలు, అలవాట్లు దైనందిన జీవితాన్ని, వృత్తిగత, వ్యక్తిగత జీవితాలను ఇబ్బంది పెడుతున్నా, ఆ పనుల కోసం రోజులో కనీసం గంట సమయం తప్పనిసరిగా కేటాయిస్తున్నా ఒసిడిగా నిర్ధారించుకోవాలి.

చికిత్స ఉంది

ఒసిడిని సంపూర్తిగా వదిలించే చికిత్స లేకపోయినా, దాని వల్ల దైనందిన జీవితం దెబ్బతినే తీవ్రతను తగ్గించవచ్చు. 'టాక్ థెరపీ, సైకోథెరపీ'ల సహాయంతో ఒసిడి లక్షణాలను నియంత్రించవచ్చు. సైకోథెరపీలో 'కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ', 'హ్యాబిట్ రివర్సల్ ట్రైనింగ్' అనే రెండు రకాల చికిత్సలు ఉంటాయి. 'ఎక్స్‌పోజర్ అండ్ రెస్పాన్స్ ప్రివెన్షన్' అనే థెరపీలో, ఏ అంశాల వల్ల సదరు వ్యక్తులు ఒసిడికి లోనవుతున్నారో, ఆ అంశాలకు వారిని అలవాటు చేస్తారు. ఒకవేళ చేతులు పదే పదే శుభ్రం చేసుకునే వ్యక్తులు ఉంటే, వాళ్లు దేన్ని తాకితే అలా చేస్తున్నారో కనిపెట్టి, అదే పనిని మళ్లీ మళ్లీ చేయించి, చేతులు కడుక్కోవలసిన అవసరం లేదని నమ్మకం కలిగిస్తారు.
ఈ థెరపీలలో చేసే పనులు, వ్యసనాలు, అలవాట్లు, వాటిని ఎందుకు అలవరుచుకున్నారు? అందువల్ల ఉపయోగం ఉందా? తమతోపాటు, కుటుంబసభ్యులకు, ఎదుటివారికి ఎంత ఇబ్బంది కలిగిస్తున్నారు? ఎంత సమయం వృథా చేస్తున్నారు? అనే విషయాలను చర్చించి, వారంతట వారే తమ సమస్యను అధిగమించగలిగే మానసిక స్థైర్యాన్ని అందిస్తారు. దాంతో ఆత్మన్యూనత తొలగి తమ సమస్యను సమూలంగా అర్థం చేసుకుని సమస్య నుంచి బయటపడతారు.

యోగా

వెన్నువిల్లులా



వెన్ను వంకరను సరిదిద్దే యోగాసనాలున్నాయి. క్రమం తప్పక సాధన చేస్తే, వెన్ను దృఢంగా మారి, సరైన ఆకారాన్ని సంతరించుకుంటుంది. ప్రతి ఆసనం ప్రభావం వెన్ను మీద పడుతూ ఉంటుంది. మరీ ముఖ్యంగా కొన్ని యోగాసనాలతో వెన్నులోని కండరాలలో ఒత్తిడి వదులుతుంది. వెన్నుపూసల మధ్య ఘర్షణ తగ్గి, బిగుతు సడలి, అసౌకర్యం దూరమవుతుంది.

అర్ధ అధోముఖ వక్రాసనం

- ఈ ఆసనం వేయడానికి శిక్షకుల సహాయం అవసరం. కాబట్టి జాగ్రత్తగా సాధన చేయాలి.
- గోడకు దగ్గరగా ఆనుకుని కూర్చోవాలి.
- చేతులు రెండూ నేల మీద ఉంచి, గోడకు పాదాలు ఆనించి, నెమ్మదిగా కాళ్లను పైకి జరపాలి.
- ఇలా పాదాలను పైకి జరుపుతూ శరీరాన్ని వీలైనంత పైకి లేపాలి.
- ఇలా ఆంగ్ల అక్షరం ఎల్ ఆకారంలోకి శరీరాన్ని లేపి, నెమ్మదిగా కిందకు దింపాలి.
- ఇలా చేతుల బరువు ఆధారంగా శరీరాన్ని పైకి లేపడం కొంత క్లిష్టం.
- ఆసనం వేసే సమయంలో శిక్షకుల సహాయం తప్పక తీసుకోవాలి.



వీరభద్రాసనం

- నిటారుగా నిలబడి, ఎడమ కాలును సాధ్యమైనంత ముందుకు ఉంచాలి.
- ముందుకు ఉంచిన కాలు సహాయంతో కుంగి, రెండు చేతులను పైకి లేపాలి.
- లేపిన చేతులను కలిపి, నమస్కారం చేయాలి.
- ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, కుడి కాలును ముందుకు చాపి కుంగాలి.
- ఇలా రెండు కాళ్లనూ మార్చి, మార్చి కనీసం 5 సార్లు ఈ ఆసనం వేయాలి.

బితిలాసనం

- బల్లను పోలిన ఆకారంలోకి మారాలి.
- మోకాళ్లు, అరచేతుల ఆధారంగా టేబుల్ భంగిమలోకి మారాలి.
- ఈ భంగిమలో తలను నెమ్మదిగా పైకి లేపి ఆకాశాన్ని చూడాలి.
- శ్వాస పీల్చుకుని, కొన్ని క్షణాల పాటు ఊపిరి ఆపి ఉంచాలి.
- ఇలా నాలుగు సార్లు శ్వాస పీల్చి వదిలిన తర్వాత తిరిగి తలను దించాలి.
- ఇలా దించేటప్పుడు లోతుగా వంచిన వెన్నును పైకి లేపాలి.
- తలను మరింత కిందకు ఛాతీ వైపు వంచాలి.



బాలాసనం

- మోకాళ్లు మడిచి నేల మీద కూర్చోవాలి.
- ఈ భంగిమలో మడిచిన పాదాలు పిరుదులను తాకేలా ఉండాలి.
- తర్వాత చేతులను చాపి, ముందుకు వంగాలి.
- ఇలా వంగినప్పుడు ముఖం, ఛాతీ, అరచేతులు నేలను తాకాలి.
- ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, నెమ్మదిగా పైకి లేవాలి.
- ఈ ఆసనంతో వెన్నులో ఒత్తిడి తొలగి, కండరాలకు స్వాంతన చేకూరుతుంది.



త్రికోణాసనం

- కాళ్ల మధ్య మూడు అడుగుల దూరం ఉండేలా, నిటారుగా నిలబడాలి.
- ఒక పాదం ఎదురుగా ఉండి, మరో పాదం పక్కకు తిప్పాలి.
- తిప్పిన పాదం వైపు శరీరాన్ని వంచుతూ అటు వైపు చేతితో కాలిగిలక పట్టుకోవాలి.
- మరో చేతిని, తలను పైకి లేపి ఉంచాలి.
- ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, రెండో వైపు వంగాలి.
- ఈ ఆసనంతో కటి, వెన్ను, భుజాలలోని కీళ్ల మధ్య ఒత్తిడి తొలగుతుంది. వెన్ను సాగుతుంది.



సాలంబ సర్వాంగాసనం

- శవాసనం వేయాలి.
- కాళ్లు రెండూ కలిపి నెమ్మదిగా, నిటారుగా పైకి లేపాలి.
- నడుము చేతులతో పట్టుకుని పైకి నెడుతూ, నడుమును కూడా పైకి లేపాలి.
- ఇలా నడుముతో కలిపి, కాళ్లను మరింత నిటారుగా పైకి లేపాలి.
- నడుముతో పాటు, సాధ్యమైనంత వరకూ వెన్నునూ పైకి లేపాలి.
- ఈ భంగిమలో కేవలం తల, భుజాలు మాత్రమే నేలకు ఆనించి ఉంచాలి.



చిట్కా

నీళ్లతో మేలు!

నీళ్లు తాగడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. నీళ్లతో దాహం తీరడంతో పాటు ఆకలి కూడా అదుపులోకొస్తుంది. అంతే కాదు..

- భోజనానికి ముందు గ్లాసుడు నీళ్లు తాగితే ఆకలి తగ్గి, పరిమితంగా భోజనం ముగిస్తాం. దాంతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరకుండా ఉంటాయి.



- నిద్ర లేచిన వెంటనే లేదా ఉదయం అల్పాహారానికి ముందు నీళ్లు తాగే అలవాటు ఉన్న వాళ్లు, ఆ అలవాటు లేని వారి కంటే 44% ఎక్కువగా అధిక శరీర బరువు కోల్పోతున్నట్టు అధ్యయనాల్లో తేలింది.
- రోజూ తాగే ఒక లీటరు నీళ్ల వల్ల విశ్రాంతి దశలో సైతం శక్తి ఖర్చవుతూ ఉంటుంది.
- శీతల పానీయాలకు నీళ్లు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం. సున్నా కేలరీలతో కూడిన నీళ్లతో దాహం తీర్చుకుంటే, ఇతరత్రా వేసవి పానీయాల ద్వారా శరీరంలోకి చేరే క్యాలరీలను నియంత్రించుకోవచ్చు.
- అజీర్తి తొలగడానికీ, ఛాతీ మంట తగ్గడానికీ నీళ్లు తాగాలి.
- చర్మపు మెరుపు కోసం రోజులో 2 లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి.

ఫుడ్ ఫ్యాక్ట్

అరటిపండు తిందామా?


అరటి పండు ఎప్పుడు, ఎలా తింటే మంచిదనే విషయంలో కొంత అయోమయానికి లోనవుతూ ఉంటాం. ఈ పండులోని పోషకాలన్నీ శరీరానికి అందాలంటే అందుకు కొన్ని నియమాలు పాటించాలి. అవేంటంటే...

పక్వానికి వచ్చిన అరటిపండు కంటే బాగా మగ్గిన అరటిపండు తీపి ఎక్కువ. ఇందుకు కారణం దోరగా పండిన అరటిపండులో స్టార్చ్ పూర్తి సింపుల్ షుగర్స్‌గా విడిపోవు. అదే బాగా మగ్గిన పండులో స్టార్చ్ షుగర్స్‌గా విడిపోయి ఉంటుంది. కాబట్టి బాగా మగ్గిన అరటిపండు ఎక్కువ తియ్యగా ఉంటుంది.

- **మగ్గిన పండు ఎప్పుడు:** తోలు మీద నల్ల మచ్చలు ఏర్పడితే ఆ అరటిపండు బాగా మగ్గిందని అర్థం. ఈ పండు తేలికగా జీర్ణం అవుతుంది. వ్యాయామానికి ముందు లేదా తర్వాత తక్షణ శక్తి పొందాలంటే ఇలా మగ్గిన అరటిపండు తినాలి.



- **నిద్ర కోసం:** అరటిపండులో మన శరీరంలో స్వతహాగా తయారుకాని ట్రిప్టోఫాన్ అనే అమీనో యాసిడ్ ఉంటుంది. ఈ అమీనో యాసిడ్ నిద్రను క్రమబద్ధీకరించే సెరటోనిన్ అనే న్యూరోట్రాన్స్‌మీటర్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. మెదడులో ఉత్పత్తయ్యే అత్యంత ముఖ్యమైన రసాయనమిది. ఇది ఒత్తిడి, కుంగుబాటులను తగ్గించి నిద్రలేమిని పోగొడుతుంది.
- **పరగడుపున వద్దు:** ఈ పండులో మెగ్నీషియం, పొటాషియం, పీచు మొదలైన పోషకాలు ఉన్నా, పరగడుపున ఈ పండును తినడం శ్రేయస్కరం కాదు. దీన్లో ఉండే అత్యధిక చక్కెరలు తక్షణ శక్తిని అందించినా, అంతే వేగంగా కొన్ని గంటల వ్యవధిలోనే అలసటకూ గురిచేస్తాయి. ఆమ్లతత్వం కలిగిన అరటిపళ్లు పరగడుపున తింటే జీర్ణసంబంధ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఒకవేళ పరగడుపున అరటిపండు తినే అలవాటుంటే, ఆ పండును ఇతర పదార్థాలతో కలిపి తినాలి.


ఎగువ అహోబిలం క్షేత్రం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

అటు ఆధ్యాత్మికం.. ఇటు పర్యాటకం..!


అహోబిలంలో వెలసిన నృసింహస్వామి

ప్రకృతి అందాలతో అలరారే నల్లమల అడవుల్లో కొలువైన నవ నారసింహ క్షేత్రం అహోబిలం. ఓవైపు ఆధ్యాత్మికత... మరోవైపు పర్యాటకుల మదిని దోచే రమణీయ దృశ్యాలు.. ఎగసిపడే జలపాతాలు సాహసికులకు ఆహ్వానం పలుకుతుంటాయి. నారాయణుడు ఉగ్రనరసింహుడి అవతారంలో హిరణ్యకశిపుడిని చీల్చి చెండాడిన క్షేత్రం ఇదేనని పురాణ గాథ. స్వామి ఉగ్రరూపాన్ని చూసిన దేవతలు 'అహో... బలం..' అంటూ పొగిడినందుకే ఈ క్షేత్రానికి అహోబలం అని పేరు వచ్చిందని, అదే కాలక్రమంలో అహోబిలంగా మారిందని చెబుతారు. తాజాగా జాతీయ స్థాయిలో ఉత్తమ 'పర్యాటక' అవార్డు రావడంతో అహోబిలం మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

సాహస యాత్రలకు కేరాఫ్‌గా అహోబిలం.. 108 దివ్య వైష్ణవ ఆలయాల్లో ఒకటిగా కీర్తి

- నల్లమలలో ఒకేచోట కొలువైన నవనారసింహులు
- తన కల్యాణానికి రమ్మని పిలిచే అహోబిలేశుడు
- ఉగ్ర స్తంభాన్ని చేరాలంటే సాహసం చేయాల్సిందే
- జాతీయ ఉత్తమ పర్యాటక గ్రామంగానూ ఎంపిక

(ఆత్మకూరు)

అహోబిలం క్షేత్రాన్ని 108 దివ్య వైష్ణవ ఆలయాల్లో ప్రముఖంగా చెబుతారు. వైష్ణవ ఆళ్వారులు దర్శించి, స్తుతించినందున ఈ క్షేత్రానికి అంతటి ప్రాధాన్యం లభించినట్లు తెలుస్తోంది. ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడైన ఆదిశేషుడు వయ్యారంగా పవళించగా ఆయన పడగలపై తిరుమల శ్రీవేంకటేశ్వరుడు, నడుము భాగంలో అహోబిలం నృసింహుడు, తోకపై శ్రీశైల మల్లికార్జునుడు ఆవిర్భవించారని చెబుతారు. ఈ క్షేత్రం అభివృద్ధికి పల్లవులు, చోళులు, విద్యానగర రాజులు, చాళుక్యులు, కాకతీయులు, విజయనగర రాజులు, రెడ్డిరాజులు తోడ్పడినట్లు ఆలయ శాసనాలను బట్టి తెలుస్తోంది. 15వ శతాబ్దంలో తురుష్కులు దండయాత్ర చేసినప్పుడు రంగరాయల ప్రభువు తన సైన్యంతో వారిపై విజయం సాధించి జీయరు గారికి అహోబిల క్షేత్రాన్ని అప్పగించారని, ఆ విజయానికి గుర్తుగా దేవాలయ చివరి ప్రాకారంలో జయస్తంభాన్ని స్థాపించినట్లు చెబుతారు. ఈ స్థూపాన్ని ఇప్పటికీ దిగువ అహోబిలంలో చూడవచ్చు. హిరణ్యకశిపుని సంహారం అనంతరం నరసింహస్వామి అహోబిలం కొండల్లో తిరుగుతూ తొమ్మిది ప్రదేశాల్లో జ్వాలా, అహోబిల, ఉగ్ర, మలోల, కారంజ, భార్గవ, యోగానంద, ఛత్రవట, పావన నరసింహ రూపాల్లో వెలసి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. అందుకే ఇది నవ నారసింహ క్షేత్రంగా పేరొందింది.

కల్యాణానికి స్వయంగా ఆహ్వానం పలికే శ్రీవారు

అహోబిలంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున స్వామి వారికి కల్యాణోత్సవం జరిపిస్తారు. ఈ వేడుకను పురస్కరించుకుని అహోబిలం స్వామి వారు తన కల్యాణానికి తానే స్వయంగా భక్తులను ఆహ్వానించడం ఇక్కడి ప్రత్యేకత. ఇందుకోసం స్వామివారు 40 నుంచి 45రోజుల పాటు పల్లకిలో విహరిస్తూ అహోబిలం పరిసర ప్రాంతాల్లోని 33 గ్రామాల ప్రజలను తన వివాహానికి ఆహ్వానిస్తారు. ఆ పల్లకి మోసే బాధ్యతను వంశ పారంపర్యంగా కొన్ని కుటుంబాలు నేటికీ సంప్రదాయగా కొనసాగిస్తున్నాయి. దాదాపు 600 సంవత్సరాల క్రితం ఆనాటి ప్రథమ పీఠాధిపతి శ్రీ శఠగోప యతీంద్ర మహాదేశికన్ వారు ఈ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఆనాటి నుంచి నేటి వరకు పార్వేట ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తమ గ్రామానికి వచ్చే నరసింహుడికి స్వాగతం పలికే వేడుకను స్థానికులు సంబరంగా జరుపుకొంటారు.

దిగువ అహోబిలంలో లక్ష్మీనరసింహస్వామి శాంతమూర్తిగా వెలసినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. గర్భాలయంలో లక్ష్మీసమేత నృసింహుడిగా దర్శనమివ్వగా, పక్కనే శ్రీదేవీ భూదేవి సమేత ప్రహ్లాదవరద ఉత్సవమూర్తులు కొలువుదీరి ఉంటారు. ఆ తర్వాత అమృతవల్లి, అండాళ్ అమ్మవార్లు, వేంకటేశ్వర స్వామి సన్నిధి, పట్టాభిరాముడు, రామానుచార్యులు, ఆళ్వార్లు దర్శనమిస్తారు. దిగువ అహోబిలంలో శ్రీలక్ష్మీనృసింహాలయం అద్భుతమైన శిల్పకళతో విరాజిల్లుతోంది. అక్కడే కోనేరును కూడా నిర్మించారు.

ఇలా చేరుకోవచ్చు

నంద్యాల నుంచి రోడ్డు మార్గాన 42కి.మీ. దూరంలో ఉన్న ఆళ్లగడ్డకు చేరుకుని అక్కడి నుంచి 24 కిలోమీటర్లు ప్రయాణిస్తే అహోబిలానికి చేరుకోవచ్చు. ఆ తర్వాత మరో 8 కి.మీ., అటవీ మార్గంలో ప్రయాణిస్తే ఎగువ అహోబిలానికి చేరుకోవచ్చు. నంద్యాల వరకు రైలు సదుపాయం కూడా ఉంటుంది.


జాతీయ అవార్డు ప్రదానం

జాతీయ ఉత్తమ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అహోబిలం ఎంపికైంది. సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర పర్యాటక మంత్రి షెకావత్ చేతుల మీదుగా అహోబిలం దేవస్థానం కమ్యూనికేషన్ అధికారి కీడాంబి సేతురామన్ అవార్డును అందుకున్నారు.


అహోబిలంలో కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు

ఉగ్ర స్తంభ దర్శనం సవాలే

శ్రీమహావిష్ణువు ఉగ్ర నరసింహావతారంలో స్తంభం నుంచి ఆవిర్భవించినట్లు చెప్పే స్తంభాన్నీ అహోబిలంలో దర్శించుకోవచ్చు. ఎగువ అహోబిలంలోని నల్లమల అడవిలో ఉన్న సహజ రాతి నిర్మాణమే ఈ ఉగ్ర స్తంభం. స్తంభం నుంచి నారాయణుడు బయటకు రావడంతో అది ముక్కలైనట్లు కనిపిస్తోంది. దీనినే ఉక్కు స్తంభం అని కూడా పిలుస్తారు. స్తంభాన్ని ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు కొన్నిచోట్ల చేతులు, కాళ్లతో పాకాల్సి ఉంటుంది. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పణంగా పెట్టాల్సిన పరిస్థితి.


ఉగ్రస్తంభానికి అతికష్టంగా చేరుకున్న భక్తులు



1 అహోబిలంలోని నవనరసింహాలను నవగ్రహాలకు అధిపతులుగా చెబుతారు. జ్వాలా- కుజుడు, అహోబిల- గురువు, మలోల - శుక్రుడు, వరాహ- రాహు, కరంజ- చంద్రుడు, భార్గవ-సూర్యుడు, యోగానంద- శని, ఛత్రవట - కేతు, పావన- బుధ గ్రహాలకు అధిపతులుగా ఉంటారని, ఈ ఆలయాల దర్శనం వల్ల ఆయా గ్రహాల ప్రభావాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం.

1 హిరణ్యకశిపుడిని సంహరించిన అనంతరం జ్వాలా నరసింహ స్వామి ఆలయం సమీపంలోని గుండంలో నరసింహస్వామి తన చేతికి అంటిన రక్తపు మరకలను శుభ్రం చేసుకోవడంతో ఆ గుండంలోని జలాలు ఎరుపు రంగులోనే మారినట్లు చెబుతారు. నేటికీ ఆ గుండంలోని జలాలు ఎరుపు రంగులోనే కనిపించడం విశేషం. అందుకే ఈ గుండాన్ని రక్తపు గుండంగానూ పిలుస్తారు.

1 అహోబిలం క్షేత్రానికి నగరి, నిధి, తక్ష్యాద్రి, గరుడాద్రి, ఎగువ తిరుపతి, పెద అహోబిలం, భార్గవ తీర్థం, నవనారసింహ క్షేత్రం అని పేర్లు ఉండగా, తమిళులు ఈ క్షేత్రాన్ని సింగమేలు కుండ్రంగా పిలుస్తారు. ఈ క్షేత్రం సముద్ర మట్టానికి 2,800 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ ఉద్భవించిన భవనాశి నది తూర్పు నుంచి పడమరకు ప్రవహించి సప్తనదుల సంగమేశ్వరంలో సంగమిస్తోంది.

1 అహోబిలంలో ఉగ్ర స్తంభం మినహా మిగతా ఎనిమిది నృసింహుడి ఆలయాలకు నడవలేని భక్తులకు డోలీ సౌకర్యం ఉంది. ఒక్కొక్కరికి రూ.4 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

పల్లెల్లో పనుల పండుగ

- 30 వేల పనులు.. రూ.4,500 కోట్ల వ్యయం
- సంక్రాంతి నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళిక
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి
- కంకిపాడులో పల్లె పండుగకు శ్రీకారం



కంకిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'పల్లె పండుగ పనుల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పిలుపిచ్చారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సోమవారం కృష్ణా జిల్లా కంకిపాడులో ఆయన ప్రారంభించారు. కంకిపాడు, పునాదిపాడుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. గ్రామగ్రామానా వారం రోజులపాటు సాగే పల్లె పండుగ ఇంత నిండుగా జరుగుతుంటే మదిలో ఆనందంగా ఉందన్నారు. 'ప్రజల కోసం తీసుకునే ఏ నిర్ణయమైనా వారి మధ్యనే జరగాలి.. వారితోనే జరగాలి.. వారి వల్లనే జరగాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం' అని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 23న నిర్వహించిన గ్రామ సభల్లో రూ.4,500 కోట్లతో 30 వేల పనులు చేపట్టాలని తీర్మానాలు చేశారని.. ప్రజలంతా కలిసి తమ గ్రామాల్లో కావలసిన అభివృద్ధి పనులను వారే తీర్మానించుకున్నారని తెలిపారు. దీనిలో ప్రజాప్రతినిధుల ప్రమేయం ఏమీ లేదన్నారు. శంకుస్థాపన చేసిన చోటే ఆయా పనుల పూర్తి వివరాలు ఉంటాయని తెలిపారు. పూర్తి పారదర్శకతతో పనులు జరగాలన్నది తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన ఎంపీ బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు. పవన్ ఇంకా ఏం చెప్పారంటే..

బాబు పనితనం నాకు స్ఫూర్తి

ప్రజలందరి బాగు కోసం బలమైన నాయకత్వం కావాలన్నదే నా ఆకాంక్ష. 2014 నుంచీ నేను చెబుతున్నది ఇదే. సీఎం చంద్రబాబు పరిపాలనానుభవం రాష్ట్రానికి వరం. రాష్ట్ర శ్రేయస్సుకు ఉపయోగం. చంద్రబాబు పనితనం నాకు స్ఫూర్తి. ఆయన కేబినెట్ సమావేశాల్లో లేవనెత్తే అంశాలు సీనియర్ బ్యూరోక్రాట్లు కూడా సమాధానం చెప్పలేనంత లోతుగా ఉంటాయి. పాలనలో ఆయన చూపించే చొరవ అద్భుతం. నిరంతరం ప్రజల గురించి ఆలోచించే తీరు, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయనకున్న విజన్ కచ్చితంగా రాష్ట్రానికి మేలు చేస్తుంది. ప్రధాని మోదీ దిశానిర్దేశంలో కేంద్ర సాయంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది.

విధ్వంసం కళ్లముందే..!

ప్రతిసారీ గత ప్రభుత్వాన్ని విమర్శించాలనుకోను. కానీ ఆ ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం మాత్రం కళ్లముందు కదలాడుతూనే ఉంటుంది. గత సర్కారు విధానాలు ఎలాఉన్నాయి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వ విధానాలు ఎలా ఉన్నాయో ప్రజలకు చెప్పాలి.. అందుకే పోలిక తప్పడం లేదు. వైసీపీ హయాంలో కనీసం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎవరో కూడా తెలియని దౌర్భాగ్యం ఉండేది. అసలు పంచాయతీరాజ్ నిధులు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి. నేను ఈ శాఖ బాధ్యతలు తీసుకున్న తర్వాత అనేక సార్లు సమీక్షించినా నిధులు ఎలా, ఎటు వెళ్లాయనేది బ్రహ్మపదార్థంలా మిగిలిపోయింది. కాకినాడలో ఓ అటవీశాఖ అధికారి నా పేరు ఉపయోగించి చేస్తున్న కొన్ని పనులు నా దృష్టికి ప్రజలే తీసుకొచ్చారు. వెంటనే దీనిపై విచారించాలని అటవీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించాను. వచ్చిన ఆరోపణలు రుజువైతే సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడేది లేదు. అలాంటి అధికారుల అవసరం ఈ ప్రభుత్వానికి లేదు.


కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులో నిర్వహించిన 'పల్లెపండుగ' సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పాల్గొన్న జనం

రాష్ట్రవ్యాప్తంగా పల్లెపండుగ

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామసీమల్లో మళ్లీ సిమెంటు రోడ్ల పండుగ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 3 వేల కి.మీ సిమెంట్ రోడ్ల నిర్మాణానికి సోమవారం వేడుకగా భూమి పూజలు జరిగాయి. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ.. తమ కార్యక్రమాలన్నీ వదిలేసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడులో సిమెంట్ రోడ్లకు భూమిపూజ చేశారు.

మోదీ ఫొటో ఉండాల్సిందే!

పల్లె పండుగ వారోత్సవాలకు సంబంధించిన ప్రతి ఫ్లెక్సీ, వాల్‌పెయింట్, సిటిజన్ నాలెడ్జ్ బోర్డులపై కచ్చితంగా మోదీ, సీఎం చంద్రబాబు, రాష్ట్రప్రభుత్వ అధికార చిహ్నం, పంచాయతీరాజ్ శాఖ లోగో, ఉపాధి పథకం లోగో ఉండాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.

ముందు బాధ్యత.. ఆ తర్వాతే వినోదం

ముందు మన కడుపు నిండాలని.. ఆ తర్వాతే వినోదమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. ఆయన మాట్లాడుతుండగా ప్రజలు పెద్ద ఎత్తున ఓజీ ఓజీ అంటూ నినదించారు. దీంతో ఆయన తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి తర్వాత మాట్లాడారు. 'మనకు వినోదం, సినిమా అవసరం.. నాకు అర్థమైంది.. చాలా కాలంగా మీరు ఓజీ ఓజీ అంటుంటే నాకు మోదీ... మోదీ అని వినిపించేది. మనం ఈ పల్లె పండుగ ఎందుకు చేస్తున్నామో మీకు తెలుసా? రేపు మీరు సినిమాకు వెళ్లాలి.. అలా వెళ్లాలంటే వాటికి డబ్బులు పెట్టాలి. ముందు మీ కడుపు నిండాలి. రోడ్లు బాగు చేసుకుందాం, స్కూల్స్ బాగు చేసుకుందాం, ముందు బాధ్యత నెరవేరుద్దాం. ఆ తర్వాత వినోదం. మీరు సినిమాకు వెళ్లినా రోడ్లు బాగుండాలి కదా" అన్నారు.

ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్, ఏబీఎన్ గ్రూప్ ఆఫ్ నెట్‌వర్క్ హ్యాక్!

- 'సాక్షి' కుట్రపై సైబర్ క్రైం పోలీసులకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఫిర్యాదు
- కేసు నమోదు.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అత్యధిక ప్రజాదరణ పొందిన 'ఆంధ్రజ్యోతి' వెబ్‌సైట్‌తోపాటు ఏబీఎన్ గ్రూప్ ఆఫ్ నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని.. కొందరు హ్యాకింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ మేరకు బాధ్యుల్ని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, మొత్తం వ్యవహారంలో 'సాక్షి' చానల్‌పై తమకు సందేహం ఉందని సైబర్ క్రైం పోలీసులకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' హెచ్‌ఆర్ మేనేజర్ బి.మహేందర్ సోమవారం ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా తాము అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అందులో ప్రస్తావించారు. గూగుల్‌లో 'ఆంధ్రజ్యోతి' అని సెర్చ్ చేసినా.. 'సాక్షి' వెబ్‌సైట్‌లోకి తీసుకెళ్తోందని, హ్యాకింగ్ వల్ల ఏబీఎన్ వాట్సాప్ యాప్ చానల్ వేలాది మంది వీక్షకుల్ని కోల్పోయిందని పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్, ఏబీఎన్ గ్రూప్ నెట్‌వర్క్‌ను హ్యాక్ చేసి.. సదరు ట్రాఫిక్‌ను 'సాక్షి'కి మళ్లించడం వల్ల తాము ప్రతి నెలా రూ.50 లక్షల వరకు నష్టపోతున్నట్లు వెల్లడించారు. ఇటీవల ఓబీ వ్యాన్(డీఎస్ఎన్‌జీ) శాటిలైట్ ఫ్రీక్వెన్సీ సైతం హ్యాక్ అయిందని, ఈ అంశంపై ఇప్పటికే ఇస్రోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఓబీ వ్యాన్ హ్యాకింగ్‌పై ఇస్రో విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. హ్యాకింగ్ కారణంగానే వివిధ యాప్ స్టోర్ల నుంచి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి యాప్‌ను డౌన్‌లోడ్ చేయడంలోనూ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు 'ఏబీఎన్ ఎనిమీస్' పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, తీవ్ర పదజాలంతో పోస్టింగ్‌లు పెట్టి సోషల్ మీడియా వేదికగా తమ పరువుకు భంగం కలిగించే కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఈ పరిణామాలన్నింటికి సంబంధించి సాక్షి చానల్‌పై తమకు అనుమానాలున్నాయని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఐటీ యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు.

హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి

- రెచ్చగొట్టేలా పవన్ వ్యాఖ్యలు.. నాంపల్లి కోర్టులో 'పిల్'

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రామ మందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అయోధ్య పంపిన తిరుమల లడ్డూల్లో జంతువుల కొవ్వు పదార్థాలు కలిశాయంటూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల కారణంగా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొంటూ నాంపల్లి సిటీ సివిల్ కోర్టులో సోమవారం ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. సామాజిక మాధ్యమాల్లోని ఆ వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ న్యాయవాది ఇమ్మనేని రామారావు ఈ పిల్‌ను దాఖలు చేశారు. అయోధ్యకు పంపిన లక్ష లడ్డూల్లో కల్తీ నెయ్యి వినియోగించినట్టు ప్రజల్లో విద్వేషం పెంచేలా పవన్ కల్యాణ్ ఆధారాలు లేని వ్యాఖ్యలు చేశారని తెలిపారు. గత నెల 18, 19, 20 తేదీల్లో పవన్ చేసిన వ్యాఖ్యలు వివిధ చానెళ్లు, పత్రికలు, వెబ్‌సైట్లు, యూట్యూబ్, వాట్సాప్, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయని పేర్కొన్నారు. మరోసారి పవన్ కళ్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా నిషేధ (గ్యాగ్) ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. మంగళవారం ఈ పిల్ విచారణకు వచ్చే అవకాశముంది.

సాయిబాబాను సర్కారే హత్య చేసింది: నారాయణ

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల ఉద్యమ నేత, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబాను సర్కారే హత్య చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. ఆయన నిర్దోషి అని న్యాయస్థానం తేల్చిందని.. సాయిబాబాను అకారణంగా పదేళ్లపాటు జైలులో మగ్గేలా చేసిన దోషులెవరో కూడా తేల్చాలన్నారు. సాయిబాబాకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు లేఖ రాశానని తెలిపారు. కోర్టులో కేసు కూడా వేస్తామన్నారు. హైదరాబాద్‌లోని సోమవారం నారాయణ మీడియాతో మాట్లాడారు. 90శాతం వైకల్యంతో ఉన్న సాయిబాబాను పదేళ్లు నిర్బంధించి, హింసించిన కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆయనకు బెయిల్ కూడా ఇవ్వకుండా పక్షపాత ధోరణితో వ్యవహరించిన న్యాయవ్యవస్థ రెండూ ముద్దాయిలే అన్నారు. ఉపా చట్టంతో కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. కాగా, సాయిబాబా భౌతిక కాయానికి సీపీఎం కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు నివాళులర్పించారు.

రోడ్డుపై కదలని వాహనాలు


సోమవారం రాత్రి విజయవాడ బందరు రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు... వర్షం కురవడం.. పండుగ రద్దీతో ట్రాఫిక్ నిలిచిపోయింది

వాగు దాటని ప్రాణాలు!

- రంప మన్యంలోనూ తప్పని డోలీ మోతలు
- ఆస్పత్రికి తరలిస్తుండగా గిరిజనుడి మృతి

మారేడుమిల్లి, అక్టోబరు 14: గిరిజన ప్రాంతాల్లో రహదారి సౌకర్యం లేక డోలీ మోతలు తప్పడం లేదు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ గిరిజనుడిని గ్రామస్థులంతా ఏకమై డోలీపై కొండవాగు దాటే ప్రయత్నం చేసినా.. ప్రాణాలు దక్కలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం సున్నంపాడు పంచాయతీ పరిధిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలివీ.. మండలంలోని నూరుపూడి గ్రామానికి చెందిన కెచ్చెల తమ్మిరెడ్డి తీవ్ర కడుపునొప్పితో విలవిల్లాడారు. ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు దారి లేకపోవడంతో గ్రామస్థులు ఏకమై 8 కిలోమీటర్ల మేర డోలీపై కొండవాగు వరకు మోసుకొచ్చారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అవతలి వైపే అంబులెన్స్ నిలిచిపోయింది. దీంతో వాగు ఉధృతి తగ్గే వరకు కొన్ని గంటల పాటు వేచి ఉన్నారు. ఆ తర్వాత అతికష్టం మీద గిరిజనుడిని డోలీపైనే వాగు దాటించే ప్రయత్నం చేస్తుండగా, కడుపునొప్పి తట్టుకోలేక అతడు ప్రాణాలు కోల్పోయాడు.


మారేడుమిల్లి మండలం సున్నంపాడు పరిధిలో గిరిజనుడిని డోలీపై వాగు దాటిస్తున్న గ్రామస్థులు

చిత్ర విచిత్రాలు

విశాఖలో 30 వారికే.. నెల్లూరు, విజయనగరంలో 24 చొప్పున

» తెలంగాణ వారికీ దక్కిన అవకాశం.. యూపీ, కర్ణాటక వారికి చాన్స్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన లాటరీ ప్రక్రియ పూర్తయింది. ఈ లాటరీలో లక్కు చిక్కించుకున్న వారిలో కొన్ని చోట్ల మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇక, పొరుగు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా గెలుచుకున్నారు.

▲ విశాఖలో 30 షాపులు మహిళలకే దక్కాయి. ఢిల్లీకి చెందిన ఒక వర్గం 250 దరఖాస్తులు సమర్పించగా లాటరీలో 15 దుకాణాలు దక్కాయి. పెదగంట్యాడకు చెందిన వృద్ధురాలు జీవీ రత్నాలు(68) దుకాణాన్ని దక్కించుకున్నారు.

▲ శ్రీసత్యసాయిలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సన్నిహితుడు, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులకు 5 దుకాణాలు దక్కాయి.

▲ మడకశిర నగర పంచాయతీ, గ్రామీణంలో 4 దుకాణాలు ఉండగా పీఎస్ వెంకటసుబ్బారెడ్డికి 3, ఆయన భార్య వైజయంతిమాలకు ఒకటి లభించాయి.

▲ మడకశిర నియోజకవర్గంలోని అమరాపురంలో తల్లీ కొడుకులు పీఎం పంకజ, పీఎం సుజిత్‌కు రెండు దుకాణాలు దక్కాయి.

▲ లేపాక్షిలో 57వ మద్యం దుకాణాన్ని లాటరీలో దక్కించుకున్న చిలమత్తూరు మండలం యత్నిశెట్టిపల్లికి చెందిన రంగనాథ్‌ను హిందూపురానికి చెందిన ఓ పార్టీ నేతలు కిడ్నాప్ చేశారని ఆయన భార్య అశ్విని ఆరోపించారు.

▲ కర్నూలు జిల్లాలో మహిళలను 9 షాపులు వరించాయి. ఇద్దరు మహిళలకు రెండు చొప్పున షాపులు దక్కాయి. వారిలో ఒకరు తెలంగాణకి చెందిన సుగాలి లక్ష్మీదేవి. అలాగే, తెలంగాణకి చెందిన వారికి 8 షాపులు దక్కాయి.

▲ కర్నూలు నగరానికి చెందిన ఓ ముఖ్య మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు 60 మంది 246 దరఖాస్తులు చేస్తే ఒక్క దుకాణం కూడా దక్కలేదు.

▲ కడప జిల్లాలో ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన వారికి 4 షాపులు దక్కాయి. కమలాపురం టీడీపీ నేతలు కొందరు వీరితో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం.

▲ కోనసీమ జిల్లాలో లక్కీడ్రాలో విజేతలైన వారితో మిగిలిన దరఖాస్తుదారులు సిండికేట్ అయ్యారు. కలెక్టరేట్ ప్రాంగణంలోనే లాబీయింగ్‌లు చేశారు. వైసీపీతో పాటు ఇతర పార్టీ నేతలు దరఖాస్తు చేసుకుని దుకాణాలు దక్కించుకున్నారు. జిల్లాలో ఐదు మద్యం షాపులను మహిళలు సొంతం చేసుకున్నారు.

▲ నెల్లూరు జిల్లాలో లాటరీ ప్రక్రియ జోరువానలో ముగిసింది. 24 షాపులను మహిళలు దక్కించుకున్నారు. అలాగే, విజయనగరంలో 24, శ్రీకాకుళం జిల్లాలో 24 షాపులను మహిళలు దక్కించుకున్నారు. వైసీపీకి చెందిన ఓ వ్యక్తి 40 దరఖాస్తులు వేయగా.. ఒక్క షాపు కూడా దక్కలేదు. సంతబొమ్మాళికి చెందిన టీడీపీ అనుచరులు బృందం 134 దరఖాస్తులు వేయగా.. 6 దుకాణాలు, మరో బృందం 61 దరఖాస్తులు వేయగా 3 దుకాణాలు లభించాయి.

▲ నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుటుంబానికి చెందినవారికి 5 దుకాణాలు లభించాయి. శ్రీకాకుళం నియోజకవర్గంలో కీలకమైన దుకాణాలు వైసీపీ అనుచరులకే దక్కాయి. ఈ జిల్లాలో 158 మద్యం దుకాణాల్లో టీడీపీ, వైసీపీకి చెందినవారే అధికంగా ఉన్నారు.

▲ పార్వతీపురం మన్యం జిల్లాలో ఇద్దరు మద్యం వ్యాపారులు కలిసి 250 దరఖాస్తులు చేయగా వారికి కేవలం 4 దుకాణాలే లభించాయి.

▲ ఎన్టీఆర్ జిల్లాలో నల్లగొండ, ఖమ్మం జిల్లాకు చెందిన లిక్కర్ వ్యాపారులు మద్యం షాపులను దక్కించుకున్నారు.

▲ ప్రకాశం జిల్లా పొన్నలూరులో రెండు మద్యం షాపులుండగా ఆ రెండూ అన్నదమ్ములకు దక్కాయి. ఓ రిటైర్డ్ ఎక్సైజ్ అధికారికీ దుకాణం దక్కింది.

▲ చీరాల నియోజకవర్గ పరిధిలో ఉన్న 20 షాపుల్లో 9 దుకాణాలను వైసీపీ కౌన్సిలర్ సహా సానుభూతిపరులే చేజిక్కించుకున్నారు.

▲ అనంతపురం జిల్లాలో టీడీపీకి చెందిన మహిళలు 14 దక్కించుకున్నారు.

▲ తాడిపత్రిలోని 20 దుకాణాల్లో పదికి పైగా మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరులకే దక్కాయి. అనంతపురం అర్బన్‌లో 30 దుకాణాలుండగా, 15 స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అనుచరులకు దక్కాయి.





విజయవాడలో మద్యం దుకాణాలకు లాటరీ తీసి, విజేతలను ప్రకటిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎక్సైజ్ అధికారులు, లాటరీలో పాల్గొన్న దరఖాస్తుదారులు

కిక్కు.. లక్కు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం ఫీజును ఏడాదికి ఆరు విడతల్లో చెల్లించాలి. లైసెన్సు పొందిన 24 గంటల్లోపు మొదటి విడత ఫీజు చెల్లించిన వారు వెంటనే షాపులు ప్రారంభించుకోవచ్చు. లాటరీ తగిలిన వారిలో అత్యధికులు అప్పటికప్పుడే తొలివిడత ఫీజులు చెల్లించి.. షాపుల ఏర్పాటు మొదలుపెట్టేశారు.

మహిళలకు 10శాతం షాపులు

సిస్టర్ సెంటిమెంట్, మదర్ సెంటిమెంట్... ఇలా మహిళల పేరిట భారీగా దరఖాస్తులు సమర్పించారు. సుమారు 350 షాపులు... అంటే 10.2 శాతం మహిళలకే దక్కాయి. విశాఖపట్నంలో అత్యధికంగా 20శాతం షాపులు మహిళలకు దక్కాయి. అనకాపల్లిలో 18.4శాతం, మన్యంలో 17.3, ఎన్టీఆర్‌లో 17.7, శ్రీకాకుళంలో 15.2, విజయనగరంలో 15.7, నెల్లూరులో 13.2శాతం షాపులు మహిళలకు దక్కాయి.

వారంలోపే రూ.99 మద్యం

కొత్త పాలసీలో క్వార్టర్ రూ.99 ధరతో మద్యం అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. ఆ హామీని వారంలోపు అమల్లోకి తెచ్చేందుకు ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. నాలుగు జాతీయ కంపెనీలు రూ.99కి మద్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చాయి. ఆ కంపెనీల మద్యం ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో అమ్ముడువుతోంది. తొలుత 2లక్షల కేసులు షాపులకు సరఫరా చేసి, వినియోగదారుల స్పందన ఆధారంగా కేసులు పెంచాలని భావిస్తున్నారు. అలాగే త్వరలో ధరల సవరణకు కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త బ్రాండ్లు, ఉన్న బ్రాండ్లపై ధరల సవరణను ఆ కమిటీ నిర్ణయిస్తుంది. ఆ తర్వాత కొత్త ధరలు అమల్లోకి వస్తాయి.

దండిగా దరఖాస్తుల ఆదాయం

దరఖాస్తు రుసుము రూ.2లక్షలు చేసినా వ్యాపారులు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. 2015-17 పాలసీలో 65,208 దరఖాస్తుల ద్వారా రూ.225కోట్ల ఆదాయం వచ్చింది. 2017-19 పాలసీలో 76,329 దరఖాస్తులు, రూ.422 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ పాలసీలో ఏకంగా 89,882 దరఖాస్తులు రావడంతో రూ.1798 కోట్ల ఆదాయం వచ్చింది.

ఫలించిన చెల్లి సెంటిమెంట్!

అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు మండల పరిధిలోని షాపు నెంబరు 95ను సీఏ ఫైనలియర్ చదువుతున్న కొప్పాక తులసి దక్కించుకున్నారు. చెల్లి పేరు మీద దరఖాస్తు చేస్తే కలిసొస్తుందన్న నమ్మకంతో ఆమె అన్న తులసి పేరు మీద ఒకే ఒక్క దరఖాస్తు సమర్పించారు. అదృష్టలక్ష్మి ఆమెనే వరించింది. తాను దాచుకున్న పాకెట్‌మనీ కూడా కొంత దరఖాస్తు ఫీజులో కలిపానని తులసి తెలిపా రు.

ఎస్పీవై రెడ్డి కుమార్తె హవా!

దివంగత నంద్యాల మాజీ ఎంపీ, ప్రముఖ పారిశ్రామికవేత ఎస్పీవై రెడ్డి కుమార్తె సన్నపురెడ్డి సుజల వివిధ జిల్లాల్లో దుకాణాలు దక్కించుకున్నారు. కర్నూలులో ఒకటి, అన్నమయ్య జిల్లా ఆరు, అనంతపురం జిల్లాలో 4 సహా, పీలేరు నియోజకవర్గంలోనూ షాపులు దక్కించుకున్నారు.

▲ నెల్లూరు జిల్లాలో రాష్ట్ర పురపాలక మంత్రి పి.నారాయణ తన సొంత డబ్బులు రూ.2 కోట్లు వెచ్చించి వంద మంది కార్యకర్తల ద్వారా మద్యం షాపులకు దరఖాస్తులు వేయించారు. వారిలో ముగ్గురికే షాపులు దక్కాయి. దీంతో ఒక్కో షాపును ఆరుగురు డివిజన్ ఇన్‌చార్జులకు చొప్పున మొత్తం 18 మందికి ఆయన అప్పగించి చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొని జీవించాలని సూచించారు.

▲ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు స్టేషన్ పరిధిలోని ఒక వైన్‌షాపు లాటరీలో ఓసీ కేటగిరీ వ్యక్తికి దక్కింది. అయితే అతను ఎస్టీ కాదని గుర్తించిన అధికారులు దానిని రద్దు చేసి మరొకరికి(లాటరీలో గెలిచిన రెండో వ్యక్తి) కేటాయించారు.

▲ కాకినాడ జిల్లాలో కొందరు వ్యాపారులు 100 దుకాణాలకు దరఖాస్తులు చేయగా 4 షాపులు దక్కాయి. దుకాణాలు దక్కించుకున్నవారి తొలి విడత వాయిదా డబ్బును ఎస్‌బీఐ కౌంటర్లలో జమచేసే క్రతువు రాత్రి వరకు కొనసాగింది.

▲ కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ఒకటో నెంబరు మద్యం దుకాణాన్ని కర్ణాటకకు చెందిన మహేశ్‌బాటే, రెండో నెంబరు షాపును ఉత్తరప్రదేశ్‌కు చెందిన లోకేశ్‌చంద్ దక్కించుకున్నారు. దీంతో ఆ షాపులను తమకు ఇవ్వాలని వారితో వ్యాపారులు బేరాలకు దిగారు.

▲ ఏలూరు జిల్లాలో 144 దుకాణాలు ఉండగా, అత్యధికంగా కొత్త వారి కే దక్కాయి.

నేతల తీరుపై సీఎం సీరియస్

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న లైసెన్సీలకు బెదిరింపులు మొదలయ్యాయి. కొన్ని నియోజకవర్గాల్లో తమవారికి షాపులు రాకపోవడంతో ఎమ్మెల్యేల అనుచరులు రంగంలోకి దిగారు. వ్యాపారం లో కచ్చితంగా వాటా కావాలని లేదంటే వ్యాపా రం ఎలా చేస్తారో చూస్తామంటూ హెచ్చరిస్తున్నారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కడప, కర్నూలు, పల్నాడు జిల్లాల్లో ఈ బెదిరింపుల పర్వం కనిపిస్తోంది. దీంతో లైసెన్సులు వచ్చినా ఫీజులు చెల్లించాలా? వద్దా? అనే సందిగ్ధ త లైసెన్సీల్లో నెలకొంది. అధికారులు వెంటనే ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లా రు. దీనిపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సులు దక్కించుకున్నవారిని ఇబ్బంది పెడితే ఎవరినీ ఉపేక్షించవద్దని హెచ్చరికలు జారీ చేశా రు. అటు పార్టీ, ఇటు ప్రభుత్వం రెండు వైపుల నుంచీ ఫోన్లు చేసి సీఎం ఆదేశాలను చేరవేస్తున్నారు.

బడా సిండికేట్లకు బ్యాడ్ లక్

'మనం మనం కలుద్దాం! భారీగా దరఖాస్తులు వేద్దాం. షాపులు పట్టేద్దాం' అంటూ సిండికేట్‌గా మారిన వారికి పలుచోట్ల నిరాశే ఎదురైంది. వంద ల సంఖ్యలో దరఖాస్తులు వేయగా చివరికి అరకొర షాపులే దక్కాయి. కొందరికి అవి కూడా దక్కలేదు.

ఎన్టీఆర్ జిల్లాలో 35 మందితో ఒక సిండికేట్ ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా షాపులు దక్కించుకునే వ్యూహంతో 520 దరఖాస్తులు వేసింది. కానీ... ఆ సిండికేట్‌కు 11 షాపులే దక్కాయి.

కర్నూలు జిల్లాలో ఓ మాజీ మంత్రి అనుచరులు సిండికేట్‌గా ఏర్పడి 31 షాపులకు 246 దరఖాస్తులు వేశారు. కానీ... లాటరీలో ఒక్కంటంటే ఒక్క షాపు కూడా దక్కకపోవడంతో అవాక్కయ్యారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలో ఓ నేత వర్గీయులు 186 దరఖాస్తులు దాఖలు చేయగా 7 షాపులు మాత్రమే వచ్చాయి.

అనంతపురంలో 300కు పైగా దరఖాస్తులు వేసిన ఓ వర్గానికి 11 షాపులు వచ్చాయి. అదే జిల్లాలో ఓ ఎమ్మెల్యే రూ.1.7కోట్లు ఖర్చుచేసి అనుచరుల ద్వారా దరఖాస్తులు వేయించగా... కేవలం రెండు షాపులు వచ్చాయి.

పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ సిండికేట్ 60 షాపులకు 250 దరఖాస్తులు వేయగా రెండే షాపులు దక్కాయి. ఇదే జిల్లాలో ఓ కూటమి నేత అనుచరులు 60 దరఖాస్తులు సమర్పించగా... ఒక్కటంటే ఒక్క షాపూ దక్కలేదు.

గుంటూరు జిల్లాలో ఓ ఎమ్మెల్యే అనుచరుడు 192 దరఖాస్తులు దాఖలు చేయగా... ఒక్కటంటే ఒక్క షాపూ దక్కలేదు. ఇప్పుడు అతను లబోదిబోమంటున్నాడు. మరో ఎమ్మెల్యే అనుచరులు 160 దరఖాస్తులు వేయగా రెండు షాపులు వచ్చాయి.

బాపట్ల జిల్లాలో నలుగురు రియల్టర్లు కలిసి 30 దరఖాస్తులు వేయగా ఒక్క షాపు కూడా రాలేదు. పర్చూరులో ముగ్గురు వ్యక్తులు 20 దరఖాస్తులు వేయగా నిరాశే మిగిలింది.

నంద్యాల జిల్లాలో వైసీపీ నేతలు సిండికేట్‌గా ఏర్పడి 12 దరఖాస్తులు దాఖలు చేయగా ఒక్క షాపూ రాలేదు.

పార్వతీపురం మన్యంలో ఓ మద్యం వ్యాపారి 250 దరఖాస్తులు చేయగా కేవలం నాలుగే షాపులు వచ్చాయి.

ఎమ్మార్పీ ఉల్లంఘనలు సహించం

» మంత్రి కొల్లు రవీంద్ర

కల్లు గీత వృత్తి కులాలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్ షాపులకు 15 రోజుల్లో నోటిఫికేషన్ జారీచేస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం విజయవాడలోని ఏపీఎండీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఒక్కో షాపునకు 18 దరఖాస్తులే వచ్చాయని, ఇప్పుడు 26 మంది పోటీపడ్డారని వివరించారు. ప్రభుత్వం స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడం వల్లే ఎక్కువ దరఖాస్తులు అందాయన్నారు. కొత్త పాలసీలో ఎమ్మార్పీ ఉల్లంఘనలు, ఎన్‌డీపీఎల్ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని రకాల మద్యం బ్రాండ్లను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు.

లిక్కర్ సిండికేట్‌కు ఏపీ అడ్డా: జగన్

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లిక్కర్ సిండికేట్‌కు ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారిందని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఎక్స్‌లో ఈమేరకు ఆరోపణలు చేశారు. 'లిక్కర్ మాఫియాకు సూత్రధారి, పాత్రధారి చంద్రబాబే. అత్యంత పారదర్శకంగా నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి... ప్రైవేటుకు, అయినవారికి అప్పగించాలన్న చంద్రబాబు నిర్ణయం అవినీతి కోసం వేసిన స్కెచ్. భవిష్యత్తులో తమకు కావాల్సిన డిస్టిలరీల నుంచి మద్యం కొనుగోలు చేసి, ఎమ్మార్పీకంటే అధిక ధరలకు అమ్ముకుంటారు' అని జగన్ ఆరోపించారు.

ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో టెండర్లు

» చోద్యం చూస్తున్న సీఎం చంద్రబాబు: షర్మిల

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ పనుల్లో రాజకీయ జోక్యం వద్దన్న సీఎం చంద్రబాబు... మద్యం సిండికేట్లను అరికట్టకుండా చోద్యం చూస్తున్నారు' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఈమేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఎక్కడికక్కడే అధికార పార్టీ నేతలు కుమ్మక్కై షాపులను దక్కించుకున్నారని తెలిసింది. కూటమి సిండికేట్లకే 3,000కుపైగా షాపులు దక్కాయంటే రాజకీయ జోక్యం ఏ మేరకు ఉందో స్పష్టమవుతోంది. షాపులను సిండికేట్లు దక్కించుకోవడంతోనే ప్రభుత్వ పారదర్శకత, నిష్పాక్షికత ఎంత ఉందో అర్థమవుతోంది' అని షర్మిల అన్నారు.

22 లక్షల హెక్టార్లలో పంటలకు వాన ముప్పు

» ఆందోళనలో సీమ, దక్షిణ కోస్తా రైతులు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం రైతుల్ని వణికిస్తోంది. అల్పపీడనంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో మూడు, నాలుగు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో ఆయా ప్రాంతాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 13.50 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 8.75 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ముఖ్యంగా వేరుశనగ, పత్తి, మిర్చి, నూనె గింజలు, చిరుధాన్యాల పంటలు కాపు దశలో ఉన్నాయి. ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పత్తి పూత, కాయలతో మొదటి విడత తీతకు సిద్ధంగా ఉంది. ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో వేరుశనగ కాయ గట్టి పడే దశలో ఉంది. అక్కడక్కడా ముదురు పైరును పీకటానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ఈ ఆరు జిల్లాల్లో జొన్న, సజ్జ, రాగులు, నువ్వులు, ఉలవ, కంది, ఇతర నూనె గింజల పంటలు, చిరుధాన్యాల పంటలు కోతకు వచ్చాయి. ఇక రాయలసీమలో అరటి, బత్తాయి(చీని), టమాట, దానిమ్మ, పచ్చిమిర్చి వంటి ఉద్యాన పంటలు కూడా కాపు దశలో ఉన్నాయి. ఇటు కోస్తాంధ్రలో వరి, మొక్కజొన్న గింజ పాలుపోసుకుని, కోత దశకు వస్తున్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రభుత్వం, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. అయినా ప్రకాశం, నెల్లూరుతో పాటు రాయలసీమకు అతిభారీ వర్షాలు చెప్పడంతో ఈ జిల్లాల రైతులు పంటల పరిస్థితిపై ఆందోళనలో పడ్డారు. గత ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలు, వరదలతో కోస్తాంధ్రకు భారీగా నష్టం వాటిల్లిన నేపథ్యంలో సీమ రైతులు కలవరపడుతున్నారు.

పరిశ్రమలకు స్వాగతం

» ఏపీలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం

» వేగంగా అనుమతులిచ్చేందుకు ఈడీబీ పునరుద్ధరణ

» ఐటీ, కెమికల్, ఫార్మా, మెడికల్ పరికరాలకు కేంద్రంగా విశాఖ

» వరద విపత్తు వేళ స్టార్టప్‌ల సహకారం అమోఘం

» వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం

» యూఎస్-ఇండియా ఫోరం లీడర్‌షిప్ సమ్మిట్‌లో మంత్రి లోకేశ్



ఢిల్లీలో నిర్వహించిన యూఎస్-ఇండియా ఫోరం లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆపిల్ ఇండియా ఎండీ విరాట్ భాటియా ప్రశ్నలకు సమాధానాలిస్తున్న ఏపీ మంత్రి నారా లోకేశ్

న్యూఢిల్లీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించడం ద్వారా పేదరికంలో మగ్గుతున్న వర్గాలను పైకి తేవడం తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ స్ఫూర్తితో 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణాన్ని కల్పించి, ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. సోమవారం, ఇక్కడ తాజ్‌మహల్ హోటల్‌లో నిర్వహించిన యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం లీడర్ షిప్ సమ్మిట్‌కు ఆయన హాజరయ్యారు. సదస్సులో 'వేగవంతమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై లోకేశ్ మాట్లాడారు. "పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు(ఈడీబీ)ను పునరుద్ధరించాం. ప్రైవేటురంగ ప్రముఖులతో సలహా మండలి ఏర్పాటు చేశాం. సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ద్వారా అనుమతులు ఇచ్చే విధానాన్ని అమలుచేస్తున్నాం. రాష్ట్రంలో చేపట్టబోయే ప్రాజెక్టులు, అనుమతులకు సంబంధించి ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రతి వారం ఇన్వెస్టర్లకు సమాచారం ఇస్తున్నాం. వచ్చే ఐదు ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాల సాధించాలన్న మా లక్ష్యానికి దోహదపడేలా దేశంలోనే తొలిసారిగా నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్)కు శ్రీకారం చుట్టాం. ఏపీలో వేగంగా పారిశ్రామికాభివృద్ధిని సాధించేందుకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ముందుకు సాగుతున్నాం. విశాఖపట్నాన్ని ఐటీ, కెమికల్, ఫార్మా, మెడికల్ పరికరాలకు కేంద్రంగా తీర్చిదిద్దుతాం. అతిపెద్ద తీర ప్రాంతం ఉన్నందున రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నాం. రెన్యూవబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, మెడికల్ డివైజ్, పెట్రో కెమికల్, ఫార్మా రంగాలకు పెద్దపీట వేస్తాం. 2029 నాటికి 72 గిగావాట్స్ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

స్టార్టప్ ఆంధ్ర నినాదం ఓ ఆయుధం!

వేగంగా మారుతున్న సాంకేతిక ప్రక్రియలో స్టార్టప్ ఆంధ్ర అనేది కేవలం నినాదం మాత్రమే కాదు, పరిపాలన విధానాన్ని సమూలంగా మార్చే ఓ అద్భుత ఆయుధం. విశాఖకు చెందిన స్టార్టప్ ఫ్లూయెంట్ గ్రిడ్ అభివృద్ధి చేసిన యాక్టిలిజెన్స్ అనే ఫ్లడ్ మానిటరింగ్ సిస్టమ్ ఇటీవల వరద సహాయక బృందాలు త్వరితగతిన నిర్ణయం తీసుకునేందుకు ఉపయోగపడింది. బాధితులకు ఆహార సామాగ్రిని అందించడానికి వీలు కల్పించే ఆన్‌లైన్ వ్యవస్థ దీని ద్వారా ఏర్పాటైంది. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ కేవలం 2 రోజుల్లోనే ఫ్లడ్ ఎన్యూమరేషన్ పోర్టల్‌ను అభివృద్ధి చేయడంలో సహాయం చేసింది. దీని ద్వారా బాధితుల గణన త్వరగా చేపట్టి, 15రోజుల్లోనే పరిహారం బదిలీ చేశాం. అంకురసంస్థల సాయంతో దోమలు, అంటు వ్యాధుల వ్యాప్తి జరగకుండా నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించడంతో పాటు అనలిటిక్స్ డ్యాష్‌బోర్డ్‌ను అభివృద్ధి చేశాం.

మొబైల్ ఫోన్ ద్వారా 100రకాల సేవలు

పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) వినియోగం ద్వారా మెరుగైన సేవలందిస్తాం. అమరావతిని ప్రపంచ స్థాయి ఏఐ రాజధానిగా తీర్చిదిద్దబోతున్నాం. ఫేజ్ -1లో 100 రకాల ప్రభుత్వ సేవలను ఫోన్ ద్వారా అందించబోతున్నాం. అమరావతిని గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా, రైతుల భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం" అని మంత్రి లోకేశ్ తెలిపారు.

ట్రిలియన్ డాలర్ ఎకానమీయే లక్ష్యం

ట్రిలియన్ డాలర్ల స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) సాధించిన మొదటి మూడు రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం వచ్చే ఐదేళ్లలో 10 కీలకమైన రంగాలను గుర్తించాం. అమరావతి అభివృద్ధి, నదుల అనుసంధానం, మెరుగైన నీటి నిర్వహణ, ప్రజలు-పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలపై దృష్టి సారించాం. మా ప్రభుత్వం పరిశ్రమలు, పర్యాటకం సేవా రంగాలను ప్రోత్సహిస్తోంది. పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తోంది. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్, పునరుత్పాదక శక్తి, టెలీ కమ్యూనికేషన్స్, రసాయన తయారీ సబ్‌సెక్టార్లలో ప్రాధాన్యతలతో కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నాం. ప్రైవేటు రంగ సహకారంతో వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగ సృష్టి లక్ష్యంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నాం.

వచ్చే ఏడాది నవంబరుకల్లా కొత్త డయాఫ్రం వాల్

» రేపు పీపీఏకు డిజైన్లు అప్పగింత

» అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేద్దాం: సీఎం

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది నవంబరు నాటికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తిచేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ లక్ష్యం నిర్దేశించుకుంది. సోమవారం విజయవాడ ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టుపై సమీక్షించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు-ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, మేఘా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. కొత్త వాల్ డిజైన్లను ఆఫ్రయ్ సంస్థ రూపొందించింది. వీటిని బుధవారం(16న) పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)కు అందజేస్తారు. ఈ డిజైన్లపై వచ్చే నెల 6 నుంచి పదో తేదీ దాకా నిర్వహించే వర్క్‌షాపులో సమీక్షిస్తారు. డయాఫ్రం వాల్ నిర్మాణంలో కాంక్రీట్-ప్లాస్టిక్ మిశ్రమం వినియోగంపై ఐఐటీ-తిరుపతి పరిశీలిస్తోంది. వచ్చే నెల 15 నాటికి యంత్ర సామగ్రిని కాంట్రాక్టు సంస్థ సిద్ధం చేస్తుంది. మొదటి ట్రెంచ్ కట్టర్ పనులు వచ్చే నెల 1న, రెండో ట్రెంచ్ కట్టర్ పనులను 2025 జనవరి 1న, మూడో ట్రెంచ్ కట్టర్‌ను జనవరి 21వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించారు. 90,000 టన్నుల ఇసుక ఇప్పటికే అందుబాటులో ఉంది. అలాగే ఈ నెల 14 నుంచి వచ్చే నెల 14 దాకా వైబ్రో కంపాక్షన్ పనులు చేపడుతున్నట్లు కాంట్రాక్టు సంస్థలు వెల్లడించాయి. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణం చేపట్టే ప్రాంతంలో బంక మట్టి స్థాయిపై పరిశోధనలు నిర్వహిస్తారు.

వంద కోట్ల లోపు ఖర్చయ్యేవి చేద్దాం..: సీఎం

అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. రూ.100 కోట్లలోపు ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులన్నిటినీ తొలుత పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కొత్త టెండర్లను పిలవాలన్నారు. సోమవారం జలవనరుల శాఖపై సమీక్షించారు. మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు. వరదల నిర్వహణపై ముందస్తు ప్రణాళికతో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారని చెప్పారు. ఇన్‌ఫ్లోను ఎప్పటికప్పుడు అంచనా వేసి, వర్షపు నీటిని ఒడిసిపట్టి, ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లోకి మళ్లించేలా చూడాలని సూచించారని తెలిపారు. వాతావరణ మార్పుల వల్ల 30 రోజుల్లో కురిసే వర్షం 3 గంటల్లోనే కురుస్తున్నందున అందుకు తగ్గట్టుగా నీటి నిర్వహణ చేపడతామన్నారు.

ప్రగతి పరుగు

» ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పాలసీలు ఉండాలి

» నూతన పారిశ్రామిక పాలసీల రూపకల్పనపై అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించేలా, పారిశ్రామిక వేత్తలు వెల్లువలా వచ్చేలా నూతన పారిశ్రామిక పాలసీలు రూపొందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సోమవారం సచివాలయంలో పారిశ్రామికాభివృద్ధి, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీల రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. గతంలో ఇతర రాష్ట్రాల పాలసీలను అధ్యయనం చేసి, పారిశ్రామిక వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ అధికారులు రూపొందించిన వివిధ డ్రాఫ్ట్‌ల పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాల కల్పనే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. దీనికి అనుగుణంగానే పారిశ్రామిక పాలసీలు ఉండాలన్నారు. పారిశ్రామికవేత్తలకు ఫ్రెండ్లీ గవర్నమెంట్‌గా నిలవాలని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఆకర్షించి రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఆవిష్కరణలకు దోహదపడేలా నూతన పాలసీలను రూపొందించాలని ఆదేశించారు. ఈ నూతన పాలసీలతో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది కాబట్టి, దేశంలోని ఏ రాష్ట్రంతో పోల్చుకున్నా ఏపీ పారిశ్రామిక విధానం అత్యుత్తమంగా ఉండాలన్నారు. నూతన పారిశ్రామిక పాలసీలు అమల్లోకి వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినవారికి అదనపు ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్, డేట్ ఆఫ్ కమర్షియల్ ప్రొడక్షన్ ఇచ్చిన మొదటి 200 కంపెనీలకు అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ప్రాతిపాదనలు చేశారు. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు అదనంగా 10 శాతం ప్రోత్సాహకాలు ప్రతిపాదించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్క్రో అకౌంట్ ద్వారా పారిశ్రామిక ప్రోత్సాహాలు ఇచ్చేందుకు ఆలోచనలు చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. దీనివల్ల జాప్యం లేకుండా కంపెనీలకు ఇన్సెంటివ్‌లు అందుతాయని వివరించారు.

వారికి అదనంగా 5 శాతం ప్రోత్సాహకాలు

'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' కాన్సెప్ట్‌తో ముందుకు వెళ్లాలనేది కూటమి ప్రభుత్వ విధానమని ఎంఎస్ఎంఈ పాలసీపై సమీక్ష సందర్భంగా చంద్రబాబు చెప్పారు. ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలకు అదనంగా 5% ప్రోత్సాహకాలు అందించేలా ప్రతిపాదించారు. ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల పాలసీపై మరింత కసరత్తు జరగాలని సీఎం సూచించారు. మిగిలిన ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలను త్వరలో నిర్వహించనున్న కేబినెట్ ముందుంచాలని నిర్ణయించారు. ఆక్వా, పౌల్ట్రీ రంగంలో వచ్చిన విధంగా ఫుడ్ ప్రాసెసింగ్‌లో కూడా మంచి ఫలితాలు వచ్చే విధానాలను అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సూచించారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ఐటీ రంగంలో పెట్టుబడులు వెల్లువెత్తాలి

రాష్ట్రంలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో దేశ, విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తడం ద్వారా యువతకు లక్షలాదిగా ఉపాధి అవకాశాలు దక్కేలా పాలసీని రూపొందించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే ఐటీ ప్రోత్సాహక విధానం రూపొందించిన అధికారులను అభినందించారు. ఐటీ, డ్రోన్, ఎలక్ట్రానిక్స్ పాలసీలపై అధికారులతో సమీక్షించారు.

అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

పారిశ్రామిక దిగ్గజం దివంగత రతన్ టాటా పేరుతో త్వరలోనే అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయనున్నామని ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబ తెలిపారు. అమరావతిలో ఏర్పాటు చేసే ఇన్నోవేషన్ హబ్‌కు అనుబంధంగా రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో సెంటర్లు ఏర్పాటవుతా యి. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే అమరావతి స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్స్, స్టార్టప్స్, ఫెసిలిటేషన్ కేంద్రంగా రూపాంతరం చెందనుంది.

రేపటికి తుఫాన్..!


భారీ వర్షాలపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, పాల్గొన్న మంత్రి నిమ్మల

అధికారులూ అప్రమత్తంగా ఉండండి

- ప్రజలకు అలెర్ట్ మెస్సేజీలు పంపండి
- ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చూడాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): 'అల్పపీడనం నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. అతిభారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో మొబైల్ ఫోన్లకు మెస్సేజీలు పంపి ప్రజలను అలెర్ట్ చేయాలి' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అల్పపీడన ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'చెరువులు, కాలువలు, నీటి వనరుల వద్ద పర్యవేక్షణ ఉంచాలి. కట్టల పరిరక్షణపై దృష్టి పెట్టాలి. పొంగి ప్రవహించే వాగులు, కాలువల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. నిరంతరం అప్రమత్తతతో ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలి. చెరువులు, రిజర్వాయర్లు నిండేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా పెట్టినట్లు అధికారులు చెప్పారు. సోమవారం మంత్రి నారాయణ నెల్లూరు నుంచి మున్సిపల్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టణాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు జిల్లా కలెక్టర్లు, అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశాలు చేశారు. రెవెన్యూ, విపత్తుల శాఖ స్పెషల్ సీఎస్ సిసోడియాతో కలిసి, కలెక్టర్లతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. 'పోలీస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు అలెర్ట్‌గా ఉండాలి. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లోని వారిని సచివాలయ సిబ్బంది సురక్షిత భవనాలకు తరలించాలి. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ వెంటనే వెనక్కి రప్పించాలి. భారీ వర్షాలతో పొంగిపొర్లే రోడ్లను మూసివేయాలి' అని సీఎస్ ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది 48 గంటల పాటు సెలవు పెట్టవద్దని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు.

నేడు ఎస్జీటీ ప్రాథమిక కీ విడుదల

ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో భాగంగా ఎస్జీటీ పోస్టులకు నిర్వహించిన టెట్ పేపర్ల ప్రాథమిక కీ మంగళవారం నుంచి అందుబాటులో ఉంటుందని టెట్ కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి సోమవారం పేర్కొన్నారు. 18వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. కాగా, సోమవారం ఉదయం జనరల్ అభ్యర్థులకు, మధ్యాహ్నం పేపర్-2 ఏ మ్యాథ్స్ అండ్ సైన్స్ అభ్యర్థులకు టెట్ పరీక్షలు నిర్వహించారు. 21,203 మంది అభ్యర్థులకుగాను 17,937 మంది హాజరయ్యారు.

17న చెన్నై సమీపంలో తీరం దాటుతుందని అంచనా

విశాఖపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో సోమవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారానికి దక్షిణ బంగాళాఖాతంలో ప్రవేశించి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. ఆ తర్వాత రెండ్రోజుల్లో తమిళనాడు, దక్షిణ కోస్తా దిశగా వస్తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే ఈ అల్పపీడనం బుధవారానికి తుఫాన్‌గా మారుతుందని... 17వ తేదీకల్లా మరింత బలపడి చెన్నైకు దక్షిణం వైపున తీరం దాటుతుందని, అనంతరం వాయుగుండంగా బలహీనపడి అరేబియా సముద్రంలో ప్రవేశిస్తుందని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. అరేబియా సముద్రంలో ప్రవేశించాక బలపడి తీవ్ర తుఫాన్‌గా మారే క్రమంలో ఈనెల 23న ఒమన్‌లో తీరం దాటుతుందని విశ్లేషించారు. మరో మోడల్ ప్రకారం... అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారుతుంది. నంతరం తీవ్ర అల్పపీడనంగా బలహీనపడి 17న దక్షిణ కోస్తాలో తీరం దాటుతుంది. కాగా ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయవ్యంగా పయనించి ఈనెల 16కల్లా వాయుగుండంగా బలపడుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు. తర్వాత తీవ్ర వాయుగుండంగా బలపడి 17 దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు మధ్య తీరం దాటుతుందని, ఆ సమయంలో గాలులు గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో వీస్తాయని పేర్కొన్నారు. దీనికితోడు దక్షిణ కోస్తాకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో బంగాళాఖాతం నుంచి భారీగా తేమగాలులు రావడంతో ఆదివారం రాత్రి నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల, కోస్తాలో మిగిలినచోట్ల వర్షాలు కురిశాయి. సోమవారం సాయంత్రం వరకు కొడవలూరులో 110.25, ఇసకపల్లిలో 108.0, కావలిలో 104.25, బుచ్చిరెడ్డిపాలెంలో 97.25, దగదర్తిలో 92.75 మి.మీ. వర్షపాతం నమోదైంది.


నెల్లూరు జిల్లా కోవూరు శాంతినగర్‌లో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

సీమ, దక్షిణ కోస్తాలో అతిభారీ వర్షాలు

అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడ్రోజుల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవొచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మంగళవారం పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. 'తీరం వెంబడి గంటకు 40-60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. 17 వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదు' అని సూచించారు. నెల్లూరు జిల్లాలో సముద్రంలో వేటకు వెళ్లిన 161 బోట్లను వెనక్కు రప్పించారు. నెల్లూరు జిల్లా కావలి, కొడవలూరులోని కొన్ని ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షాలకు దక్షిణ కోస్తా, సీమల్లో లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతాయని, రోడ్లు, కమ్యూనికేషన్స్ వ్యవస్థకు అంతరాయం కలుగుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాగా.. అరేబియా సముద్రంలో తీవ్ర అల్పపీడనం బలపడి సోమవారం వాయుగుండంగా మారింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి మంగళవారానికి బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

నెల్లూరు జిల్లాలో భారీ వర్షం

నెల్లూరు హరనాథపురం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : నెల్లూరు జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. సగటు వర్షపాతం 95.4 మి.మీగా నమోదైంది. నెల్లూరు నగరంలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

గంటసేపు ఆగిన వందేభారత్

భారీ వర్షాలతో బాపట్ల జిల్లా పొన్నూరు సమీపంలో రైల్వే ట్రాక్ ధ్వంసమైంది. దీంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతి బయలుదేరిన వందేభారత్ రైలు మాచవరం స్టేషన్‌లో గంటసేపు నిలిచిపోయింది. అనంతరం మూడో రైల్వే ట్రాక్ మీదుగా బాపట్ల స్టేషన్‌కు వెళ్లింది. పొన్నూరు సమీపంలో రైల్వే ట్రాక్ ధ్వంసం కావటంతో విజయవాడ-బాపట్ల మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.

తిరుమలలో ముసురు


తిరుమలలో పడుతున్న వర్షం

తిరుమల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో తిరుమలలో ముసురు వాతావరణం నెలకొంది. సోమవారం వేకువజామున భారీగా మొదలైన వర్షం చిరు జల్లుల రూపంలో రాత్రి వరకు కొనసాగింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈవో ఆదేశించారు.

మేం ఇక్కడే ఉంటాం!

- మళ్లీ క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్‌లు
- కేంద్రం ఉత్తర్వులపై సవాల్
- తెలంగాణలోనే ఉంటామన్న ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రొనాల్డ్‌రోస్
- ఏపీలోనే ఉంటానంటూ సృజన వేర్వేరు పిటిషన్లు
- నేడు విచారణ.. మధ్యంతర ఉత్తర్వులపై ఉత్కంఠ

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర విభజన సందర్భంగా చేపట్టిన క్యాడర్ కేటాయింపుల ప్రకారం.. ఏపీ, తెలంగాణకు కేటాయించిన అధికారులు ఆయా రాష్ట్రాలకు వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. ఏ రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అదే రాష్ట్రానికి వెళ్లాలంటూ ఈ నెల 9న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన రిలీవింగ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు ఐఏఎస్ అధికారులు మళ్లీ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)-హైదరాబాద్‌ను ఆశ్రయించారు. తాము ప్రస్తుతం పని చేస్తున్న రాష్ట్రంలోనే ఉంటామని, కేంద్రం ఇచ్చిన అస్పష్ట ఆదేశాల (నాన్ స్పీకింగ్ ఆర్డర్)ను కొట్టేయాలని కోరారు. ఈ మేరకు కాట ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్, గుమ్మడి సృజన, రొనాల్డ్‌రోస్.. క్యాట్‌లో వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీరి పిటిషన్లు మంగళవారం లతా బస్వరాజ్ పాట్నే, శాలినీ మిశ్రా బెంచ్ ఎదుట విచారణకు రానున్నాయి. ఏడాది ఏప్రిల్, మే నెలల్లోనే అధికారులు తాము ఇక్కడే ఉంటామంటూ కేంద్రానికి వినతిపత్రాలు అందజేయగా ఆ విజ్ఞప్తులను కేంద్రం తోసిపుచ్చింది. తొలుత కేటాయించిన రాష్ట్రాల్లోనే ఈ నెల 16న రిపోర్ట్ చేయాలని ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

కేంద్రం ఆదేశాలను కొట్టేయాలి..!

తాము ఇన్నేళ్లుగా పనిచేసిన రాష్ట్రాన్ని వదిలేసి కొత్త రాష్ట్రంలో రిపోర్ట్ చేయాలని కేంద్రం పేర్కొనడం సరికాదని, క్యాడర్ విభజనలో పలు లోపాలు ఉన్నాయంటూ ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, సృజన, రొనాల్డ్‌రోస్.. తాజా పిటిషన్‌లలో పేర్కొన్నారు. ఒక్కో అధికారి కేసును ప్రత్యేకంగా పరిశీలించి స్పష్టమైన ఆర్డర్ ఇవ్వాలని హైకోర్టు పేర్కొన్నప్పటికీ.. కేంద్రం నాన్ స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. ఈ ఆదేశాలను కొట్టేయడం ద్వారా తాము ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. మంగళవారం జరగనున్న విచారణలో అధికారులకు అనుకూలంగా క్యాట్ మధ్యంతర ఉత్తర్వులు ఇస్తేనే వారు తెలంగాణలో కొనసాగుతారు. లేదంటే వారంతా తమకు కేటాయించిన రాష్ట్రానికి వెళ్లిపోవాల్సి వస్తుంది. మరికొందరు అధికారులూ క్యాట్‌లో పిటిషన్లు వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.